తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 122 పేజీలు: 10+4 వెల: 6.50



JEE-ADVANCED 2026

ఓపెన్ కేటగిరీ టాప్ 20లో 7 నారాయణ సాధించిన ర్యాంకులు అంటే టాప్ 20లో 35% ఫలితాలు నారాయణవే

JEE ADV - 2026

ఓపెన్ కేటగిరీ టాప్ 25లో నారాయణ సాధించిన ర్యాంకులు 10 అంటే టాప్ 25లో 40% ఫలితాలు నారాయణవే

నారాయణ విద్యాసంస్థలు www.narayanagroup.com



47 YEARS OF EXCELLENCE

JEE ADV. 2026

SRAMAYEVA JAYATHE

NARAYANA® EDUCATIONAL INSTITUTIONS

## ఆల్ ఇండియా OPEN CATEGORY లో టాప్ 100 లో 36 ర్యాంకులతో JEEని శాసించిన నారాయణ

KARNATAKA STATE TOPPER

1

IIT BOMBAY రీజియన్ టాపర్

B JAYAKRISHNA SRINIVAS
Roll No: 261033130
nPrep



## అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 10లో నారాయణ విద్యార్థులు సాధించిన ర్యాంకులు

2nd RANK — T SAI VINEEL, Roll: 266138122

4th RANK — V HARSHITH, Roll: 266053091

5th RANK — KUCHI SANDEEP, Roll No: 266121063, Narayana School Student

6th RANK — B JAYAKRISHNA SRINIVAS, Roll No: 261033130, nPrep

6th RANK — ISHAN GUPTA, Roll: 262059043

6th RANK — KALLURI JOSHIKA, Roll: 266052008

7th RANK — PREETAM M, Roll: 261062456

9th RANK — NAGAKETHANA .T, Roll: 266131060

తెలుగు రాష్ట్రాల నుంచి అచ్చ తెలుగు విద్యార్థికి వచ్చిన బెస్ట్ ఆలిండియా ర్యాంక్

5th RANK

అది సాధించింది నారాయణ మాత్రమే
ఏ ఇతర విద్యాసంస్థకి అచ్చ తెలుగు విద్యార్థితో ఇంతకన్నా బెస్ట్ ర్యాంక్ రాలేదు.

## ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీ టాప్ 100లో నారాయణ విద్యార్థులు సాధించిన ర్యాంకులు

AIR 5 — KUCHI SANDEEP, Roll No: 266121063, Narayana School Student

AIR 6 — B JAYAKRISHNA SRINIVAS, Roll No: 261033130, nPrep

AIR 13 — MANU PARAMESHWARAN, Roll No: 261049023, Classroom Student

AIR 14 — PRINCE CHOUDHARY, Roll No: 262092058, nPrep

AIR 15 — VELDURTHI HARSHITH, Roll No: 266053091, Narayana School Student

AIR 16 — TANAY AGARWAL, Roll No: 262078257, nPrep, Narayana School Student up to class X

AIR 20 — ANISH MUPPALLA, Roll No: 266131526, nPrep

AIR 22 — ADITYA PAVANKUMAR T

AIR 23 — A VENKATA HEMANTH KUMAR REDDY

AIR 24 — T SAI VINEEL

AIR 27 — ABHIPRAY, nPrep

AIR 33 — KOUSTUB DESPANDAY, nPrep

AIR 35 — UTKARSH

AIR 39 — MADHAV VIRADIYA

AIR 41 — SNEHAL ROY CHOUDHURY

AIR 44 — YASH YADAV, nPrep

AIR 51 — MOPURI VEDA CHARAN REDDY

AIR 54 — KOTA YASHWIN

AIR 57 — PIYUSH DAKAD, nPrep

AIR 58 — SHRESTH SURAIYA

AIR 60 — AGASTYA REMANI

AIR 61 — VIVAN SHARAD MAHISWARI

AIR 63 — DEEKSHANT SHARMA, nPrep

AIR 71 — PRANEEL DEBNATH, nPrep

AIR 72 — NISHKARSH SINGH

AIR 75 — DORANALA BHAVITESH REDDY

AIR 78 — ADULA SAI NIKITH

AIR 79 — VISHRUT BHATT, nPrep

AIR 80 — TELLURI SHREYAS REDDY

AIR 83 — SHIVAM JYOTI

AIR 84 — ARNAV JAIN

AIR 88 — BEJUGAMA ANSHUL

AIR 89 — THAMMINA GIRISH

AIR 98 — ANSHU, nPrep

AIR 99 — RUCHIT AGARWAL, nPrep

AIR 100 — ISHAN GUPTA

ఓపెన్ కేటగిరీ టాప్ 20లో నారాయణ సాధించిన ర్యాంకులు 7
అంటే టాప్ 20లో 35% ఫలితాలు నారాయణవే

ఓపెన్ కేటగిరీ టాప్ 25లో నారాయణ సాధించిన ర్యాంకులు 10
అంటే టాప్ 25లో 40% ఫలితాలు నారాయణవే

#YourDreamsAreOurDreams Call: 1800 102 3344 | www.narayanagroup.com

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

nPrep: Narayana Digital Learning Programme


47 YEARS OF EXCELLENCE
SRAMAYEVA JAYATHE
NARAYANA®
EDUCATIONAL INSTITUTIONS
JEE ADV. 2026
అన్ని కేటగిరీలలో ఆలిండియా 100 లోపు నారాయణ సాధించిన ర్యాంకులు
1 S R V S S LAKSHMI Roll: 265013007 Prep
2 T SAI VINEEL Roll: 266138122
2 RAGULA ABHINAV SAI Roll: 266131013 Prep
4 VELDURTHI HARSHITH Roll: 266053091
4 PALDE MANJUNATH Roll: 266179005 Prep
4 DAPPU THANVI SRI. Roll: 266145575 Prep
5 KUCHI SANDEEP Roll: 266121063
6 B JAYAKRISHNA SRINIVAS Roll No: 261033130 nPrep
6 ISHAN GUPTA Roll: 262059043
6 B NAVEEN NAICK Roll: 266053362 Prep
6 KALLURI JOSHIKA Roll: 266052008
7 PREETAM MAILARE Roll: 261062456
7 G VENKATA SATHWIK Roll: 266060020 Prep
7 MARKAPUDI ANVESH Roll: 266011001 Prep
9 GUNDEBOINA YOGI Roll: 266131058 Prep
9 NAGAKETHANA REDDY.T Roll: 266131060
10 GUGULOTH VEERANNA Roll: 266137207 Prep
And Many More....
IIT-JEE LONG TERM CLASSES COMMENCE : 10-06-2026
ADMISSIONS OPEN FOR INTER 2026-28
అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 10 ర్యాంకులు 8
అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 50 ర్యాంకులు 71
అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 100 ర్యాంకులు 149
TOTAL SELECTIONS 4501
#YourDreamsAreOurDreams
Toll Free: 1800 102 3344 | www.narayanagroup.com
Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice
As per the information received at the time of publication

వాకిలి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
తిరుపతి
fb.com/vaartha Digital
Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 122 పేజీలు: 10+4 వెల: 6.50

పరస్పర దాడులతో వేడెక్కిన పశ్చిమాసియా
ప్రముఖ గాయని సుమన్ కల్యాణ్‌పూర్ కన్నుమూత
5లో



సోమవారం చామవరం గ్రామ ప్రజావేదిక సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు

## ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా 'సంజీవని'

### రీజియన్లుగా విభజించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

### విధ్వంసమే గొడ్డలి పార్టీ విధానం

## తుని పర్యటనలో సిఎం చంద్రబాబు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరోతుని,జూన్1, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విధ్వంసమే గొడ్డలిపార్టీ విధానమని, రాష్ట్రంలో అధికారం కోల్పోయిన కడుపుమంట తోటే వైసిపి కుట్రలకు పాల్పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలం చామవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పేదల సేవలో ప్రజావేదిక, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలలో విద్వేషాలు రెచ్చగొట్టి విభేదాలు సృష్టించేందుకు వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. వాటిని ప్రజలు గమనించి ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ఈసందర్భంగా చంద్రబాబు నాయుడు కొన్ని సంఘటనలపై సుదీర్ఘంగా ప్రస్తావిం చారు. రాయలసీమ కడపకు చెందిన ఓ పాస్టర్ ఏజెన్సీ ప్రాంతమైన పాడేరుకు వెళ్లి అతనిపై అతనే దాడి చేయించుకుని మత విద్వే షాలు రెచ్చగొట్టే కుట్ర చేయగా పోలీసులు, ప్రభుత్వం ఆ కుట్రను భగ్నం చేశారన్నారు. గొడ్డలి పార్టీ గత ఎన్నికలలో కోడి కత్తి, గులకరాయి వంటి కుట్రలతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నించిందన్నారు. నంద్యాలలో వైయస్ విగ్రహాన్ని వైసీపీ కార్యకర్తలే ధ్వంసంచేసి ఆ నెపాన్ని టిడిపిపై నెట్టే ప్రయత్నం చేస్తే ప్రభుత్వం 20 నిమిషాల్లో కుట్రని భగ్నం చేసి దోషులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ హామీని నెరవేర్చే క్రమంలో వైసిపి అడ్డంకులు సృష్టించేందుకు 241 కేసులు వేసింద >>7

# విశాఖ రైల్వే జోన్ ఆరంభం



సోమవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రం మంత్రి రామ్మోహన్ నాయుడు, తదితరులు

### 12 యేళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం

### ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ఘనంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభోత్సవం

### భావోద్వేగానికి గురైన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

### కేక్ కట్ చేసి కేంద్రమంత్రిని సత్కరించిన ఎమ్మెల్యే గౌతు శిరీష

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జూన్ 1 ప్రభాతవార్త:** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన రైల్వేజోన్ ప్రారంభోత్సవ అధికారిక కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు అత్యంత భావోద్వేగంతో మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ సాధన కోసం గత 12 సంవత్సరాలుగా తాను సాగించిన సుదీర్ఘ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో పార్లమెంట్‌లో ఈ అంశంపై అనేకసార్లు గళమెత్తానని, ఇదే ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ప్రజాప్రతినిధిగా దీక్షలు కూడా చేపట్టానని పేర్కొన్నారు. 'అనాడు ఒక సామాన్య ప్రజాప్రతినిధిగా ప్రజల పక్షాన నిలబడి పోరాడాను. ఈరోజు కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తరుణంలోనే ఆ కల సాకారం కావడం, నా చేతుల మీదుగానే ఈ జోన్ ప్రారంభం కావడం నా జీవితంలో ఎప్పటికీ మరువలేని మహత్తర ఘట్టం' అని హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నుండి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక పరిపాలన ప్రారంభమైందని కేంద్ర మంత్రి వెల్లడించారు. నూతన జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికంగానే త్వరితగతిన పరిష్కారాలు లభిస్తాయని, పరిపాలన మరింత సులభతరం అవుతుందని చెప్పారు. గతంలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు కూడా ఉత్తరాంధ్రకు రైల్వేజోన్ సాధించడమే లక్ష్యంగా విశేష కృషి చేశారని, వారి ఆశయాలను ఈరోజు నెరవేర్చగలిగామని సగర్వంగా ప్రకటించారు. దాదాపు పుష్కర కాలంగా ఈ పవిత్ర ఆకాంక్షను భుజాలపై మోస్తూ, చివరకు అనుకున్నది సాధించామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.3,300 కోట్ల భారీ వ్యయంతో 50కి పైగా రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో ఇచ్ఛాపురం ప్రాంతానికి కూడా ఒక కీలకమైన ఆర్‌ఓబీ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణ ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న వంతెన సమస్యకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనే పూర్తిస్థాయి ముగింపు పలుకుతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పట్టణ ప్రగతికి, ప్రజల రవాణా సౌకర్యాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా శాశ్వత పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే, నూతనంగాసాధించిన పూరి- అహ్మ >>7


సోమవారం ముంబయిలో ఎయిర్ ట్రంక్ సిఇఒ రాబిన్ ఖుదాతో భేటీ అయిన మంత్రి నారా లోకేష్

## విశాఖలో ఎయిర్‌ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయండి

### సంస్థ సిఇఒ రాబిన్ ఖుదాతో మంత్రి లోకేష్ భేటీ

### కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు ఎపికే ఎక్కువ: మంత్రి

**విజయవాడ,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రఖ్యాత హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబాయిలో సమావేశమయ్యారు. ఆసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్, ఆస్ట్రేలియా, జపాన్, మలేషియా, హాంకాంగ్, సింగపూర్ లలో ఎయిర్ ట్రంక్ భారీ డేటా సెంటర్లను నిర్మించి నిర్వహిస్తోంది. ఈ భేటీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ...ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా వైజాగ్ ఆవిర్భవిస్తోంది. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీకనెక్స్ ఇతర ప్రధాన ప్రాజెక్టులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు అన్నివిధాలా అనుకూలతలు కలిగిన విశాఖపట్నం డేటా సెంటర్ హబ్ గా వేగంగా అభి వృద్ధి చెందుతోంది. విశాఖ నగరంలో 6 గిగావాట్ల డేటా >>7

## జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో తెలుగు హవా


శుభమ్ కుమార్


ఆరోహి దేశ్‌పాండే


ఎం.నాగ సహర్ష

### 5వ ర్యాంక్: కె.సందీప్, 9వ ర్యాంక్: ఎం.నాగ సహర్ష

### 330 మార్కులతో బీహార్ విద్యార్థి శుభమ్ కుమార్ టాపర్

### మహిళల్లో ఆరోహి దేశ్‌పాండే (280) టాపర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 1:** దేశంలోని ఐఐటీల్లోని బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) అడ్వాన్స్‌డ్-2026లో బీహార్‌కి చెందిన శుభమ్ కుమార్ 330 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. మహిళల విభాగంలో ఆరోహి దేశ్‌పాండే 280 మార్కులతో టాపర్‌గా నిలిచింది. తెలుగు విద్యార్థులు ఇద్దరు టాప్-10లో చోటు దక్కించుకున్నారు. 318 మార్కులతో కుచి సందీప్ ఆలిండియా 5వ ర్యాంక్‌ను సొంతం చేసుకోగా, 312 మార్కులతో మెడిశెట్టి నాగ సహర్ష 9వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. మంగళవారం నుంచి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలను ఐఐటీ రూర్కీ ఆదివారం అర్ధరాత్రి విడుదల చేసింది. అధికారిక షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 10 గంటలకు ఫలితాలు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ, ముందుగానే ఆదివారం అర్ధరాత్రే ప్రకటించింది. అభ్యర్థులు తమ ఫలితాలను జేఈఈ అడ్వాన్స్‌డ్ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఐఐటీ రూర్కీ ప్రకటించింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026లో బిహార్‌కు చెందిన శుభమ్ కుమార్ 360 మార్కులకుగాను 330 మార్కులు సాధించి జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. కబీర్ చిల్లర్ ఆల్ ఇండియా 2వ ర్యాంక్‌ను సాధించగా, జతిన్ చాహర్ మూడో స్థానంలో నిలిచారు. తెలుగు రాష్ట్రాల నుంచి విశా ఖపట్నానికి చెందిన కుచి సందీప్ ఆల్ ఇండియా 5వ ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026కు 1,87,389 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 1,79,694 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 56,880 మంది అర్హత సాధించగా అందులో 10,107 మంది బాలికలు, 46,773 మంది బాలురున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారు దేశంలోని 23 ఐఐటీల్లో బీటెక్ కోర్సుల కోసం పోటీ పడనున్నారు.

మంగళవారం నుంచి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించనుంది. విడతల వారీగా కౌన్సెలింగ్‌ను కొనసాగిస్తూ జులై నాటికి కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేయనుంది. 2025-26 విద్యా సంవత్సరంలో 23 ఐఐటీల్లో 18,160 ఐఐటీ సీట్లు అందుబాటులో ఉండగా ఈ ఏడాది అదనంగా మరో 300 సీట్లు పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## గురుకుల, సొసైటీ పాఠశాల ఉద్యోగుల రిటైర్మెంట్ పెంపు

**విజయవాడ, జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో15 వేల మంది ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల, సొసైటీ పాఠశాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు రంగం సిద్ధమైంది. అందుకు సంబంధించిన ఫైల్స్ పై సీఎం చంద్రబాబు సంతకం చేసారు. త్వరలోనే క్యాబినెట్‌కు పంపే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది ఉద్యోగులకి ఊరట లభించిందని ఆయా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తోపాటు అధికారులకు ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి లోకేష్ రష్యాలో పర్యటన 7లో




## 'సుప్రీం'కు మరో ఐదుగురు జడ్జిలు

### కేంద్రం ఆమోదం, 37కు పెరిగిన న్యాయమూర్తుల సంఖ్య

**న్యూఢిల్లీ, జూన్ 1:** సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. దీంతో అపెక్స్ కోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరగా, ఇటీవల మంజూరైన న్యాయమూర్తుల సంఖ్యను విస్తరించిన తర్వాత కేవలం ఒక ఖాళీ మాత్రమే మిగిలింది. న్యాయ మంత్రిత్వ శాఖ జారీ చేసిన వేర్వేరు నోటిఫికేషన్లలో, సీనియర్ న్యాయవాది వెంకిట సుబ్రమణి మోహన, బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, పంజాబ్-హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగు, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా, జమ్మూ కాశ్మీర్-లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ పల్లిల నియామకాలను కేంద్రం ఆమోదించింది. నియమితులైన వారు ప్రమాణ స్వీకారం చేసి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా లాంఛనంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ నియామకాలు అమల్లోకి వస్తాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమం జూన్ 2న జరిగే అవకాశం ఉంది. మే 27న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సు మేరకు ఈ నియామకాలు జరిగాయి. కేంద్రం నాలుగు రోజుల్లోనే ఐదు పేర్లనూ ఆమో దించింది. గత నెలలో జారీ చేసిన >>7



## మయన్మార్‌లో శాంతి చర్చలకు భారత్ సంపూర్ణ మద్దతు

### అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్‌తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు

### వాణిజ్యం, పెట్టుబడులు, సరిహద్దు భద్రత నిర్వహణలో సహకారం

**న్యూఢిల్లీ, జూన్ 1:** వాణిజ్యం, పెట్టుబడులు, అనుసంధానం, అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్య పెంపు, భద్రత, సరిహద్దుల నిర్వహణ వంటి రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసు కెళ్లేందుకు, సహకరించుకునేందుకు భారత్, మయన్మార్ దేశాలు నిర్ణయించాయి. సోమారం న్యూఢిల్లీ లోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లేయింగ్ విస్తృత చర్చలు జరిపారు. భారత్- మయన్మార్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలో పేతం లక్ష్యంగా సమాలోచనలు >>7

## పన్నులు ఎగ్గొడితే కొరడా

### పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలా?

### రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా సక్రమంగా చెల్లించాలి

### ఆంధ్రా పేపర్‌మిల్స్ రూ.19 కోట్ల బకాయిలు: డి.సిఎం పవన్


సోమవారం పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశ్రమలు, పంచాయతీలకు పన్ను చెల్లించకపోవడంపై పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లాభాలు సంపాదించే పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలాగని అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు కట్టకపోవడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆంధ్రా పేపర్ మిల్స్ రూ.19 కోట్లు బకాయిలు పెట్టిందని గుర్తు చేశారు. విద్యాసంస్థలు కూడా భారీగా పన్ను బకాయిలున్నాయన్నారు. రాష్ట్రంలో పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకుపైగా వస్తాయని వివరించారు. పంచా యతీ రాజ్‌శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్షించారు. పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి పన్ను వసూ ళ్లు ఎందుకు సరిగా ఉండటం లేదని అధికారులను అడిగారు. రాజధాని నుంచి ఉన్నతాధికారులతో కలిసి పవన్ నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. తమ ప్రాంతాల్లో పన్ను వసూళ్ల వివరాలను పంచుకున్నారు. పన్నులు చెల్లించని కారణంగా ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు కూడా ఇబ్బందులు తలెత్తాయన్నారు. పేదలు, కులవృత్తులవారు, చిరుద్యోగులు కూడా పన్నులు చెల్లిస్తున్నారన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు పన్నులు కట్టని విషయం ప్రజలకు తెలియదన్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా పన్నుల విషయంలో ముందుకెళ్లాలని అధికారులకు పవన్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సీఎంతో పాటు మంత్రివర్గంతోనూ మాట్లాడతానని పవన్ అధికారులతో చెప్పారు. పల్స్ సర్వే తరహాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నుల వసూళ్ల కార్యాచరణ చేపట్టాలని అధికార యంత్రాంగానికి ఈ సందర్భంగా పవన్ దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో ఏపీ అత్యుత్తమ పనితీరు కనబరిచిందన్నారు. మొత్తం ఆరు అవార్డులు సాధించిన కర్ణాటక రాష్ట్రం >>7

## భారీ వర్ష సూచన

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**విజయవాడ జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రాగల రెండు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అంతేకాదు విశ్వాఖపట్నం , అనకాపల్లి, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల పల్నాడు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లోఅలర్ట్ జారీ చేసింది. గత కొన్ని రోజులుగా భా నుడి భగభగలతో అల్లాడిపోతున్న జను లకు ఈ వర్షాల కారణంగా ఉపశమనం లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్ర తలు గణనీయంగా తగ్గుముఖం పడతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే దక్షిణ కోస్తా తీర ప్రాంతాల్లో ఈదురు గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు >>7

వార్త

ఏ పని అయినా తరచూ చేస్తూంటేనే ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటును కొనసాగిస్తే మనసులో పాతుకుపోతుంది.

న-ఎడ్వర్డ్స్


# 'సర్' ఇక పాశుపతాస్త్రమే!

ఎట్టకేలకు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)కు పూర్తిస్థాయి చట్టబద్ధత లభించింది. నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగం నిర్దేశించిన ఆదేశిక సూత్రాలకు ఈ ప్రక్రియ జీవం పోస్తుందని వ్యాఖ్యానించింది. ఎన్నో అనుమానాలు, అపార్థాలు ఎన్నో అవరోధాలు, ఆందోళనల మధ్య'సర్' ప్రక్రియ ఎన్నో మార్పులు, సూచనలు సలహాలతో ఒక పటిష్టమైన ఓటరు గుర్తింపు ప్రక్రియ రూపు దాల్చినట్లుగా ఉంది. 'సర్' ప్రక్రియలో పారదర్శకత లోపించిందని కేవలం విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఆయా పక్షాలను ఓటమిపాలు చేయడానికే ఈ ప్రక్రియ ఉపయోగపడ్తోందని, ఎన్నో అనుమానాలతో విపక్షాలు చాలా కాలంగా రాద్ధాంతం చేస్తున్నాయి.నిన్నమొన్నటి వరకు బీహార్‌లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో ఒకే రకమైన ఆరోపణలు, రచ్చ అన్నీ పూర్తయ్యాక తాజాగా శంఖంలో పోసిన తీర్థం మాదిరి 'సర్' ప్రక్రియ పరమపవిత్ర ఎన్నికల ప్రక్రియ, ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ఆవశ్యకమేనని సుప్రీం ధర్మాసనం భాష్యం చెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 21(3) ప్రకారం ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణలు చేపట్టేందుకు ఎన్నికల కమిషన్‌కు ప్రత్యేక అధికారాలు ఉన్నట్లు ధర్మాసనం ధృవీకరించింది. బీహార్‌లో 'సర్' ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్‌లపై పూర్తి స్థాయి విచారణ అనంతరం ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరపాలన్న రాజ్యాంగ నిర్దేశిత సూచనలను ముందుకు తీసుకెళ్తుంది. ఈ ప్రక్రియలో ఏ చట్టమూ ఉల్లంఘనకు నోచుకోలేదు.ఏరాజ్యాంగ నిబంధనకూ వ్యతిరేకంగా జరుగలేదని ధర్మాసనం స్పష్టంగా పేర్కొంది. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ 'సర్' జీవనాడి వంటిదని సుప్రీం కోర్టు తీర్పు వచ్చాక కూడా కొన్ని రాష్ట్రాల్లో నిరసన శబ్దాలు తలెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ, మరికొన్ని రాష్ట్రాల్లోనూ బిజెపి నెగ్గేందుకు 'సర్' ముందు వచ్చిన విమర్శల బాపతు టక్కుటమార గోకర్ణ విద్యలకేమీ ఆస్కారముండని విధంగా కన్నేసి ఉంచాలని కొన్ని ప్రాంతీయ పార్టీలు చప్పుడు చేశాయి. నిజానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసిన అంశాలపై మరో మాటమాట్లాడేందుకు ఎవరూ సాహసించరు. 'సర్'ను ఆట పట్టించే విపక్షాలు ఇక పైనున్నా గొంతు సవరించుకోవడం మంచిది. ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాలు, వివిప్యాట్ స్లిప్‌ల విషయంలో ఆరోపణలొచ్చి దశాబ్ద కాలమైనా వాటిపైన ఇంకా పలు చోట్ల చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. వాటిలో లోపాలున్నాయని గెలిచిన వారు, ఓడిన వారి మధ్య మాటలు అటూ ఇటూ మారుతుంటాయి. అలాంటి పరిస్థితులు 'సర్' విషయంలో రారాదు. 'సర్' విషయంలో సుప్రీం ధర్మాసనమిచ్చిన తీర్పుతో తాము గౌరవ ప్రదంగా ఏకీభవించలేకపోతున్నట్లు కాంగ్రెస్ చెప్పనే చెప్పింది. 'సర్' ప్రక్రియ అమలు నేపథ్యంలో విస్తృతంగా అనుమాన పడిన అంశాల్లో ఓటు పౌరసత్వం లింక్‌పై ధర్మాసనం స్పష్టంగా చెప్పడమొక్కటే కాస్త ఊరట కలిగించే విషయం. ఓటరు జాబితా ద్వారా ఒక వ్యక్తి పౌరసత్వాన్ని అంతిమంగా నిర్ధారించే అధికారం ఎన్నికల కమిషన్‌కు లేదనిస్పష్టంగా పేర్కొంది. గుర్తింపు కార్డుల విషయంలో ధర్మాసనం పలు మార్గదర్శకాలిచ్చినట్లే మరికొన్ని అంశాల విషయంలో ఓటరుకు పలు ఉపశమనాలివ్వడం విశేషం. ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన అత్యద్భుత ఓటర్ల జాబితా సవరణ ఏదైనా ఉందంటే అది తమదేనని కాలర్ ఎగరేసి చెప్పుకునేందుకు కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు పట్టు చిక్కింది. ఓటర్ల జాబితా సవరణ అనగానే ఎన్నికలు వచ్చే ముందు రోజుల్లో పలకరించి వెళ్లే ప్రక్రియ కాదని, దానిలోనూ చెప్పుకోదగిన మతలబులున్నాయని విపక్షాలు కోడైకూసాయి. ఈ ప్రక్రియకు ఇటీవలనే సుప్రీం ధర్మాసనం కితాబివ్వడంతో చట్టబద్ధత ఏర్పడినట్లయింది. కేవలం సెక్యులర్ ఓటర్లను ఓటర్ల జాబితాలో కొన్ని వర్గాలపై, వారి వలసలపై,వారి జాతులపై వచ్చిన విమర్శలు, వారి వ్యవహారాలు వాటన్నిటిపై లేవనెత్తిన సందేహాలకు ఆదిలో సరైన జవాబులు దొరక్క విపక్షాలు ఎన్నికల కమిషనర్‌పై ఆగ్రహోద్రగ్యులయ్యాయి. న్యాయసమ్మతమైన ఓటర్ల జాబితా సవరణ జరగకపోతే ప్రతిపక్ష సానుభూతిపరులు ఓట్లకే ఎసరు పెడ్తారని అందుకే తమ ఓటర్లను కాపాడుకునేందుకుతరచు ఎన్నికల కమిషన్‌తో విపక్షాలు తగవుకు దిగాయి. పలు సందర్భాల్లో విపక్షాల నిరసనగొంతు వినపడింది కూడా. వివిధ సీజన్‌లలో పనిపాటల కోసం పొరుగూర్లకు వెళ్లే వారి ఓటర్ల పేర్లను కూడా తీసేయడం మొదట్లో కొంత అలజడి సాగింది. అలా ఏదో కారణం చూపిన ఎత్తున ఓటర్లకు ఓటు హక్కు లేకుండా చేస్తున్నారని గుసగుసలు బయలుదేరాయి. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో 90 లక్షలకుపైగా ఓట్లను తొలగించి, కేవలం 30 లక్షల ఓటర్లను వెరిఫికేషన్ తర్వాత చేర్చుకొన్నారు. ఈ కారణం చేతనే తృణమూల్ పార్టీ ఘోర పరాజయం పొందిందన్న అప్రపథనెదుర్కొంది. ఒకసారి బీహార్‌లో ఎంతో స్వచ్ఛంగా సమగ్రంగా ఓటర్ల జాబితా కూర్పు జరిగి ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయన్న ప్రశంసలు పొందిన ఎన్నికల కమిషన్ తదనంతరం పశ్చిమ బెంగాల్ నుంచి అదే మాదిరి ఆదేశాలతో ముందడుగువేసింది. ఎన్నికల కమిషన్ ఒకపక్క ఆరోపణల మెట్టునూ ఎక్కి అగ్ని పరీక్షలో గెలిచింది. 'సర్' ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో తమ హక్కును నిరూపించేందుకు ఓటర్లకు ఎన్నో కష్టాలుపడాల్సి వచ్చింది.ఎన్నో ఆపసోపాలు పడినాకేంద్ర ఎన్నికల సంఘం బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికలను గట్టెకించింది. 'సర్'కు ధర్మాసనం ఇచ్చిన చట్టబద్ధత, ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ అనంతరం సిఇసి తన ఘనత నిలబెట్టుకుంది.



కోపం ఒక ఘనత అనుకొని, లాభం అనుకుని దానికి లొంగిపోయిన వారికి అందువల్ల కలిగే కీడు అనుభవించక తప్పదు.

తిరుక్కురళ్



చదవడం వల్ల ప్రయోజనం ఏమిటంటే నలుమూలల నుంచి వచ్చే విజ్ఞానాన్ని అంగీకరించడం దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవడం.

మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### రైతుకు భరోసా కావాలి

తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు అంశం ప్రతి సీజన్‌లో రాజకీయవేడిని రాజేస్తున్నప్రధాన సమస్యగా మారింది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను తామే కొనుగోలు చేస్తున్నామని ప్రకటిస్తుంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎఫ్‌సీఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా)ధాన్యంసేకరణలో కీలక పాత్ర పోషిస్తోందనే వాస్తవం అందరికీతెలిసిందే. అయినప్పటికీ ఈఅంశాన్ని స్పష్టంగా రైతులకు వివరించాల్సి నరాజకీయ పార్టీలు పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలం గడుపుతున్నాయి. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండూ ధాన్యం కొనుగోలు అంశంపై ఒకదానిపై ఒకటి విమర్శలు గుప్పించుకున్నాయి. కొనుగోళ్లపై చర్యలు వీడి బిజెపి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నది.అయితే ఈరాజకీయ పోరాటాలమధ్య అసలు రైతు మాత్రం అయోమయంలో పడిపోయాడు. ధాన్యం కొనేది ఎవరు? బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు సమాధానం దొరకని పరిస్థితి ఏర్పడింది.

- ఇ. సంజీవరెడ్డి, కరీంనగర్

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈ మధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది. అది సహజం, వాస్తవం కూడా. యువకుల సంఖ్య బలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజిక స్థితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### నోడల్ ఆఫీసర్ అవసరం

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న ఆదివాసుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సంస్కృతిని ప్రభుత్వం వీరికి కలిపిస్తున్న హక్కులు, చట్టాలను ఆదివాసులకు తెలియజేయడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్‌లను డిప్యుటేషన్ పద్ధతిలో నియమించాలి.అందుకోసం ట్రైబల్ గురుకులాల్లో పని చేస్తున్న లెక్చరర్, పరిశోధక డాక్టరేట్ లెక్చరర్, రచయితలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ట్రైబల్ స్టడీస్ ఆప్షనల్ సబ్జెక్టు కలిగిన లెక్చరర్‌లను ఆదివాసుల నోడల్ ఆఫీసర్‌గా నియమించాలి.

-కదురు శ్రీనివాస్,వరంగల్

### పొదుపు చేద్దాం!

పాలకులు పంచుతున్న ఉచితాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింత క్రుంగదీస్తున్నాయి. అధికారం కోసం ఎవరికి తోచిన విధంగా వారు ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత బియ్యం, ఉచితకరెంటు, ఉచిత బస్సు ఇలాఅన్ని ఉచితాలు ఇస్తుపోతూ రాష్ట్రాలుఅప్పుల్లో కూరుకుపోతున్నాయి.అర్హులను ఆదుకుంటే పర్వాలేదు. కానీ, చాలా మంది అనర్హులు ఉచిత పథకాల వల్ల లబ్ధి పొందుతున్నారు. దాంతో ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది.మన ఆర్థిక పరిస్థితిని మనమే చేతులారా నాశనం చేసుకుంటున్నాం.ఇప్పటికైనా ఈవిషయంలో ఆలోచించి నిరుపేదలకు మాత్రమే ఉచితాలు ఇస్తేబాగుంటుంది. అనర్హులను గుర్తించడం, ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవడం, కష్టం రాకముందే వనరులను సమకూర్చుకోవడం, వాటిని దుబారా చేయకుండా రేపటి కోసం దాచుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### టెట్ పాసైతే ప్రమోషన్!

ప్రజలు ఎన్నుకున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసే చట్టాలను గౌరవించమని కోర్టులు తీర్పులు చెబుతాయి. విద్యా హక్కు చట్టం వచ్చిన తర్వాత టీచర్లు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు రిలేషన్షిప్స్ కంప్లీట్‌గా మారిపోయాయి. టీచింగ్ ఇష్టపడని కోచింగ్ ఇష్టపడే రోజులు వచ్చేసాయి. టీచరుగా చేరడానికి ట్రైనింగ్, ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకోవడానికి ఒక టెస్ట్, ప్రమోషన్ల కోసం డిపార్ట్మెంట్ టెస్ట్‌లు, ఎడ్జ్ ఆఫ్ రిటైర్మెంట్ వరకు కూడా ఏదో ఒక టెస్ట్ రాయమని టెట్ రాయమని చట్టాలు చెబుతూనే ఉంటాయి. 58 సంవత్సరాలకే ప్రభుత్వ ఉపాధ్యాయులని ఉద్యోగ విరమణ చేయించాలి. ఓల్డ్ పెన్షన్ స్కీంలో పెన్షన్ ఇవ్వలేని కారణంగా 58 సంవత్సరాలు దాటి 62సంవత్సరాల లోగా ఉన్న టీచర్లు ఎవరైతే టెట్ పాస్ అయ్యారో వాళ్లకి తక్షణమే ప్రమోషన్లు ఇచ్చి ఉద్యోగంలో చేరినందుకు ఒక ప్రమోషన్ వచ్చింది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### వీధి కుక్కలను నివారిద్దాం

నేడు గ్రామాల్లో వీధి కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. ప్రజలను, వృద్ధులను తరచూ కరుస్తూ గాయాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రజలు బయటికి వెళ్లాలంటే చాలా భయాందోళనకు గురవుతున్నారు. ఈ కుక్కల బెడద వలన కుటుంబాలు మరుగునపడుతున్నాయి. కావున పై అధికారులు వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకుని వీధి కుక్కల బెడద నుంచి ప్రజల్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రపంచ శాంతిని పరిరక్షించేదెవరు?

**అంతర్జాతీయ చట్టాన్ని (ఇంటర్ నేషనల్ లా) గౌరవించే మార్పు దేశాలకు రానంత కాలం ఈ పరి స్థితులు మరింతగా పెరిగే అవకాశం కనపడుతున్నది. పూర్తిగా చట్టాన్ని పరిరక్షించే మాటలు అటుంచి కనీసం చర్యలు తీసుకొని తాత్కాలికంగా అయినా ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి అందరం తోడ్పడక తప్పదు అన్న ఏకాభిప్రాయానికి రావల్సిన అవసరం ఎంతైనా ఉంది. యు.యన్ నిరర్థకంగా మారుతున్నది. అందుకే ప్రపంచంలో శాంతి పరిరక్షణలో కొన్ని యూరప్ దేశాలు, ఆసియాలోని ముఖ్యమైన దేశాలతోపాటు చైనా, భారత్ నార్వేతోపాటు స్కాండినేవియన్ దేశాలు ముందుకు వచ్చి సత్వర చర్యలు శాంతి కోసం పారదర్శకంగా, సమన్వయంతో తీసుకోక తప్పదు. పిల్లికి గంట కట్టడానికి ఎవరు ముందుకు వస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదం తప్పించుకోకపోతే ఏ దేశమూ ఏ ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టలేదు.**



రావులపాటి సీతారాం రావు

ఇదివరకటి కాలంలో జర్నలిస్టులకు పత్రికలలో వార్తలు కానీ కథనాలు రాయటం కానీ తేలిగ్గా ఉండేదని ఆ మధ్య ఒక సీనియర్ రిటైర్డ్ జర్నలిస్టు మాటల్లో చెప్పాడు. అదే ధోరణిలో ఒక రిటైరయిన వ్యాసకర్త వార్తాలోకం అంతా గజిబిజిగా ఉంది. ఒక రోజున డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో యుద్ధం ఆపాం అని చెప్తాడు. మరో రోజు ఇంకా చర్చలు సాగుతూనే ఉన్నాయని అంటాడు. ఇంకో రోజున ఇరాన్‌ను సమూలంగా పెకిలించి వేస్తాం అని చెప్తాడు.ఇరాన్ యుద్ధం ఆపేది లేదు అంటుంది కానీ పాకిస్థాన్‌తో మీడియేషన్‌లో పాల్గొంటుంది. పాకిస్థాన్, అమెరికా దేశం వెంబడి ఉంటూనే లోపాయికారీగా ఇరాన్ కొమ్ముకాస్తుంది. పశ్చిమ ఆసియాలో యుద్ధతతంగం ఇలా ఉంటే అటు పక్క రష్యా, ఉక్రెయిన్ నిప్పుల కొలిమిని ఆరనీయకుండా ఎవరికి వారు రవ్వలను ఆ కొలిమిలో వేస్తూ యుద్ధ జ్వాలలు ఆరనీయకుండా చూస్తూనే ఉన్నారు. సందులో సడేమియా మాదిరి చైనా, రష్యాలు చమురు ఉత్పత్తుల విస్తరణతోపాటు తమకు ఆయాచితంగా ఆయిల్, ఆయుధం ప్రపంచాన్ని శాసించడానికి దొరుకుతే బాగుండునని అటూ ఇటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ డిప్లమసీలో తమ ప్రావీణ్యతను ప్రదర్శిస్తున్నాయి. బలమైన ఏ ఒక్క దేశం ప్రపంచ శాంతి కోసం పాటుపడకపోవడం శోచనీయం. ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితులలో భారత్ మాత్రం సహనాన్ని వీడకుండా అన్ని దేశాల మధ్య సృహృద్భావం నెలకొల్పాలనే సదుద్దేశ్యంతో అవకాశం దొరికినప్పుడల్లా చర్చలూ, సంప్రదింపులూ దేశ ప్రధాని మోడీ ద్వారా కొనసాగిస్తూ తన ఉనికినీ, అంతర్జాతీయ దౌత్య వ్యవహారాలలో తన ప్రావీణ్యతను నిరూపించుకోటానికి అట్టహాసం, ఆర్భాటం లేకుండా ప్రయత్నిస్తూనే ఉంది. అయితే ఇవ్వన్నీ ఎదుర్కొంటూనే ఆర్థిక వ్యవస్థ మన దేశంలో నిర్వీర్యంకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికే కాదు, రాజకీయంలో ఉన్న అందరి నాయకులకూ పారిశ్రామికవేత్తలకూ, ఉత్పత్తిదారులకూ, రాష్ట్రాలను నడిపే ముఖ్యమంత్రులతోపాటు దేశంలోని అధికారులు, పాత కొత్త అనే భేదం లేకుండా అందరికీ వర్తిస్తుంది. ఉద్యోగస్థులు మాకు ఇది పెంచాలి, అది పెంచాలి అని, నిరుద్యోగులు భృతి అడుగుతూ స్వయంగా సంపాదన చేయకుండా కూర్చోటం కానీ, పెన్షనర్లు మాకు పే కమిషన్ రికమెండేషన్స్‌తో నిమిత్తం లేకుండా ఇంకా వచ్చే డబ్బును పెంచాలని కోరటం ఈ పరిస్థితులలో భావ్యం కాదు. అన్నిధరలూ పెరుగుతున్నాయి. మేం ఏం చేయాలి అని వాపోయేబదులు ఏ విధంగా మనం ఉన్నంతలో సరిపుచ్చుకొని దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయకుండా కాపాడాలనే విజ్ఞతతో బాటు బాధ్యతను గుర్తించిన నాడే నిజమైన పౌరులు అని అనిపించుకుంటాం. ప్రస్తుత పరిణామాలు మనం ఊహించినవి కావు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్ ప్రైమ్ మినిస్టర్ ఏ కారణం చేతనో కేరటాలు లేని సము



ద్రాన్ని కదిపారు. ఇరాన్‌ను కట్టడి చేయాలని ఆ రెండు దేశాలూ, ఉక్రెయిన్‌ను కట్టడి చేయాలని రష్యా, ఇండియాకు ఇబ్బందులు ఇబ్బడి ముబ్బడిగా తెచ్చి పెట్టాలని పాకిస్థాన్, చమురు కృత్రిమ కొరత వల్ల ఎంతో కొంత వెనకవేసుకోవాలి అని చైనాతో కొన్ని ఇతర దేశాలు యుద్ధం మనం పొలిమేరల్లోకి వస్తే చూద్దాం అనే ధోరణిలో ప్రవర్తిస్తున్నాయి. తాచెడ్డ కోతి నిలువెల్లా చెరుపుచేస్తుందనే ఆలోచనను సక్రమంగా ఆదేశాలు విశ్లేషించగలుగుతే కలిసికట్టుగా ఈ అనవసరపు ఉపద్రవాన్ని ఆపే ప్రయత్నాలు తలపెట్టే అవకాశాన్ని అయినా ఈపాటికి తీసుకొని ఉండేవారు.గత 100 సంవత్సరాలకుపైన హేగ్, జెనీవా యుయన్ కన్వెన్షన్స్ కొన్ని ఒడంబడికలు, ఆచరణ యోగ్యమైన సూత్రాలు ఆధారంగా మానవ హక్కులు, ఆయుధాల నియంత్రణ, సముద్రాలపై చట్టాలననుసరించి అంతకుమునుపు ఉన్న అరాచకత్వాన్ని పారద్రోలి రూల్స్ ఆధారంగా ఒక ఆర్డరును ప్రపంచానికి సమకూర్చారు. ఇప్పుడవన్నీ ఉల్లంఘించటమే కాకుండా ప్రపంచ శాంతికి, సుస్థిరతకు బీటలు వారే ధోరణిలో ప్రభుత్వాల అధినేతలు కొందరు వ్యవహరించటం దురదృష్టపరిమాణంగా చెప్పక తప్పదు. అప్పుడు ఒప్పుకున్న ముఖ్యమైన మార్గదర్శక సూత్రాల ప్రకారం యుఎన్ ఛార్టర్,సార్వభౌమాధికారాన్ని ఉల్లఘించటం, బలప్రయోగం, దేశాల సరిహద్దులను అతిక్రమించటం నిషేధించింది. కానీ ఇప్పుడు అవే విశృంఖలంగా జరుగుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ (2022లో) ఆక్రమణ 2026లో అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ మీద యుద్ధం తలపెట్టడం, ఆ ఛార్టర్‌లోని నిషేధాన్ని ఘోరంగా ఉల్లంఘించటమే! పైగా ఉల్లంఘనలను సమర్థించుకోటానికి మిలటరీ బలగాలను ఇష్టానుసారం వాడటం పూర్తిగా అన్ని కన్వెన్షన్స్‌ను యుఎన్ భారత్‌ను త్రోసి రాజనటమే అని ఘంటా పథంగా చెప్పక తప్పదు. అంతకు మునుపు కూడా అమెరికా, రష్యా తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోటానికి ఇరాక్ మీద దాడి (2003) సెక్యూరిటీ కౌన్సిల్ రిజల్యూషన్ లేకుండా చేయడం జరిగింది. తరువాత సమర్థించుకొనే ప్రయత్నం అపహాస్యంగా మారింది. ఈ మధ్య ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీని టార్గెట్ చేసి చంపటం కూడా ఆ కోవలోకే వస్తుంది. గాజా లెబనాన్‌ల మీద ఇజ్రాయిల్ నిరంతర దాడులు, బాంబులు వేయడాలు అమాయక పౌరుల ప్రాణనష్టం ఆస్థి నష్టాలను అహంకారంతో ప్రవర్తించే ఈ ప్రభుత్వాల ఆధిపత్య ధోరణి సహించలేని ఎత్తుకు చేరుకుంది. సాధారణ పౌరులు, బలహీన దేశాలు, చివరకు అన్ని దేశాల సభ్య సమాజాలు తల ఎత్త లేని పరిస్థితులను బరితెగించి వీరు ఏర్పరుస్తున్నారు. కేవలం బలమైన దేశాలకే అహంకార ధోరణితో ఉల్లంఘనలు తలపెట్టడం పరిమితం కాలేదు. ఉత్తర సిరియాలోకి టర్కీ దేశం చొరబడటం, ఇలాంటి పరిణామం కిందనే లెక్కించక తప్పదు. అంతర్జాతీయ చట్టాన్ని (ఇంటర్ నేషనల్ లా) గౌరవించే మార్పు దేశాలకు రానంత కాలం ఈ పరిస్థితులు మరింతగా పెరిగే అవకాశం కనపడుతున్నది. పూర్తిగా చట్టాన్ని పరిరక్షించే మాటలు అటుంచి కనీసం చర్యలు తీసుకొని తాత్కాలికంగా అయినా ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి అందరం తోడ్పడక తప్పదు అన్న ఏకాభిప్రాయానికి రావల్సిన అవసరం ఎంతైనా ఉంది. యు.యన్ నిరర్థకంగా మారుతున్నది. అందుకే ప్రపంచంలో శాంతి పరిరక్షణలో కొన్ని యూరప్ దేశాలు, ఆసియాలోని ముఖ్యమైన దేశాలతోపాటు చైనా, భారత్ నార్వేతోపాటు స్కాండినేవియన్ దేశాలు ముందుకు వచ్చి సత్వర చర్యలు శాంతి కోసం పారదర్శకంగా, సమన్వయంతో తీసుకోక తప్పదు. పిల్లికి గంట కట్టడానికి ఎవరు ముందుకు వస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదం తప్పించుకోకపోతే ఏ దేశమూ ఏ ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టలేదు. ●

# నమ్మకం సడలుతున్న పరీక్షా వ్యవస్థ!

టి. శ్రీనివాస్

దేశ భవిష్యత్తును నిర్మించేది విద్యా వ్యవస్థ. ఆ వ్యవస్థకు నమ్మకాన్ని అందించేది పారదర్శకమైన పరీక్షా విధానం. కానీ ఇటీవలి కాలంలో సీబీఎస్‌ఈ, ఎన్టీఏ నిర్వహిస్తున్న పరీక్షల చుట్టూ ఏర్పడుతున్న వివాదాలు, ప్రశ్నాపత్రాల లీకులు, సాంకేతిక లోపాలు, నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలు విద్యార్థుల్లోనే కాకుండా తల్లిదండ్రుల్లో కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఈ పరీ క్షలపై ఆధారపడి ఉండగా, వ్యవస్థపై నమ్మకం దెబ్బ తినడం అత్యంత ప్రమాదకరం. ప్రత్యేకంగా నీట్ పరీక్షల విషయంలో గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న ఆరోపణలు, అవకతవకలు విద్యా రంగంలో పెద్ద సంక్షోభానికి సంకేతంగా మారాయి. కేవలం పరీక్ష నిర్వహణలో చిన్న తప్పిదం కాదు, ఇది దేశ యువత ఆశయాలపై పడుతున్న మచ్చ. చదువుకుని మెరుగైన ర్యాంకు సాధించాలనేవిద్యార్థి కృషిని కొన్ని అక్రమ శక్తులు డబ్బుతో కొనగలుగుతున్నా యనే భావన పెరగడం అత్యంత దురదృష్టకరం. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ, విద్యాశాఖ మొదట చేయాల్సింది విద్యార్థుల విశ్వాసాన్ని పునరుద్ధరించడం. అది కేవలం ప్రకటనలతో సాధ్యం కాదు. నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడిన వ్యక్తులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాలు, అధికారులపై ఉదాహరణగా నిలిచే విధంగా శిక్షలు విధించాలి. తప్పు చేసిన వారు ఎంత ప్రభావశీలులైనా ఉపేక్షించకూ డదు. అప్పుడే వ్యవస్థపై ప్రజలకు మళ్లీ నమ్మకం కలుగు తుంది. ఇక పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానం ద్వారా నిర్వహించడం పారదర్శకతకు కొంతవరకు ఉపయోగకరమనే అభిప్రాయం ఉంది. నిజానికి డిజిటల్ పరీక్షా విధానం వల్ల ప్రశ్నాపత్రాల ముద్రణ, రవాణావంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంది. ప్రశ్నల ర్యాండమైజేషన్ వల్ల ఒకే ప్రశ్నాపత్రం లీక్ అవ్వడం ద్వారా మొత్తంవ్యవస్థ దెబ్బతినే అవకాశాలు కూడా తగ్గుతాయి. అయితే కేవలం సీబీటీ విధానం ప్రవేశపెట్టడం వల్లనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భావించడం పొరపాటు.భారతదేశం వంటి విస్తారమైన దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు సమానంగా లేవు. నగరాల్లో ఉన్న విద్యార్థులకు లభించే సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండవు. చాలాచోట్ల ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, కంప్యూటర్ల కొరత వంటి అంశాలు పరీక్షల నిర్వహణను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఒక చిన్న సాంకేతిక లోపం కూడా విద్యార్థి భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుంది. అందువల్ల సిబిటి విధానాన్ని అమలు చేయాలంటే ముందుగా దేశవ్యాప్తంగా సమగ్ర సన్నద్ధత అవసరం. అత్యంత ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లో సాంకేతిక లోపాలను ముందుగానే గుర్తించే 'ఫెయిల్‌సేఫ్ మెకానిజం' ఉండాలి. సర్వర్లు డౌన్ కావడం, సిస్టమ్ హ్యాంగ్ అవడం, లాగిన్ సమస్యలు, డేటా కోల్పోవడం వంటి సమస్యలు పరీక్షల సమయంలో తలెత్తితే విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. కాబట్టి ప్రతి పరీక్షా కేంద్రంలోప్రత్యామ్నాయ సర్వర్లు, బ్యాకప్ పవర్ సిస్టమ్స్, సాంకేతిక బృందాలు సిద్ధంగా ఉండాలి. ఒక కేంద్రంలో సమస్య వచ్చినా పరీక్ష నిరంతరాయంగా కొనసాగించే సామర్థ్యం వ్యవస్థకు ఉండాలి. ఇంకో కీలక అంశం సైబర్ భద్రత. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షా వ్యవస్థలు కూడా హ్యాకర్ల లక్ష్యంగా మారుతు న్నాయి.విద్యార్థుల వ్యక్తిగత వివరాలు, ప్రశ్నాపత్రాల డేటా బేస్, ఫలితాల సమాచారాన్ని రక్షించడానికి అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు అవసరం. ఇందుకోసం ప్రభు త్వం భారీగా పెట్టుబడులు పెట్టాలి.కేవలం సాఫ్ట్‌వేర్ కొను గోలు చేయడం సరిపోదు, నిరంతర పర్యవేక్షణ, భద్రతా పరీక్షలు, నిపుణుల నియామకం వంటి చర్యలు తీసుకోవా లి. అదేవిధంగా పరీక్షా నిర్వహణలో పారదర్శకత పెరగాలి. ఏ సమస్య వచ్చినా విద్యార్థులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. పరీక్షా తేదీలు మారినప్పుడు, సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు, ఫలితాల ప్రకటన ఆలస్యమైనప్పుడు అధికారుల మౌనం విద్యార్థుల్లో అనుమానాలను పెంచుతుంది. కాబట్టి ఎన్టీఏ వంటి సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు సమయానుకూల సమాచారం అందించాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్యం కూడా ఇక్కడ కీలక అంశమే. ఇప్పటికే తీవ్రమైన పోటీ, కోచింగ్ ఒత్తిడి, కుటుంబ ఆశలు విద్యార్థులపై భారంగా మారుతున్నాయి. దానికి తోడు పరీక్షలపై అనిశ్చితి పెరిగితే వారు తీవ్ర నిరాశకు గురయ్యే ప్రమాదం ఉంది. పరీక్షా వ్యవస్థ న్యాయంగా లేదనే భావన విద్యార్థుల్లో పెరగడం సమాజానికి మంచిది కాదు. ప్రతిభ కంటే అక్రమ మార్గాలు విజయాన్నినిర్ణయిస్తున్నాయనే భావన దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ, ఎన్టీఏ సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. పరీక్షా వ్యవస్థను కేవలం నిర్వహణపరమైన అంశంగా కాకుండా దేశ యువత భవిష్యత్తుతో ముడిపడిన బాధ్యతగా చూడాలి. నమ్మకమే విద్యా వ్యవస్థకు మూలస్తంభం. ఆ నమ్మ

# సమాజంలో మార్పు జనరేషన్ జెడ్‌తోనే సాధ్యం

నల్ల రవి కుమార్

తరాల మార్పులో కాలం ఎప్పుడూ సరికొత్త ఆలోచనలను, సరిహద్దులు లేని ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూనే ఉంటుంది. ఆ క్రమంలో మానవ పరిణామ క్రమంలోనే అత్యంత ఆసక్తికరమైన, ప్రత్యేకమైన తరంగా నిలిచింది 'జెనరేషన్ జెడ్' లేదా క్లుప్తంగా 'జెన్ జెడ్'. సాధారణంగా 1997 నుండి 2012 మధ్య కాలంలో జన్మించిన ఈ తరం యువత, అంతకుముందు తరాల కంటే పూర్తిగా భిన్నమైన వాతావరణంలో పెరిగింది. పాత తరాలు సాంకేతికతను అలవాటు చేసుకుంటే, ఈ తరం మాత్రం సాంకేతికతతోనే కళ్ళు తెరిచింది. ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్గా మార్చేసిన ఇంటర్నెట్ విప్లవం వీరి చేతుల్లోనే రూపుదిద్దుకుంది. అందుకే వీరిని 'డిజిటల్ నేటివ్స్' అని పిలుస్తారు. ఈ డిజిటల్ యుగం వారి జీవన విధానాన్ని, అభిరుచులను, కెరీర్ ఎంపికలను ఎలా ప్రభావితం చేస్తుందో, వారి ఆలోచనల్లోని సానుకూల, ప్రతికూల కోణాలు ఏమిటోఅర్థం చేసుకోవడం నేటి సమాజానికి ఎంతో అవసరం. ఈ తరం ఎదుగుదలలో సాంకేతికత ఒక సాధనం మాత్రమే కాదు, అది వారి శ్వాసగా మారింది. డయల్ అప్ ఇంటర్నెట్ కష్టాలు తెలియని, చేతిలో స్మార్ట్‌ఫోన్, వేగవంతమైన 5జి డేటాతో అప్రయత్నంగా కనెక్ట్ అయిన మొదటి తరం ఇది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సోషల్ మీడియా అల్గారిథమ్ల మధ్య వీరు పెరిగారు. సమాచారం కోసం లైబ్రరీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ప్రపంచంలోని ఏ మూలన ఉన్న విషయమైనా క్షణాల్లో వీరి వేలికొనలపై ప్రత్యక్షమవుతుంది. ఈ అపరిమితమైన సాంకేతిక లభ్యత వారిని ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దింది. భౌగోళిక సరిహద్దులు, భాషా భేదాలు దాటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్కృతులను, ఆలోచనలను వీరు చాలా సులభంగా స్వీకరించగలుగుతున్నారు.ఈ అపారమైన సాంకేతిక ప్రభావం వారి వ్యక్తిగత అభిరుచులపై, జీవనశైలిపై స్పష్టమైన ముద్ర వేసింది. వినోదం, కళలు, సామాజిక సంబంధాల పట్ల వీరి దృక్పథం పూర్తిగా మారిపోయింది. సాంప్రదాయ టీవీ ఛానెళ్లకు బదులుగా ఓటీటీ ప్లాట్ఫారమ్లు,యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ రీల్స్ వంటి స్వల్పకాలిక కంటెంట్ను వీరు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సంగీతం, ఫ్యాషన్, కళల విషయానికి వస్తే వీరు గ్లోబల్ ట్రెండ్స్‌ను అనుసరిస్తారు. ఒక కొరియన్ పాప్ గ్రూప్,లేదా ఒక అమెరికన్ వెబ్ సిరీస్ వీరికి ఎంతగానో నచ్చుతాయి. వీరు కేవలం వినియోగదారులుగా మాత్రమే మిగిలిపోకుండా,స్వయంగా కంటెంట్ సృష్టికర్తలుగా మారుతున్నారు. ఇంటర్నెట్ కల్పించిన వేదికల ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి చాటుకుంటున్నారు.



అలాగే పర్యావరణ పరిరక్షణ, మానసిక ఆరోగ్యం, సమానత్వం వంటి సామాజిక అంశాలపై వీరు సామాజిక మాధ్యమాల్లో గళం విప్పుతూ, తమదైన శైలిలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నారు. కెరీర్ విషయానికి వస్తే, ఈ తరంపాత మూస పద్ధతులను పూర్తిగా తిరస్కరిస్తోంది. తొమ్మిదినుండి ఐదు వరకు చేసే సంప్రదాయ కార్యాలయ ఉద్యోగాలు, స్థిరమైన కెరీర్ అనే పాత తరం భావనల కంటే వీరు 'స్వేచ్ఛ' 'సృజనాత్మకత'కు పట్టం కడుతున్నారు. కేవలం జీతం కోసమే కాకుండా, తాము చేసే పనిలో ఒక అర్థం, సంతృప్తి ఉండాలని వీరు కోరుకుంటారు. సాంకేతికత అందించిన అవకాశాలతో ఫ్రీలాన్సింగ్, డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, యాప్ డెవలప్మెంట్, స్టార్టప్స్ వైపు వీరు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ కూర్చునైనా పనిచేసే 'రిమోట్ వర్క్' లేదా 'హైబ్రిడ్' విధానాన్ని వీరు ఇష్టపడుతున్నారు. సాంప్రదాయ విద్యార్హతల కంటే నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ, నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక స్వతంత్రతను చిన్న వయసులోనే సాధించాలనే పట్టుదల వీరిలో మెండుగా కనిపిస్తుంది. ఈ సరికొత్త తరంఆలోచనా విధానంలో ఎన్నో సానుకూల అంశాలు ప్రశంసించదగినవిగా ఉన్నాయి. వీరు అత్యంత వేగంగా నిర్ణయాలు తీసుకోగలరు. మారుతున్న పరిస్థితులకు త్వరగా అలవాటు పడతారు. వైవిధ్యతను, ఇతరుల భిన్నమైన అభిప్రాయాలను గౌరవించడంలో ఈ తరం ముందుంటుంది. మూఢనమ్మకాలను ప్రశ్నిస్తూ, హేతుబద్ధంగా ఆలోచించడం వీరి ప్లస్ పాయింట్. మానసిక ఒత్తిడి లేదా డిప్రెషన్ వంటి విషయాల గురించి దాచకుండా బహిరంగంగా మాట్లాడటం, అవసరమైతే సహాయం కోరడం వీరిలోని పరిణతిని చూపిస్తుంది. సమాజంలో మార్పు తీసుకురావడానికి డిజిటల్ వేదికలను వీరు ఒక శక్తివంతమైన ఆయుధంగా వాడుకుంటున్నారు. అయితే, నాణేనికి మరో వైపు ఉన్నట్లుగా, ఈ డిజిటల్ జీవనశైలి వీరిలో కొన్ని తీవ్రమైన ప్రతికూలతలను కూడా తెచ్చిపెట్టింది. నిరంతరం స్క్రీన్లకే అతుక్కుపోవడం వల్ల వీరు నిజ జీవిత సామాజిక బంధాలకు, శారీరక కార్యకలాపాలకు దూరమవుతున్నారు. సోషల్ మీడియాలో కనిపించే కృత్రిమమైన ప్రపంచాన్ని చూసి, తమ నిజ జీవితాన్నిదాంతో పోల్చుకుంటూ తీవ్రమైన ఆందోళనకు, అభద్రతా భావానికి లోనవుతున్నారు. ప్రతిదీ క్షణాల్లో జరిగిపోవాలనే డిజిటల్ వేగం వల్ల వీరిలో సహనం,ఏకాగ్రత లోపిస్తున్నాయి. లోతైన విశ్లేషణల కంటే పైపైన కనిపించే సమాచారానికే వీరు త్వరగా ప్రభావితమవుతున్నారు. ఆన్లైన్ ప్రపంచంలో దొరికే తాత్కాలిక గుర్తింపు కోసం ఆరాటపడుతూ, మానసిక ప్రశాంతతను కోల్పోవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రధాన లోపం. ముగింపుగా చెప్పాలంటే, జెనరేషన్ జెడ్ అనేది సమాజ గమనాన్ని మార్చగల అపారమైన శక్తి సామర్థ్యాలు కలిగిన ఒక వినూత్న తరం. సాంకేతికత అందించిన అస్త్రాలతో వీరుప్రపంచాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తున్నారు.ఆన్లైన్ ప్రపంచం సృష్టించేభ్రమలబారినపడకుండా, డిజిటల్ సమతుల్యతను పాటిస్తూ, వాస్తవిక జీవితంలోని విలువలను కూడా అందిపుచ్చుకున్నప్పుడు ఈతరం అనుకున్నదానికంటే అద్భుతమైన విజయాలనుసాధించగలదు.భవిష్యత్తును నడిపించే ఈయువశక్తిని సరైనదిశలో అర్థం చేసుకుని, ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. ●



# పరస్పర దాడులతో వేడెక్కిన పశ్చిమాసియా

## అమెరికా, ఇరాన్ దాడులతో మళ్లీ ఉద్రిక్తత

**టెహ్రాన్, వాషింగ్టన్,జూన్ 1:** మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ పొడిగింపు కోసం దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అమెరికా, ఇరాన్ బలగాలు గత వారాంతంలో డ్రోన్లు, క్షిపణులతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్ దూకుడుకు ప్రతిగా ఆత్మరక్షణ దాడులు జరిపామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించగా, ఇది తమపై జరిగిన దాడికి ప్రతీకార చర్యేనని ఇరాన్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నిఘా పెట్టిన తమ ఎమ్‌క్యూ1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపించింది. దీనికి ప్రతిగా, అమెరికా ఫైటర్ జెట్లు దక్షిణ ఇరాన్‌లోని గోరుక్ ప్రాంతం, క్విష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ వ్యవస్థలు, డ్రోన్ కంట్రోల్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించినట్లు సెంట్‌కామ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో ఇరాన్‌కు చెందిన రెండు సూసైడ్ డ్రోన్లను కూడా ధ్వంసం చేశామని, తమ సైనికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది. అమెరికా దాడులకు ప్రతీకారంగా, సరిక్ ద్వీపంపై దాడిలో పాల్గొన్న ఒక అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు, తమ గగనతలంలోకి ప్రవేశించిన కొన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా నాశనం చేసినట్లు కువైట్ సైన్యం ప్రకటించింది. ఈ దాడుల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 2 శాతం పెరిగి 93.05 డాలర్లకు చేరింది. గత దాడుల్లో ధ్వంసమైన భూగర్భ క్షిపణి టన్నెళ్లను ఇరాన్ వేగంగా పునరుద్ధరిస్తోందని అమెరికా మీడియా కథనాలుప్రచురించాయి. శాటిలైట్ చిత్రాల ఆధారంగా, దెబ్బతిన్న 69 టన్నెల్ ప్రవేశ మార్గాల్లో ఇప్పటికే 50 మార్గాలను ఇరాన్ తిరిగి వినియోగంలోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ పరిణామాలు గల్ఫ్ రీజియన్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి.

# విమానంలో 'బాంబ్' బ్లూటూత్ హైడ్రామా..

## - అమెరికా విమానం యూటర్న్ - న్యూజెర్సీలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

**వాషింగ్టన్, జూన్ 1:** అమెరికాలో ఒక ప్రయాణికుడు తన బ్లూటూత్ పరికరానికి సరదాగా పెట్టిన పేరు పెనుకలకలం సృష్టించింది. 'బాంబ్' అనే పేరుతో సిగ్నల్ కనిపించడంతో, స్పెయిన్‌కు బయలుదేరిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానం అట్లాంటిక్ మహాసముద్రం మీది నుంచి వెనక్కి తిరిగివచ్చి, అమెరికాలోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం 150 మంది ప్రయాణికులతో న్యూజెర్సీలోని నెవార్క్ నుంచి స్పెయిన్‌కు బయలుదేరింది. విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటి తర్వాత, సిబ్బంది 'బాంబ్' అనే పేరుతో ఉన్న ఓ బ్లూటూత్ డివైజ్‌ను గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, ప్రయాణికులందరూ తమ బ్లూటూత్ కనెక్షన్లను ఆపేయాలని పదేపదే అనౌన్స్ చేశారు. అయినా కొన్ని డివైజ్‌లు యాక్టివ్‌గా కనిపించాయి. ఇందులో 'బాంబ్' పేరుతో ఉన్న డివైజ్ కూడా ఉంది. దీంతో పైలట్లు జనరల్ ఎమర్జెన్సీ ప్రకటించి, విమానాన్ని వెనక్కి మళ్లించారు. తిరిగి నెవార్క్‌లో సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత, పోర్ట్ అథారిటీ పోలీసులు విమానాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఒక టీనేజీ ప్రయాణికుడు తన బ్లూటూత్ పరికరానికి ఆ పేరు పెట్టినట్లు విచారణలో గుర్తించారు. విమానాన్ని, ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి ప్రమాదకర వస్తువులు లేవని నిర్ధారించుకున్నారు. ఈ ఘటన కారణంగా విమానం తొమ్మిది గంటలకుపైగా ఆలస్యంగా స్పెయిన్‌కు చేరుకుంది. భద్రతాపరమైన ఆందోళన కారణంగానే విమానాన్ని వెనక్కి మళ్లించామని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

# మా ఆక్రమణలోనూ భారత్ భూభాగాలు

## నేపాల్ ప్రధాని బాలేన్‌షా సంచలన వ్యాఖ్యలు

## రెండు దేశాలు చర్చించి పరిష్కరించుకోవాలని సలహా



**ఖాట్మండు, జూన్ 1:** భారత్‌నేపాల్ మధ్య నలుగుతున్న సరిహద్దు వివాదం మళ్లీ రాజుకుంది. భారత్ తమ భూభాగాలను ఆక్రమించిందని ఆరోపిస్తున్న నేపాల్ తాము కూడా భారత భూభాగాలను కొన్నిచోట్ల ఆక్రమించామని ఆ దేశ ప్రధాని బాలెన్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలతో నేపాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగగా, గంటల వ్యవధిలోనే ప్రభుత్వం వివరణ ఇచ్చి నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పార్లమెంటులో ప్రసంగించిన 35 ఏళ్ల బాలెన్ షా, సరిహద్దు వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని అయ్యాక నాకు తెలిసిన ఓ వాస్తవం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది. భారత్ మాత్రమే కాదు, నేపాల్ కూడా చాలా చోట్ల భారత భూభాగాన్ని ఆక్రమించింది. ఇప్పుడు రెండు దేశాలు స్నేహితుల్లా కూర్చొని, వాస్తవాలను అధ్యయనం చేసి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. ఇందుకోసం చరిత్రకారులు, సర్వేయర్లు, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని చైనా, యూకే దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆయన తెలిపారు. ప్రధాని వ్యాఖ్యలతో నేపాల్ పార్లమెంటులో వెంటనే గందరగోళం చెలరేగింది. సొంత దేశమే భారత భూభాగాన్ని ఆక్రమించిందని ప్రధాని ఎలా అంటారని ప్రతిపక్ష నేపాలి కాంగ్రెస్, నేపాలి కమ్యూనిస్ట్ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రధాని తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపాలని లేదా వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మాజీ విదేశాంగ మంత్రి ప్రదీప్ గ్యావలీ సైతం ప్రధాని క్షమాపణ చెప్పాలని కోరారు. మరోవైపు నేపాల్ మాజీ దౌత్యాధికారులు, సరిహద్దు నిపుణులు కూడా ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టారు. నేపాల్ ఎన్నడూ భారత భూభాగాన్ని ఆక్రమించలేదని సరిహద్దు నిపుణుడు బుద్ధి నారాయణ్ శ్రేష్ఠ స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో సరిహద్దు స్తంభాలు లేకపోవడంతో ఇరువైపుల రైతులు పరస్పరం భూములను వాడుకుంటున్నారని, దీనిని ఆక్రమణ అనలేమని అన్నారు. ప్రధానికి ఈ విషయంపై పూర్తి సమాచారం లేదని, భారత్ కూడా ఈ అంశాన్ని అధికారికంగా ఎప్పుడూ లేవనెత్తలేదని మాజీ రాయబారులు అభిప్రాయపడ్డారు. వివాదం తీవ్రమవుతుండటంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగింది. ప్రధాని వ్యాఖ్యలు నోమ్యాన్స్ ల్యాండ్, సరిహద్దుల్లో పరస్పర భూ వినియోగం గురించేనని, అధికారిక ఆక్రమణల గురించి కాదని స్పష్టం చేసింది. సరిహద్దు స్తంభాల నిర్మాణం, దస్గ (నిర్వహణ కోసం సరిహద్దు వెంబడి ఉండే స్ట్రిప్) ప్రాంతాలపై సాంకేతిక బృందాలు పనిచేస్తున్నాయని తెలిపింది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీ ప్రాంతాలపై ఇరు దేశాల మధ్య వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. 1816 నాటి సుగౌలీ ఒప్పందం ప్రకారం ఈ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తుండగా, అవి ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్పష్టం చేస్తోంది. 2021లో అప్పటి ఓలీ ప్రభుత్వం ఈ మూడు ప్రాంతాలను తమ భూభాగంలో చూపుతూ కొత్త మ్యాప్‌ను విడుదల చేయగా, భారత్ దానిని ఏకపక్ష చర్యగా పేర్కొంటూ తీవ్రంగా ఖండించింది. ఇటీవల కైలాస మానస సరోవర యాత్ర లిపులేఖ్ మీదుగా జరగడాన్ని కూడా నేపాల్ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో ప్రధాని బాలెన్ షా వ్యాఖ్యలు మరోసారి చర్చను రాజేశాయి.

# ప్రముఖ గాయని సుమన్ కళ్యాణ్‌పూర్ కన్నుమూత

## హిందీ, బెంగాలీ సహా 850 పైగా పాటలు పాడిన సింగర్



**ముంబయి, జూన్ 1:** చలనచిత్ర సంగీతయుగంలో తన మధుర స్వరంతో కొన్ని తరాలను ఉర్రూతలూగించిన ప్రముఖ నేపథ్య గాయని సుమన్ కళ్యాణ్‌పూర్ (89) కన్నుమూశారు. కొంతకాలంగా వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం సాయంత్రం ముంబైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. నెల రోజులుగా అనారోగ్యంతో ఉన్న సుమన్ కళ్యాణ్‌పూర్ ముంబైలోని లోఖండ్‌వాలాలో ఉన్న తన నివాసంలో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మరణించారు. నేటి (సోమవారం) మధ్యాహ్నం ముంబైలోని శాంటాక్రూజ్‌లో ఆమె అంత్యక్రియలు జరిగాయి. 1937 జనవరి 28న అప్పటి అవిభక్త భారతదేశంలోని ఢాకాలో జన్మించిన సుమన్ కళ్యాణ్‌పూర్ (అసలు పేరు సుమన్ హెమ్మడి) 1950ల ప్రారంభంలో తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1954లో విడుదలైన మంగు, శుక్రాచి చాందిని చిత్రాలతో ఆమె గాయనిగా అరంగేట్రం చేశారు. హిందీ, మరాఠీ, బెంగాలీ, గుజరాతీ సహా పలు భాషల్లో కలిపి 700 నుంచి 850కి పైగా పాటలు పాడారు. ఆమె గొంతు మాధుర్యం దిగ్గజ గాయని లతా మంగేష్కర్‌ను పోలి ఉండటంతో ఆమెను అభిమానంగా మరో లత అని పిలుచుకునేవారు. నా నా కర్తే ప్యార్ తుమ్హీ సే, ఆజ్ కల్ తేరే మేరే ప్యార్ కే, నా తుమ్ హమే జానో వంటి ఎన్నో అజరామరమైన గీతాలకు ఆమె ప్రాణం పోశారు. మహమ్మద్ రఫీతో కలిసి ఆమె దాదాపు 140 యుగళ గీతాలను ఆలపించారు. సంగీత రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం 2023లో ఆమెను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ఆమెకు కుమారుడు చారుల్ కళ్యాణ్‌పూర్ ఉన్నారు. సుమన్ కళ్యాణ్‌పూర్ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆమె మరణ వార్త అత్యంత హృదయ విదారకమని ఎన్సీపీ నేత శరద్ పవార్ పేర్కొన్నారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా ఆమె మధుర స్వరానికి నివాళులర్పించారు.



# మోసపూరితంగా అమెరికా న్యాయవ్యవస్థ : ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆ దేశ న్యాయ వ్యవస్థపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన ఆర్థిక విధానాలు, పరిపాలన నిర్ణయాలకు వ్యతిరేకంగా వరుసగా వస్తున్న కోర్టు తీర్పుల పట్ల అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కెన్నెడీ సెంటర్‌కు సంబంధించిన వివాదం.. టారిఫ్‌లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మన రాజకీయ వ్యవస్థ ఎంత అవినీతిమయంగా మారిందో.. కోర్టుల వ్యవస్థా అంతే దారుణంగా మోసపూరితంగా తయారైంది' అని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలకు ఈ విషయాలు స్పష్టంగా తెలుసని, అందుకే తాను భారీ మెజారిటీతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం తాను చివరివరకు పోరాడతానని స్పష్టం చేశారు. శనివారం తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ఈ వివరాలను ట్రంప్ పోస్టు చేశారు. కెన్నెడీ సెంటర్ వ్యవహారంలో యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి క్రిస్టోఫర్ కూపర్ ఇచ్చిన తీర్పును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించిన న్యాయమూర్తి కూపర్.. కెన్నెడీ సెంటర్ పేరుతో చేపట్టాలన భావించిన కొన్ని మార్పులను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే వేసవిలో విస్తృత స్థాయిలో మరమ్మతులు, నిర్మాణ పనుల కోసం సాంస్కృతిక కేంద్రాన్ని మూసివేయాలన్న ప్రతిపాదనను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# 35 మందితో సిఎం సువేందు కేబినెట్ విస్తరణ

**కోల్‌కత్తా,జూన్ 1:** పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేపట్టిన సువేందు అధికారి ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం తాజాగా మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. 35 మంది బీజేపీ ఎమ్మెల్యేలు సోమవారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి మంత్రులతో ప్రమాణం చేయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1ఏ) ప్రకారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో 44 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 35 మందికి చోటు దక్కడంతో, సీఎంతో కలిసి మొత్తం 41 మంది మంత్రివర్గంలో ఉన్నారు. దీంతో మరోసారి మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉంది. ఇంకో ముగ్గురికి చోటుంది. గత నెల 9న సువేందు అధికారి సీఎంగా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనతోపాటు దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, నిశిత్ ప్రమాణిక్, అశోక్ కీర్తనియా, క్షుదిరామ్ టూడు మంత్రులుగా ప్రమాణం చేశారు. సోమవారం ప్రమాణ స్వీకారంచేసిన వారిలో దీపక్ బర్మాన్, తపాస్ రాయ్, శంకర్ ఘోష్, మనోజ్ కుమార్ ఒరావోన్, గౌరీ శంకర్ ఘోష్, స్వపన్ దాస్ గుప్తా, కల్యాణ్ చక్రవర్తి, అరుప్ కుమార్ దాస్, దూద్ కుమార్ మోండల్, శరద్వాత్ ముఖర్జీ, జగన్నాథ్ చట్టోపాధ్యాయ్, అర్జున్ సింగ్ తదితరులున్నారు.

# జమ్ముకాశ్మీర్‌లో నేడు ప్రత్యేక మాసంగా రికార్డు!

## ఉగ్ర హింసలో ఒక్క మరణం కూడా నమోదుకాని నెల!

**శ్రీనగర్, జూన్ 1:** జమ్ముకశ్మీర్ భద్రతా చరిత్రలో ఒక చారిత్రక రోజు నమోదైంది. గడిచిన మూడు దశాబ్దాలకుపైగా కాలంలో తొలిసారిగా, ఉగ్రవాద సంబంధిత హింసలో ఒక్క మరణం కూడా నమోదు కాకుండా ఒక నెల గడిచింది. జమ్ముకశ్మీర్‌లో భద్రతా పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. సౌత్ ఏషియా టెర్రరిజం పోర్టల్ వంటి స్వతంత్ర ట్రాకర్లతోపాటు అధికారిక గణాంకాలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. జాతీయ మీడియా సంస్థల నివేదికల ప్రకారం.. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు మాత్రమే సంభవించాయి. అందులో 10 మంది ఉగ్రవాదులు, ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ కాలంలో ఒక్క సామాన్యుడు కూడా ప్రాణాలు కోల్పోలేదు. గతంతో పోలిస్తే ఇది చాలా మెరుగైన పరిస్థితి. ఇక ఈ మే నెలలో ఎలాంటి ఉగ్రవాద సంబంధ మరణం చోటుచేసుకోలేదు. ఉదాహరణకు 2001 మే నెలలో దాదాపు 300 మంది, 2025 మే నెలలో 43 మంది ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు నిరంతరాయంగా చేపడుతున్న కౌంటర్‌టెర్రరిజం ఆపరేషన్లు, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడం, ఉగ్రవాదులకు స్థానిక మద్దతు తగ్గడం వంటి కారణాలవల్లే ఈ మార్పు సాధ్యమైందని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఉగ్ర మరణాలులేని నెలగా 2026 మే నిలవడం సానుకూల సంకేతమన్నారు.



# 45 లీటర్ల కెపాసిటీ కారు ట్యాంకులో 52 లీటర్లకు బిల్లు!

**లక్నో, జూన్ 1:** పెట్రోల్ బంకుల్లో జరుగున్న మోసాన్ని ఒక వ్యక్తి బయటపెట్టాడు. 45 లీటర్ల సామర్థ్యం ఉన్న కారు ట్యాంకులో 52 లీటర్లకుపైగా పెట్రోల్ నింపినట్లు బంకు సిబ్బంది బిల్లు ఇచ్చినట్లు ఆరోపించాడు. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. చరణ్ సింగ్ ఇటీవలే కొత్త కారును కొనుగోలు చేశాడు. అతడు పెట్రోల్ బంకు వద్దకు వెళ్లాడు. ట్యాంక్‌లో సుమారు ఐదు లీటర్ల పెట్రోల్ మిగిలి ఉన్నట్లు ఫ్యూయల్ ఇండికేటర్ చూపించింది. తన కారులో ట్యాంక్ ఫుల్‌గా పెట్రోల్ నింపమని బంకు సిబ్బందిని చరణ్ సింగ్ కోరాడు. ఆ కారు ట్యాంక్ పూర్తి సామర్థ్యం 45 లీటర్లు. అందులో 5 లీటర్ల పెట్రోల్ ఉన్నది. అయినప్పటికీ 52 లీటర్ల పెట్రోల్ నింపినట్లు బంకు సిబ్బంది బిల్లు ఇచ్చాడు. ఇది చూసి కారు యజమాని చరణ్ సింగ్ షాక్ అయ్యాడు. దీని గురించి బంకు సిబ్బందిని నిలదీశాడు. మరోవైపు తొలుత కారు ట్యాంకులో 41 లీటర్ల పెట్రోల్‌ను బంకు సిబ్బంది నింపినట్లు చరణ్ సింగ్ గ్రహించాడు. ఆ తర్వాత మీటర్ రీడింగ్‌ను మార్పు చేసి అదనంగా 11 లీటర్లు నింపినట్లు బిల్లులో చూపినట్లు ఆరోపించాడు. ఈ మోసాన్ని బయటపెట్టేందుకు కారు తయారీ సంస్థ ప్రతినిధిని అక్కడకు పిలిపించాడు. ఆ కారు కంపెనీ ప్రతినిధి ఆ పెట్రోల్ బంకు వద్దకు చేరుకున్నాడు. కారు ట్యాంక్‌లో 45 లీటర్ల కంటే ఎక్కువ పెట్రోల్ పట్టదని అధికారికంగా ధృవీకరించాడు. దీంతో చరణ్ సింగ్ ఆ పెట్రోల్ బంకుపై అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మోసపూరిత చిప్‌లు, డిస్పెన్సింగ్ యంత్రాల తనిఖీ కోసం జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

# తమిళనాడులో అన్నామలై వేరుకుంపటి!

**చెన్నై, జూన్ 1:** తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై సొంతంగా పార్టీ పెట్టబోతున్నారనే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. కోయంబత్తూరు వ్యాప్తంగా ఆయన మద్దతుదారులు భారీగా ఏర్పాటు చేసిన పోస్టర్లు, అన్నామలై వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. దీనితో పాటు బీజేపీ కీలక సమావేశాలకు ఆయన దూరంగా ఉండటం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కోయంబత్తూరులో ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాలకు అన్నామలై హాజరు కాకుండా విదేశాలకు వెళ్లారు. సరిగ్గా ఇదే సమయంలో నగర మంతటా ఆయన పోస్టర్లు వెలిశాయి. భయం లేని మనసులకు హద్దులు లేవు అనే సందేశంతో ఉన్న ఈ పోస్టర్లు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆయన అభిమాన సంఘం అన్నామలై అన్బు కూట్టం రాష్ట్రవ్యాప్తంగా కొత్త సభ్యులను, కార్యకర్తలను చేర్చుకునే పనిని ముమ్మరం చేసింది. ఇటీవల కేంద్ర విద్యాశాఖ తీసుకున్న త్రిభాషా సూత్రం నిర్ణయాన్ని అన్నామలై బహిరంగంగా వ్యతిరేకించారు. సీబీఎస్ఈ 9వ తరగతి విద్యార్థులకు ఈ ఏడాది నుంచే మూడు భాషలను తప్పనిసరి చేస్తూ కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం తమిళనాడు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తుందని, పాత నిర్ణయం ప్రకారం 2029-30 నుంచి మాత్రమే దీన్ని అమలు చేయాలని ఢిల్లీ పెద్దలకు అల్టిమేటం ఇచ్చారు. ఈ లాంగ్వేజ్ పాలసీ వివాదమే ఆయన పార్టీ మారడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. అన్నామలై 2021 నుంచి 2025 వరకు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ద్రవిడ ఐకాన్స్ అయిన సి.ఎన్. అన్నాదురై, జయలలితలపై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు మిత్రపక్షమైన ఏఐఏడీఎంకేతో తీవ్ర విభేదాలకు దారితీశాయి. అన్నామలై వైఖరి నచ్చని ఆ పార్టీఅతణ్ని పదవి నుంచి తీసేయాలని పట్టుబట్టడంతో బీజేపీ అధిష్ఠానం అధ్యక్ష పదవి నుంచి తప్పించింది. అసంతృప్తితో ఉన్న అన్నామలై ఇప్పుడు సొంత పంథాను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

# తమిళనాడులో ఘోర ప్రమాదం

## బైక్‌లను ఢీకొట్టిన కారు.. ముగ్గురు మృతి!



**చెన్నై, జూన్ 01:** తమిళనాడు రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ముగ్గురు దుర్మరణం చెందారు. పోలీసులవివరాల ప్రకారం చెన్నై బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 48)పై వెల్లూరు మండలం అబ్దుల్లాపురం గ్రామం సమీపంలో రెండు బైకులు రాంగ్ రూట్‌లో వస్తున్నాయి. అదే మార్గంలో వస్తున్న కారు ఈ రెండు ద్విచక్రవాహనాలను బలంగా ఢీ కొట్టింది. ఈ క్రమంలో కారు అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లి ఒక చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైకులపై ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురు మృతి చెందారు. మృతులను కె. అనబళగన్ (68), ఆర్. సుబ్రమణి (72), ఎస్. అరుణ్‌కుమార్ (22) గా పోలీసులు గుర్తించారు. వీరంతా వెల్లూరు ప్రాంతానికి చెందిన వారు. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. కారు డ్రైవర్ చెన్నై సమీపంలోని రెడ్ హిల్స్‌కు చెందిన ఎస్. కార్తిగా పోలీసులు గుర్తించారు. అతడు తన కుటుంబ సభ్యులతో కలిసి వేరే ప్రాంతానికి వెళ్తున్న క్రమంలో అకస్మాత్తుగా ఎదురుగా బైకులు రావడంతో కారు నియంత్రణ కోల్పోయింది. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగింది.

గాయపడిన వారిని రక్షించిన స్థానికులు వెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న వెల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# టైం వస్తుంది.. తడాఖా చూపిస్తా

## రాష్ట్ర బిజెపి సర్కార్‌కు మాజీ సిఎం మమత వార్నింగ్

**కోల్‌కత్తా, జూన్ 1:** మీరు ఇపుడు నాతో ఆడుకున్నారు సమయం వచ్చినప్పుడు నేను ఇంకా పెద్ద ఆట ఆడతానంటూ బీజేపీకి మాజీ సీఎం టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ వార్నింగ్ ఇచ్చారు. కోల్‌కతాలో నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. జూన్ 2న కోల్‌కతాలోని రాణి రాస్‌మోని రోడ్డులో ఒక రోజు పాటు మమత ధర్నా చేపట్టనున్నారు. డబ్బు, అధికారంతో టీఎంసీని విచ్ఛిన్నం చేయలేరని మమత పేర్కొన్నారు. వర్చువల్‌గా పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఉద్దేశించి మమత మాట్లాడారు. టీఎంసీ పార్టీని చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. టీఎంసీ ఎమ్మెల్యేలను పార్టీ సమావేశాలకు హాజరుకాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని వారిని బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. టీఎంసీని విచ్ఛిన్నం చేస్తామని ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారు. ఈరోజు మీకు మంచి సమయం అందుకే మీరు ఇలా చేస్తున్నారు. నా సమావేశానికి రావద్దని ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారు. సమావేశానికి రాకముందు పోలీసులు ఫోన్‌లో బెదిరించారని నా పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు నిన్న ఫిర్యాదు చేశారని తెలిపారు. నేను సమావేశానికి వెళ్లినప్పుడల్లా నా అనుమతిని రద్దు చేస్తున్నారు. సామాన్య ప్రజలను రక్షించడం పోలీసుల పని. పోలీసులను చూస్తే నాకు సిగ్గుగా ఉంది. రక్షించడమే వారి పని. కానీ వాళ్లు ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారు. నా భద్రతను కూడా ఉపసంహరించుకున్నారు. మీరు నాతో ఒక ఆట ఆడారు. నేను దీనికంటే పెద్ద ఆట ఆడతాను. దయచేసి కొంచెం ఆగండని అన్నారు. మీరు మా పార్టీని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. గతంలో చాలా మంది బీజేపీ నాయకులు నాతో సంప్రదింపులు జరిపారు, నేను వారికి సహాయం చేశాను. కానీ ఇప్పుడు మీరేం చేస్తున్నారు. టీఎంసీ మరింత బలపడుతుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలబడటం లేదని గొప్ప గొప్ప ఆరోపణలు చేస్తున్నవారు ఈ రోజు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు భారత్ కృషి కీలకం: రూవెన్ అజర్



**న్యూఢిల్లీ,జూన్ 1:** భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారతదేశం అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు.

### గవర్నర్ కాన్వాయ్‌కి అడ్డుగా నిరసన




బెంగళూరు, జూన్ 1: వీఐపీల పర్యటనల సందర్భంగా సామాన్య ప్రజలు ఎదుర్కొనే ట్రాఫిక్ కష్టాలకు బెంగళూరులో జరిగిన ఓ ఘటన అద్దం పడుతోంది. కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో, గర్భవతి అయిన తన భార్య వాహనం అందులో చిక్కుకుపోయిందని ఆరోపిస్తూ ఓ వ్యక్తి నడరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆదివారం మధ్యాహ్నం ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని ఇస్రో జంక్షన్ వద్ద గవర్నర్ కాన్వాయ్ వెళ్లేందుకు పోలీసులు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఆ మార్గంలో ఇప్పటికే అండర్‌పాస్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఈ క్రమంలో సుమారు 30 నిమిషాల పాటు వాహనాలను ఆపేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

### 6న కాక్రోచ్ పార్టీ ఆందోళనకు పిలుపు!




**న్యూఢిల్లీ, జూన్ 1:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జూన్ 6వ తేదీన ఇండియా రానున్నాడు. ఎంట్రెన్స్ పరీక్షల ఫలితాల అంశంలో నైతిక బాధ్యత తీసుకుని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిర్వహించే శాంతియుత ప్రదర్శనలో ఆయన పాల్గొననున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో దీప్కే ఓ వీడియో రిలీజ్ చేశాడు. ఢిల్లీలో జరిగే ఆ నిరసన కార్యక్రమంలో మద్దతుదారులు, విద్యార్థులు పాల్గొవాలని పిలుపు ఇచ్చారు. అందరం ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, భారత రాజ్యాంగం అడుగుజాడల్లో మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా డిమాండ్ కోరదామన్నాడు. మనం మన గళం విప్పితే, వాళ్లు తప్పకుండా వింటారన్నారు. ఈనెల 6వ తేదీన తన మద్దతుదారులందరూ విమానాశ్రయానికి చేరుకోవాలని తన వీడియో మెసేజ్‌లో పిలుపునిచ్చారు.

### సామూహిక వివాహాల్లో పెళ్లి చేసుకున్న ఎమ్మెల్యే



రాయ్‌పూర్, జూన్ 1: నేటితరం యువతీ యువకులు తమ వివాహాలను బంధుమిత్రుల నడుమ ఆడంబరంగా చేసుకోవాలని భావిస్తుంటే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే నిరాడంబరంగా తన వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం సామూహిక వివాహ కార్యక్రమంలో ఇతర జంటలతో కలిసి ఆయన పెళ్లి చేసుకున్నారు. ఎమ్మెల్యే పెళ్లి వార్త స్థానికంగా ఆసక్తి రేకెత్తించింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆదివారం బెమెతారా నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కన్యా వివాహ యోజన కింద సామూహిక వివాహాలు జరిపించింది. అదే వేదికపై 20 కిపైగా జంటలతో కలిసి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ నేత దీపేశ్ సాహు పెళ్లి చేసుకున్నారు. తరుణా సాహు అనే మహిళ మెడలో ఆయన మూడు ముళ్లు వేశారు. వివాహానికి ముందు వరుడిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అరుణ్ సావో స్థానిక సంప్రదాయం ప్రకారం ఎడ్లబండిలో ఊరేగిస్తూ తీసుకువచ్చారు. ఈ ఘటన అందరి దృష్టిని ఆకర్షించింది.

# పల్నాడు జిల్లాలో 21 వేల పిఎం సూర్యఘర్ కనెక్షన్లు

● కూటమి సంక్షేమం చూసి ఓర్వలేకే వైసిపి తప్పుడు ప్రచారం ● త్వరలోనే విద్యుత్ శాఖలో ఎఇ పోస్టులను భర్తీ చేస్తాం: మంత్రి గొట్టిపాటి రవికుమార్



**గుంటూరు, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేశామని పల్నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక మెగాడీఎస్సీ లో అక్రమాలు జరిగాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో డీఎస్సీ ద్వారా ఒక్క పోస్టును కూడా భర్తీ చేయని వైసీపీకి, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పోలీసు శాఖలో ఉద్యోగాల భర్తీ చేపట్టామని, త్వరలోనే ఏఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా ప్రారంభిస్తామని తెలిపారు. తాము చేయలేని పనులను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందనే అసహనంతో వైసీపీ నేతలు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. సోమవారం నాడు పల్నాడు జిల్లా నకరేకల్లు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కండ్లగుంట గ్రామంలో శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే రూ.400 కోట్ల వ్యయంతో 21 వేల పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి సూర్యఘర్ కనెక్షన్ల లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఆంధ్రప్రదేశ్‌కు 20 లక్షల కనెక్షన్లు కేటాయించబడినట్లు మంత్రి వెల్లడించారు. ఈ 20 లక్షల కనెక్షన్లు పూర్తయితే రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం:** పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా నకిరేకల్లు మండలం కండ్లగుంట గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి సామాజిక పింఛన్లను స్వయంగా అందజేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర అర్హులైన లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 5,606 స్పౌజ్ పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. ప్రతి నెలా 63 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఒకటో తేదీనే పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అండగా నిలుస్తూ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సామాజిక పింఛన్ల కోసం కూటమి ప్రభుత్వం ఏటా సుమారు రూ.34 వేల కోట్లు ఖర్చు

## అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

● జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్



**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 1 ప్రభాతవార్త:** వైకాపా హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయింది. దమ్ముంటే, చేతనైతే వాస్తవాలపై మా కూటమి ప్రభుత్వంతో బహిరంగ చర్చకు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. సోమవారం సంతబొమ్మాళి మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి అనంతరం జరిగిన సభలో వైకాపా అరాచకాలపై నిప్పులు చెరిగారు. మాజీ ముఖ్య మంత్రి జగన్ అబద్ధాల ప్రచారాలతో, కుట్రలతో రాజకీయ మనుగడ సాగించాలని తాపత్రయపడుతున్నారని, అయితే ఆయన మాటలను ప్రజలు ఇక ఎంతమాత్రం నమ్మరని స్పష్టం చేశారు. ఐదేళ్ల జగన్ పాలన కేవలం అవినీతి, అరాచకాలు, అసత్యాలకే కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, 2019 నుంచి 2024 వరకు వైకాపా పాలనలో జరిగిన పనులపై బహిరంగ చర్చకు రావాలని జగన్ మోహన్ రెడ్డికి మంత్రి సవాల్ విసిరారు. వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వైకాపా నేతలు కూడా ముందుకు రావాలని కోరారు.

**ఉత్తరాంధ్రకు అన్ని రంగాల్లో ద్రోహం:** ఉత్తరాంధ్ర ఆశయాలను, ఆకాంక్షలను వైకాపా ప్రభుత్వం పూర్తిగా అడ్డుకుందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. నిరుద్యోగులను ముంచిన డీఎస్సీ వివాదం నుంచి, ప్రాంతీయ ప్రయోజనాలకు కీలకమైన రైల్వే జోన్ వరకు ప్రతి విషయంలోనూ జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని విమర్శించారు. రాష్ట్రాన్ని కేవలం అప్పుల కుప్పగా మార్చడం మినహా, వైకాపా సాధించిందేమీ లేదన్నారు. అలాగే ఉత్తరాంధ్ర ప్రజలు దశాబ్దాల ఆకాంక్ష అయిన విశాఖపట్నం రైల్వే జోన్ విషయంలో కూడా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించిందని మంత్రి ధ్వజమెత్తారు. అవసరమైన భూముల కేటాయింపులోనూ చిత్తశుద్ధి చూపకుండా కాలయాపన చేస్తూ ప్రాజెక్టు పురోగతిని అడ్డుకుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి అవకాశాలను రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టిన ప్రభుత్వం వైకాపా మాత్రమేనని విమర్శించారు. ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన వైకాపా భవిష్యత్తులో మరింత రాజకీయ ఒంటరితనాన్ని ఎదుర్కొంటుందని అన్నారు. వీటన్నిటిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ మంత్రి జగన్‌కు సవాల్ విసిరారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజలు ఇచ్చిన తీర్పు కు అనుగుణంగా మసలుకోవాలని మంత్రి అచ్చేనాయుడు వైకాపా నాయకులకు మంత్రి హెచ్చరించారు.




## డిఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాం

● రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

**సచివాలయం, జూన్ 1 ప్రభాతవార్త:** డిఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా నిర్వహించినట్లు రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. డిఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో ప్రతి దశను సాంకేతిక ఆధారిత ఆన్‌లైన్ విధానంలో నిర్వహించామని, అభ్యర్థులు దరఖాస్తు సమర్పణ నుంచి పోస్టు ఎంపిక వరకు ఎటువంటి వ్యక్తిగత సంప్రదింపులు లేకుండానే ప్రక్రియ పూర్తయిందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ డిఎస్సీ ద్వారా మొత్తం 16,347 పోస్టులను నోటిఫై చేయగా, అందులో 3శాతం క్రీడా కోటా కింది 421పోస్టులను కేటాయించినట్లు తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో 3,600మంది అభ్యర్థులు మొత్తం 5,326 దరఖాస్తులు సమర్పించగా తుది ఎంపికలో 382పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయని, ఇంకా 39పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయని వెల్లడించారు. అన్ని పోస్టులు భర్తీ కాకపోవడమే ఎంపికలు పూర్తిగా అర్హత, ప్రాధాన్యత, ప్రభుత్వ నిబంధనల ఆధారంగానే నిర్వహించబడినట్లు స్పష్టం చేస్తుందన్నారు. డిఎస్సీ స్పోర్ట్స్ కోటా ఎంపికల మొత్తం ప్రక్రిను ఎటువంటి రాజకీయ జోక్యం మధ్యవర్తుల ప్రమేయం, బాహ్య ప్రభావం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించినట్లు ఆయన పునరుద్ఘాటించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, రాష్ట్ర క్రీడా విధానం, క్రీడా ధృవపత్రాలు, ప్రాధాన్యత క్రమం, అర్హతలు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే 382మంది అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టంచేశారు.



## 7నుంచి యోగా కార్యక్రమాలు


● రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

**సచివాలయం, జూన్ 1 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడులను రాష్ట్రంలో "యోగాంధ్ర-2026" పేరుతో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ అనే విశిష్ట నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) వేడుకల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు. యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది (రైతులు, మహిళా స్వయం సహాయక బృందాలు, గిరిజనులు, వివిధ సాంస్కృతిక కళాకారులు, యువజన సంఘాల సభ్యులు, ఆటో లారీ అసోసియేషన్ల సభ్యులు విద్యార్థిని విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు) పౌరులను యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు. ఉచితంగా యోగాసనాలు వీడియోలు: ఇంటింటికీ యోగాను చేరువ చేసే కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు 4కేటగిరిల్లో రూపొందించిన వీడియోలను ఉచితంగా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. వివిధ ఆసనాలపై 90,రోగ నివారణ ప్రత్యేక ఆసనాల వీడియోలు-21, రోజువారీ సాధన కోసం 7 (ఆసనాలు-ప్రాణాయామం సెట్), యోగాపై సందేహాలను (షార్ట్ వీడియోలు) 50ప్రశ్నల రూపంలో నివృత్తి చేసేలా వీడియోలను రూపొందించారు. వాట్సాప్ నెంబర్ 8142404888ద్వారా హాయ్ అని టైపు చేస్తే వెంటనే క్యూఆర్ కోడ్ వస్తుంది. దీన్ని స్కాన్ చేస్తే గూగుల్ డ్రైవ్ లింక్ వస్తుంది. దాని ద్వారా వీడియోలను ఎప్పుడైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డాక్టర్ మంతెన సత్యనారాయణ తెలిపారు.

## రాజ్యసభ సీట్ల కోసం సీమ నేతల్లో ఆశలు

● రాయలసీమ నుంచి ఒకరికైనా పెద్దల సభ సీటు దక్కేనా? ● ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి గుండుమల తిప్పేస్వామి, ప్రభాకర్ చౌదరి ఆశలు ● కడప జిల్లా నుంచి రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి రేస్‌లో





**అనంతపురం, జూన్ 1 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఖాళీపడే నాలుగు రాజ్య సభ సీట్లకు పలువురు అభ్యర్థుల నుంచి తెలుగుదేశం పార్టీలో డిమాండ్ ఎక్కువగా ఉంది. టిడిపి సీనియర్ నాయకులు దతంలో టికెట్టు దక్కని నేతలు, పారిశ్రామిక వేత్తలు ఎవరు దారిలో వారు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా ఈ దఫా కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా పార్టీ కోసం పని చేసిన సీనియర్లకు రాజ్యసభ సీట్లు ఇవ్వాలన్న ఆలోచనలో పార్టీ అధిష్టాన వర్గం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టిడిపి అధిష్టాన వర్గం త్వరలో ప్రకటించే నాలుగు రాజ్య సభ స్థానాల అభ్యర్థుల్లో ఒక్కరికైనా రాయలసీమ ప్రాంత నాయకులకు దక్కుతుందా లేదా అన్నది టిడిపి వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాజ్య సభ స్థానం కోసం ప్రస్తుతం రాయలసీమ నుంచి రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి (కడప), గుండుమల తిప్పేస్వామి (మడకశిర), వైకుంఠం ప్రభాకర్ చౌదరి (అనంతపురం అర్బన్) ఆశావహుల్లో ప్రముఖంగా ఉన్నారు. వీరిలో కొందరు పార్టీ ముఖ్య నేతలను కలిసి తాము పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాజ్యసభ స్థానం ఇవ్వాలని అడిగి పార్టీ అధినేతలపై ఆశలు పెట్టుకున్నవారు ఉన్నారు. కొందరు తమను తమ పార్టీ గుర్తించడం లేదని నిరాశ వ్యక్తం చేసి, పార్టీ అధినేత దృష్టికి గతంలో తాము చేసిన సేవలను తీసుకెళ్లిన వారు ఉన్నారు. త్వరలో టిడిపి జాతీయ అధ్యక్షులు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, నాలుగు రాజ్య సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉండటంతో పలువురు సీమ నాయకులు పార్టీ అధిష్టాన వర్గంపై గంపెడు ఆశతో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పార్టీలో కీలకంగా పని చేసి ఎలాంటి గుర్తింపు దక్కని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ప్రస్తుతం రాజ్యసభ సీటును ఆశిస్తున్నారు. మడకశిర ప్రాంతానికి చెందిన గుండుమల తిప్పేస్వామి గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీ గా తదితర పదవుల్లో ఉండి, మడకశిర ప్రాంతంలో టిడిపి బలోపేతం కోసం గట్టి ప్రయత్నం చేశారు. గతంలో హిందూపురం ఎంపి టికెట్టు కూడా ఆశించారు. గత శాసనసభ ఎన్నికల్లో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు విజయం కోసం గుండుమల తిప్పేస్వామి తనదైన శైలిలో ప్రయత్నం చేసి తక్కువ సమయంలోనే గట్టి ప్రచారం చేసి మడకశిర కూడా టిడిపి ఖాతాలో వచ్చే విధంగా చేశారు. చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో కూడా వైసిపి ప్రభుత్వ చర్యలను గతంలో ఎండగడుతూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పరిస్థితుల్లో పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా రాజ్య సభ సీటు ఇవ్వాలని మడకశిర ప్రాంతానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆశిస్తున్నారు. అదే విధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్‌గా, కర్నూలే జిల్లా టిడిపి పరిశీలకులుగా పని చేసి వైకుంఠం ప్రభాకర్ చౌదరి కూడా రాజ్య సభ సీటును ఆశిస్తున్నారు. అనంతపునరం మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన సమయంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. గత ఎన్నికల్లో అనంతపురం అర్బన్ సీటును ప్రభాకర్ చౌదరికి ఇవ్వకుండా ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు పార్టీ అధిష్టానం కేటాయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మధ్య అంతర్గత విబేదాలు తారా స్థాయికి చేరాయి. ఇటీవల ప్రభాకర్ చౌదరి విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి వచ్చే ఎన్నికల్లో నేను ఎమ్మెల్యే టికెట్టు అడగనని సామాన్య కార్యకర్తగానే ఉంటానని బహిరంగంగా ప్రభాకర్ చౌదరి ప్రకటించారు. ప్రస్తుతం ప్రభాకర్ చౌదరి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు, పార్టీ నుంచి బయటికెళ్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం రాజ్యసభ స్థానాలకు పార్టీ అధిష్టాన వర్గం అభ్యర్థులను ప్రకటించే సమయంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అసంతృప్తి చర్యలు చర్చనీయాంశంగా మారింది. రాజ్యసభ సీటుకు ప్రభాకర్‌చౌదరి పేరును పరిశీలించాలని ఆయన మద్దతు దారులు పార్టీ అధిష్టాన వర్గాన్ని కోరుతున్నారు. ఇదే సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి జోనల్ ఇన్‌చార్జ్ ఇటీవల రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి (కడప)ని పార్టీ అధిష్టాన వర్గం నియమించింది. ఇటీవల శ్రీనివాసరెడ్డి, అనంతపురం నుంచి టిడిపి కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. కడప జిల్లాకు చెందిన రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి వైసిపి హయాంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్టీ కష్ట కాలంలో కూడా కడప జిల్లా కేంద్రంగా తనదైన శైలిలో శ్రీనివాసరెడ్డి గట్టి పోరాటాలు చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా ప్రస్తుతం రాజ్యసభ సీటును తనకు కేటాయించాలని పార్టీ అధినేత చంద్రబాబునాయుడును ఇటీవల ప్రత్యేకంగా కలిసి విన్నవించుకున్నట్లు తెలియవచ్చింది. ఈ విధంగా రాష్ట్రంలో ఖాళీపడే నాలుగు రాజ్య సభ స్థానాల కోసం రాజయలసీమ నుంచి కూడా పలువురు నేతలు ఆశిస్తుండటం విశేషం. ఈ ముగ్గురు నాయకులతోపాటు మరికొంత మంది కూడా రాజ్య సభ సీటును ఆశిస్తున్నప్పటికీ, ఆశిస్తున్న వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్టాన వర్గం ఏ విధంగా స్పందిస్తుంది, రాయలసీమ వారికి ఒక్కరికైనా రాజ్య సభ సీటును ఇస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే.



కమీషనర్ కె.రామచంద్రమోహన్‌ను సత్కరిస్తున్న ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమీషనర్ తదితరులు

## ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా పెన్నహోబిళ క్షేత్రం అభివృద్ధికి చర్యలు

● దేవాదాయ శాఖ కమీషనర్ కె.రామచంద్రమోహన్

**ఉరవకొండ, జూన్ 1 ప్రభాతవార్త:** లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఎంతో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిళ క్షేత్రాన్ని అటు ఆధ్యాత్మికంగా ఇటు పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఈ మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పలు సూచనలు చేశారని దేవాదాయ ధర్మాదాయశాఖ రాష్ట్ర కమీషనర్ కె.రామచంద్రమోహన్ తెలిపారు. సోమవారం మధ్యాన్నం ఆయన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో పర్యటించారు. కమీషనర్ ఆలయానికి చేరుకోగానే ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అర్చకులతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత లక్ష్మీనరసింహస్వామి వారికి దర్శించుకున్న కమీషనర్ ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించగా ఆయనకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం కమీషనర్ కె.రామచంద్రమోహన్ దేవాదాయశాఖ కర్నూల్ డిప్యూటీ కమీషనర్ ఎం.రామాంజినేయులు, జిల్లా దేవాదాయశాఖ అధికారి గంజి మల్లికార్జున ప్రసాద్ తదితరులతో కలిసి ఆలయ పరిసరాలు, అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి తన వెంట ఉన్న దేవాదాయశాఖ ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. ఆలయ నాలుగు రాజగోపురాల పునః నిర్మాణం, ప్రకారము, సాలహారం, భక్తుల సౌకర్యార్థం నీటి వసతి కొరకు ఓవర్‌హెడ్ ట్యాంకులు, వసతి గదులు, మరుగుదొడ్ల తదితరాల నిర్మాణాలు చేపట్టడం కోసం నిశితంగా ఆయా అంశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆలయానికి వచ్చే భక్తులు అత్యంత సౌకర్యవంతంగా, సంతృప్తికరంగా స్వామివారి దర్శనం కల్పించాల్సిన బాధ్యత మనపైనే ఉందని అందుకు తగ్గటు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



పవిత్ర సంగమం హారతుల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇఓ

## పవిత్ర సంగమ హారతుల ఏర్పాట్లు పరిశీలన

**ఇంద్రకీలాద్రి, జూన్ 1 ప్రభాతవార్త:** కృష్ణవేణీ నదీ నవహారతులు పున:ప్రారంభంపై ఇఓ వికె శీనా నాయక్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద సిద్ధం చేస్తున్న ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 5నుండి కృష్ణవేణీ నది నవహారతులు పున:ప్రారంభం కానున్నాయి. ఇఓతో పాటు ఆలయ స్థానాచార్యులు వి శివప్రసాద్, వైదిక కమిటీ, అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ముస్సిపాలిటీల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 123 ముస్సిపాలిటీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఇప్పటికే నిషేధం అమలులో ఉన్నప్పటికీ తొలివిడతగా 17 ప్రధాన కార్పోరేషన్‌లలో అత్యంత కఠినంగా నిషేధాన్ని అమలు చేయనున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాబిరాం తెలిపారు. పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ హితమైన ఉత్పత్తులను సామాన్యులకు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. పర్యావరణానికి మేలు చేసే ఉత్పత్తుల తయారీదారులైన మెప్మా, సెర్ప్ సంస్థలను సమన్వయం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా సంఘాలకు ఈబయోడిగ్రేడబుల్ ఉత్పత్తుల మార్కెటింగ్ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. స్వయం అనే బ్రాండ్ పేరుతో త్వరలో బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేయనున్నట్లు చెప్పారు. వీటి విక్రయాల వల్ల పర్యావరణానికి మేలు కలగటంతోపాటు, మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేసారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అడ్డుపెట్టుకుని వ్యాపారులు ధరలను పెంచకుండా చర్యలు తీసుకుంటామన్నారు. స్వయం ఉత్పత్తుల్లో పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటించటంతోపాటు, సరసమైన ధరలకు విక్రయిస్తామన్నారు. ప్లాస్టిక్ స్థానంలో బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులు తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్టార్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు ఆర్.వి.స్వామి, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామారావులు పూర్తి మద్దతు ప్రకటించారు. బయోడిగ్రేడబుల్ కవర్ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వాటిపై ఉన్న 18శాతం జిఎస్టిని 5శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో 90శాతం ఇతర రాష్ట్రాల నుండి వస్తున్నాయని, బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేయగలిగితే ఆదాయం రావటంతోపాటు, యువతకు ఉద్యోగాలు లబిస్తాయని తెలిపారు.



## సిఆర్.మీడియా అకాడమీ కార్యదర్శిగా కస్తూరి

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త:** సి.ఆర్.మీడియా అకాడమీ కార్యదర్శిగా తేళ్ళ కస్తూరి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని అకాడమీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె బ్యాదతలు స్వీకరించారు. కార్యదర్శిగా పనిచేస్తున్న మణిరామ్ పదవీవిరమణ చేయటంతో జోన్-3లో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కస్తూరికి కార్యదర్శిగా పూర్తిస్థాయిలో అదనపు బ్యాదతలు కల్పిస్తూ సమాచారశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. ఈమేరకు కార్యదర్శిగా కస్తూరి బాద్యతలు స్వీకరించారు. అకాడమీ మేనేజర్ భాస్కరనారాయణ అకాడమీలో అమలు అవుతున్న పలు కార్యక్రమాలను కస్తూరికి వివరించారు. మీడియా అకాడమి మాజీ కార్యదర్శి బాలగంగాధర తిలక్ తదితరులు కస్తూరిని అభినందించారు.

## 'సంక్షేమ పథకాల అమలులో ఎపి ఆదర్శం'

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త:** సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. సోమవారం ఉదయం విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ సర్కిల్ 2 పరిధిలోని మారుతీనగర్‌లోని 26వ స్వర్ణవార్డులో లబ్దిదారులకు ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్‌లను కలెక్టర్ పంపిణీ చేసారు. ఈసందర్భంగా సంక్షేమపథకాల అమలు తీరును లబ్దిదారులను ఆడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక భద్రతా పింఛన్‌ల ద్వారా వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, డప్పుకళాకారులు, మత్యకారులు, ట్రాన్స్‌జెండర్లతోపాటు నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉంటున్నట్లు తెలిపారు.

ప్రతినెల ఒకటోవతేదీన వేకువజామునే స్వర్ణవార్డు సబ్బంది లబ్దిదారుల ఇళ్ళవద్దకు వెళ్ళి పింఛన్‌లు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,25,887 మంది లబ్దిదారులకు రూ.99,01కోట్లు పింఛన్‌ల రూపంలో ప్రతి నెలా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి నాంచారరావు, వియంసి జోనల్ కమీషనర్ కె.ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్సిపల్ సర్వీసులను ప్రైవేటీకరించే జిఒ 975ను తక్షణం ఉపసంహరించుకోవాలి: సిపిఎం

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ముస్సిపల్ సర్వీసులను ప్రైవేటీకరించే జిఒ 975 ను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో మీడియా సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేట్ గవర్నమెంట్ ముస్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు జిఒ విడుదల చేశారనీ, ఆ తరువాత ముస్సిపల్ కమిషనర్ అన్ని ముస్సిపాలిటీలకు ఒక మెమో కూడా పంపారని తెలిపారు. జిఒ ఎంఎస్ నెంబర్ జిఒ ఆర్టి నెంబర్ 975 పేరుతో మొత్తం 14 రకాల ముస్సిపల్ సేవలన్నిటినీ ప్రైవేటుపరం చేస్తూ పిపిపి కింద ప్రభుత్వం జిఒ జారీ చేసి చాలావరకు ముస్సిపాలిటీని ప్రైవేటీకరించిందన్నారు. ఎన్నికలయ్యాయనీ.. పాలకవర్గాలు లేవనీ .. అధికారుల పర్యవేక్షణలోనే ముస్సిపాలిటీ నడుస్తుందన్నారు. ఇప్పుడు పిపిపి లు వచ్చిన తరువాత అన్ని సేవలు ప్రైవేటుపరం అయిన తరువాత ఎన్నికలు పెట్టి ప్రజాప్రతినిధులు, చైర్ పర్సన్లు వచ్చినా చేయగలిగిందేమీ లేదన్నారు. కాబట్టి 975 జిఒ ఆర్టి నెంబర్ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇలా ప్రైవేటీకరించి యూజర్ల ఛార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాలను వేస్తే వారు ఎలా భరించగలరు? అని ప్రశ్నించారు.

## తిరుమలలో మహిళ హ్యాండ్ బ్యాగ్ చోరీ

**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓ మహిళ బ్యాగ్ చోరీకి గురైన సంఘటనలో తిరుమల పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. పోలీసులు సాంకేతికతతో దొంగలను పట్టుకుని రికవరీ చేశారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలు తిరుమల 2టౌన్ పోలీసులు తెలిపారు. తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ హ్యాండ్‌బ్యాగ్ చోరీ జరిగింది.ఈ కేసులో ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను తిరుమల టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తిరుమలలో లేపాక్షి సర్కిల్ ప్రాంతంలో వ్యాపారం నిర్వహిస్తున్న ఓ మహిళ తన హ్యాండ్‌బ్యాగ్‌ను పక్కన ఉంచిన సమయంలో, అక్కడే సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులు సోమవారం మధ్యాహ్నం ఆమెతో మాటలు కలిపి దృష్టి మరల్చి, హ్యాండ్‌బ్యాగ్‌ను అపహరించారు. ఈ ఘటనను గుర్తించిన బాధితురాలు వెంటనే పోలీసుల కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సంప్రదించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కమాండ్ కంట్రోల్ సిబ్బంది పెట్రోలింగ్ పోలీసులు అప్రమత్తమై చర్యలు చేపట్టి, నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి దొంగిలించిన హ్యాండ్‌బ్యాగ్, ఐదువేల రూపాయలు నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తమిళనాడు వెల్లూరు జిల్లాకు చెందిన ఆనందన్ రమేష్ (42), తిరుచ్చి జిల్లా అరుణ్ కుమార్ విజయన్ అలియాస్ అరుణ్ (30), పల్నాడు జిల్లావాసి గోపు అఖిల్ (31)గా గుర్తించారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.




# అమెరికా బేస్‌లపై ఇరాన్ తీవ్రస్థాయి దాడులు

**న్యూఢిల్లీ,జూన్ 1:** అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన వార్‌లో తీవ్ర నష్టం జరిగింది. అమెరికాకు చెందిన సుమారు 20 సైనిక కేంద్రాలను ఇరాన్ ధ్వంసం చేసినట్లు తెలిసింది. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ ఈ అంచనా వేసింది. అనుకున్న దాని కన్నా ఎక్కవ స్థాయిలో దాడులు జరిగాయని, అమెరికాకు భారీగానే నష్టం జరిగినట్లు ఆ ఇమేజ్‌ల ద్వారా అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో ఉన్న 8 దేశాలను ఇరాన్ టార్గెట్ చేసింది. ఆ దాడులు వల్ల అమెరికాకు చెందిన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, రీఫ్యూయెలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్, రాడార్లు ధ్వంసం అయ్యాయి. అయితే ఇరాన్ షేర్ చేస్తున్న ప్లానెట్ సంస్థ శాటిలైట్ ఇమేజ్‌లపై అమెరికా నిషేధం విధించింది. ఇతర అంతర్జాతీయ ప్రొవైడర్ల ద్వారా శాటిలైట్ పిక్స్ తీసుకున్న ఆ మీడియా సంస్థ ప్లానెట్ కంపెనీకి చెందిన పాత ఇమేజ్‌లతో పోల్చింది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, ఇరాక్, జోర్డాన్, బహ్రెయిన్, ఒమన్ దేశాల్లో ఉన్న అమెరికా కేంద్రాలను ఇరాన్ టార్గెట్ చేసింది. కొన్ని సంస్థల అంచనా ప్రకారం సుమారు 28 అమెరికా బేస్‌లు ధ్వంసం అయినట్లు తెలుస్తోంది. ఖరీదైన హార్డ్‌వేర్ డ్యామేజ్ కూడా జరిగింది. యూఏఈలోని అల్ రువాయిస్, అల్ సదర్‌తో పాటు జోర్డాన్‌లో ఉన్న ముపాఫక్ సాల్టీ ఎయిర్‌బేస్‌ను డ్యామేజ్ చేశారు. అమెరికా ప్రస్తుతం 8 థాడ్ బ్యాటరీలను ఆపరేట్ చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రదేశాల్లో వాటిని మోహరించింది. ఆ బ్యాటరీలను ఆపరేట్ చేయాలంటే కనీసం 100 మంది కావాల్సిందే. వాటి ఇంటర్‌సెప్టార్ ఖరీదు రౌండ్‌కు 12.7 మిలియన్ల డాలర్లు. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌లో ఉన్న అమెరికా రీఫుయలింగ్, నిఘా విమానాలపై కూడా ఇరాన్ దాడి చేసింది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా దీన్ని స్పష్టంగా అంచనా వేశారు. సుమారు 700 మిలియన్ల డాలర్ల ఖరీదైన ఈ3 సెంట్రీ నిఘా ప్లేన్‌ను కూడా పేల్చినట్లు గుర్తించారు. కువైట్‌లో ఉన్న అలీ అల్ సలీమ్ ఎయిర్‌బేస్‌తో పాటు క్యాంప్ అరిఫ్‌జాన్‌లో ఉన్న బేస్‌ను కూడా ఇరాన్ టార్గెట్ చేసింది. సైట్ వద్ద ఫ్యూయల్ స్టోరేజ్ బంకర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ట్రూప్ అకామిడేషన్ ప్రాంతాలు ధ్వంసం అయినట్లు మలార్ శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించారు.

# ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ రాజీనామా

## సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీకి లేఖ సమర్పించినట్లు సమాచారం



**టెహ్రాన్, జూన్ 1:** ఇరాన్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తన పదవికి అధికారికంగా రాజీనామా చేస్తూ.. దేశ సుప్రీం లీడర్ అయాతొల్లా మొజ్తబా ఖమేనీకి లేఖ సమర్పించడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. దేశంలో సైన్యం ʼనిశ్శబ్ద తిరుగుబాటుకు పాల్పడిందని, ఎన్నికైన పౌర ప్రభుత్వాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి అధికారాలన్నింటినీ లాగేసుకుందని పేర్కొంటూ పెజెష్కియాన్ తన రాజీనామా లేఖలో బాంబు పేల్చారు. వివిధ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం ఇరాన్ ప్రభుత్వంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అంతర్గత పోరు ఈ నిర్ణయంతో క్లైమాక్స్‌కు చేరింది. దేశంలోని కీలకమైన, వ్యూహాత్మక నిర్ణయాలన్నింటి నుంచి తనను, తన మంత్రివర్గాన్ని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్లు పూర్తిగా పక్కనబెట్టారని అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏర్పడిన ఈ అధికార శూన్యతను ఆసరాగా చేసుకుని, ఐఆర్‌జీసీలోని కఠినతరమైన హార్డ్‌లైనర్ గ్రూపులు దేశ పరిపాలనను తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని ఆయన ఆరోపించారు. **సైన్యం చర్యలపై తీవ్ర అసంతృప్తి :** ఇటీవల పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో జరిగిన ఉద్రిక్తతలు, యూఏఈ పై జరిగిన డ్రోన్, క్షిపణి దాడుల వెనుక ఐఆర్‌జీసీ మిలిటరీ నాయకత్వమే ఉందని పెజెష్కియాన్ లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి కనీస సమాచారం కూడా లేకుండా సైన్యం ఇష్టారాజ్యంగా జరిపిన ఈ దాడులను ఆయన కేవలం ఒక పిచ్చిచర్యగా అభివర్ణించారు. బాధ్యతారాహిత్యమైన ఇటువంటి చర్యల వల్ల దేశం కోలుకోలేని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి అసాధారణ పరిస్థితుల్లో, రాజ్యాంగం నాకు కల్పించిన కనీస బాధ్యతలను కూడా నేను నెరవేర్చలేకపోతున్నాను. అందుకే ఈ పీఠంపై కొనసాగడం అర్థరహితమని రాజీనామా లేఖలో పెజెష్కియాన్ పేర్కొన్నారు. తన అధికారాలను సైన్యం క్రమంగా లాగేసుకోవడాన్ని నిరసిస్తూ పదవి నుంచి తప్పుకునే ముందే అధ్యక్షుడు పెజెష్కియాన్ ఈ విధంగా తిరుగుబాటు జెండా ఎగరేశారు. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఒక కొలిక్కి వస్తున్న తరుణంలో, ఇరాన్ దేశాధినేతే తిరుగుబాటు ఊహాగానాలను నిజం చేస్తూ తప్పుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ రాజీనామాను ఆమోదిస్తారా లేదా అనేది ఉత్కంఠగా మారింది.

# నీట్ రీఎగ్జామ్ ఓఎంఆర్ పద్ధతిలోనే.. ఎన్‌టిఎకు 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ, జూన్ 1:** రాబోయే నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్‌ను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో జూన్ 21న జరగాల్సిన రీ-ఎగ్జామ్‌ను ప్రస్తుతం ఉన్న పెన్ అండ్ పేపర్ (ఓఎంఆర్) విధానంలో నిర్వహించడానికి మార్గం సుగమమైంది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తక్షణ ఉపశమనం కల్పించడానికి నిరాకరించి, విచారణ జులైకి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా, పిటిషనర్ తరఫు న్యాయవాది, రాజ్యసభ ఎంపి సుధాకర్ సింగ్, తాము కేవలం సిబిటి విధానంలో పునఃపరీక్ష నిర్వహించాలనే డిమాండ్‌ను మాత్రమే ముందుకు తెస్తున్నామని కోర్టుకు తెలియజేశారు. ఇలాంటి పిటిషన్లు గతంలో కూడా కొట్టివేయబడ్డాయని ధర్మాసనంగుర్తుచేసింది. పునఃపరీక్షకు సన్నాహాలు ఇప్పటికే జరుగు తున్న సమయంలో పరీక్షా విధానాన్ని మార్చడంలో ఉన్న ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొంది. అసలు పరీక్ష రద్దుకావడం, కొత్తగా పరీక్ష నిర్వహించాల్సిన అవసరం ఏర్పడటంతో అధికారులు గణనీయమైన ఒత్తిడిలో పనిచేస్తున్నారని కూడా కోర్టు ఎత్తి చూపింది. దీంతో, నీట్ యుజి 2026 పునఃపరీక్ష జూన్ 21న సాంప్రదాయ ఆఫ్‌లైన్ పద్ధతిలో కొనసాగుతుంది. పరీక్షా సంస్కరణలకు సంబంధించిన విస్తృత అంశాలు, సిబిటికి మారే అవకాశం వంటి విషయాలను జులైలో విచారణ జరిగినప్పుడు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

## హైదరాబాద్ రాయదుర్గంలో ఒక్క ఎకరం రూ.204కోట్లు టిజిఐఐసి వేలంలో మరో వెయ్యి కోట్ల ఆదాయం

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 1 ప్రభాతవార్త:** రాయదుర్గం భూములు ప్రభుత్వానికి భారీగా ఆధాయాన్ని సమకూరుస్తున్నాయి. గత గురువారం నిర్వహించిన వేలంలో ఒక ఎకరా 237 కోట్ల రూపాయల భారీ ధర పలికి రికార్డు స ృష్టించగా, సోమవారం మరోసారి నిర్వహించిన వేలంలో ఒక ఎకరా 204కోట్లు పలికింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం సర్వే నెంబరు 83 నాలెడ్జ్ సిటీలోని ప్లాట్ నెంబరు 4ను టిజిఐఐసి సోమవారం ఈ వేలం నిర్వహించింది. మొత్తం 5ఎకరాల 9 గుంటల భూమిని వేలం వేయగా, ఈ వేలంలో ఒక ఎకరా 204కోట్ల రూపాయల ధర పలికింది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి దాదాపు 1వెయ్యి కోట్ల ఆదాయం సమకూరింది. గత గురువారం ఇదే సర్వే నెంబరులోని 6 ఎకరాల 29 గుంటల భూమికి వేలం నిర్వహించగా ఒక ఎకరా 237 కోట్ల భారీ ధర పలికి రికార్డులు స ృష్టించింది. గురువారం నిర్వహించిన వేలం ద్దారా ప్రభుత్వానికి 1490కోట్ల ఆధాయం సమకూరగా, తాజాగా సోమవారం నిర్వహించిన వేలంతో మరో 1వెయ్యి కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో రాయదుర్గం భూముల వేలం ద్వారా ప్రభుత్వానికి దాదాపు 2500కోట్ల ఆదాయం సమకూరింది. ప్రభుత్వం 2వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ 2500కోట్ల ఆదాయం రావడం విశేషం.

# ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా 'సంజీవని'

>> దన్నారు. వాటిని చేదించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రం తిరుమలలో మద్యం బాటిల్ ని వారే వేసి అపవిత్రం జరిగిందంటూ అలజడి సృష్టించేందుకు ప్రయత్నించారన్నారు. వైసిపి రాక్షసులు, దుర్మార్గులతో యుద్ధం చేస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన యజ్ఞం సాగిస్తుందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు అని గుర్తి పెట్టుకోవాలని ఘాటుగా హెచ్చరించారు.

రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఖిసంజీవనిఖి పథకాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ గా మార్చేందుకు వచ్చే ఆగస్టు 15వ తేదీ నుండి ఖి సంజీవనిఖి పేరుతో ఆరోగ్య పథకాన్ని ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పేదల్లో జీవన ప్రమాణాలు మెరుగుపరిచి, రాష్ట్రంలో పేదరికం రూపుమాపేందుకు పి 4 విధానం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి సాధించిన వ్యక్తులు పేదలను దత్తత తీసుకునివారికి ఆర్థికంగా విద్యాపరంగా చేయూతని అందించడం ద్వారా భవిష్యత్తులో బంగారు కుటుంబాలు ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారన్నారు. అభివృద్ధి, సంక్షే మంతో ఎన్డీఏ ప్రభుత్వంలో రాష్ట్రం ముందుకు సాగుతుం దన్నారు. శ్రీకాకుళం నుండి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వరకు విశాఖ కేంద్రంగా ఒక రీజియన్ గా, ప్రకాశం జిల్లా వరకు అమరావతి కేంద్రంగా, తిరుపతి కేంద్రంగా రాయలసీమ జిల్లాలను రీజియన్ గా ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఈ మూడు రీజియన్లలో సమపాళ్లలో అభివృద్ధి జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. కాకినాడ జిల్లాలో కోస్టల్ ఏరియాను పోర్టులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు.

అదేవిధంగా పర్యాటకపరంగా కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. జూన్,జూలై మాసాలలో విద్యార్థులకు తల్లికి వందనం నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. భారతదేశంలో వృద్ధులు వికలాంగులకు అత్యధిక పింఛలను అందించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. 2027లో వచ్చే గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోని అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ప్రజా వేదికలో పి 4 లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారికి భరోసా కల్పించారు. అనంతరం చామ వరం గ్రామంలో లబ్ధిదారులకు వారి యొక్క ఇళ్లకు వెళ్లి పింఛన్ లు అందించి , వారికి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు.కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ,ఎంపీలు తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, తుని నియోజకవర్గ

# భారత్ సంపూర్ణ మద్దతు

>> ధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి అంగీకరించారు. ఈ సమావేశంలో, సమాఖ్య పాలన, ఆర్థిక వృద్ధి అనుభవాలను పంచుకోవడంతో సహా, మయన్మార్‌లో శాంతి, సంప్రదింపులకు మద్దతు ఇచ్చేందుకు భారతదేశ సంసిద్ధతను ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. సుదీర్ఘ చారిత్రక, ప్రజల మధ్య సంబంధాలకు శాంతి, పురోగతి, శ్రేయస్సు కోసం భారత్- మయన్మార్ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, అలాగే వాణిజ్యం, పెట్టుబడులు, అనుసంధానం, అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్య నిర్మాణం, భద్రత, సరిహద్దుల నిర్వహణ వంటి రంగాలలో మరింత సహకరించుకోవడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. భారతదేశం మయన్మార్‌కు విశ్వసనీయ పొరుగు దేశంగా, నమ్మకమైన భాగస్వామిగా, సంక్షోభ సమయాల్లో దృఢమైన ప్రథమ స్పందనదారుగా నిలుస్తుందని ప్రధాని తెలియజేశారు. సమాఖ్య పాలన, ఆర్థిక వృద్ధి అనుభవాలను పంచుకోవడంతో సహా, మయన్మార్‌లో శాంతి, సంప్రదింపులకు మద్దతు ఇవ్వడానికి భారతదేశం సిద్ధంగా ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. "భారతదేశం నైబర్‌హుడ్ ఫస్ట్, యాక్ట్ ఈస్ట్, మహాసాగర్ విధానాల సంగమ స్థానంలో మయన్మార్ ఉంది. అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్ అధికారిక భారత పర్యటన ఇరు దేశాల మధ్య బహుముఖ సంబంధాలను మరింత బలోపేతం చేసి, గాఢతరం చేస్తుందని భావిస్తున్నాము" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# పన్నులు ఎగ్గొడితే కొరడా

>> దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఐదు అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్ రెండో స్థానాన్ని దక్కించుకుందన్నారు. ఒడిశా రాష్ట్రం కూడా ఐదు అవార్డులతో ఏపీతో పాటు సంయుక్తంగా రెండో స్థానాన్ని పంచుకుందన్నరు.మరింత కృషి చేస్తే మెదటి స్దానంలోకి వస్తామన్నారు.ఇక దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పురస్కార్ కింద దేశవ్యాప్తంగా మొత్తం 34 గ్రామ పంచాయతీలకు కేంద్రం ర్యాంకులు ఇచ్చింది. వీటికి రూ. 25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నగదు బహుమతులు అందుతాయి. అలాగే, నానాజీ దేశ్‌ముఖ్ పురస్కార్ కింద దేశవ్యాప్తంగా 8 బ్లాక్ పంచాయతీలను ఎంపిక చేసి, రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు నగదు ఇవ్వనున్నారు. ఈ జాతీయ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని వచ్చే నెల (జూన్) 3వ తేదీన దేశ రాజధాని దిల్లీలో అట్టహాసంగా నిర్వహించనున్నారు. అవార్డులు సాధించిన పల్లెల సర్పంచులు, అధికారులు ఆ వేదికపై ఈ పురస్కారాలను అందుకోనున్నారు. **చెట్టినాడ్ సిమెంట్స్ పన్ను వసూళ్లలో అవకతవకలపై తక్షణ చర్యలు:** సమావేశంలో పవన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పంచాయతీలు బాగుపడాలి.. నాలుగు గ్రేడ్లకు డిఫరెంట్ స్లాబ్స్ తో టాక్సులు నిర్ధారించండి. విద్యాసంస్థలకు కూడా గ్రేడ్లు నిర్ణయించండి.. కరెంటు వాడేసుకుని బిల్లు కట్టమంటే కోర్టుకి ఎలా వెళ్తారు.. ఉచితంగా విద్యను అందిస్తూ ఇన్సెంటివ్స్ ఇవ్వమంటే అర్థం ఉంటుంది.. లక్షలకి లక్షలు ఫీజులు తీసుకుని పన్ను కట్టకుండా ఉంటే ఎలా? ప్రజలకి ఏం సమాధానం చెబుతాం. వారిని వదిలేసి మమ్మల్ని పీడిస్తున్నారని ప్రజలు అంటే ప్రభుత్వానికి చెడ్డపేరు. గత 30 ఏళ్లలో పంచాయతీల ఆస్తులు ఎన్ని అన్యాక్రాంతం అయ్యాయనే అంశంపై కూడా సమగ్ర నివేదిక ఇవ్వండి. పన్ను చెల్లింపుల వ్యవహారంలో మినహాయింపులు ఇవ్వాల్సి ఉంటే వాటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. పన్నుల వసూళ్లలో అవకతవకలు సహించం. తాళ్లపాలెం, చెట్టినాడ్ సిమెంట్స్ నుంచి పన్ను వసూలు చేయని పంచాయతీ కార్యదర్శిపై తక్షణం చర్యలు తీసుకోవాలి. పన్ను చెల్లింపుల్లో అవకతవకల్ని ఉపేక్షించవద్దు. పెద్ద పెద్ద పరిశ్రమల నుంచి పన్నులు వసూలు కాని జాబితా సిద్ధం చేసి, ఎందుకు వసూలు కావడం లేదు అనే వివరాలు సమర్పించండి పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలి. అందుకోసం కలప ఇచ్చే మొక్కలు ప్రతి పంచాయతీలో 2 వేలు నాటాలి. దీని కోసం పంచాయతీరాజ్, అటవీశాఖల మధ్య పరస్పర ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు త్వరలో పంచాయతీలకు చేరతాయి.

# భారీ వర్ష సూచన

>>హెచ్చరించారు. వాతావరణం అనుకూలంగా లేనందున రాబోయే రెండు రోజుల పాటు దక్షిణ కోస్తా తీరంలోని మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని అధికారులు స్పష్టం చేశారు. ఇదే సమయంలో నైరుతి రుతుపవనాల రాకపై కూడా ఐఎండీ కీలక అప్‌డేట్ ఇచ్చింది.మరో 48 గంటల్లోపు ఈ రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉందని,తద్వారా దేశంలోకి వర్షాకాలం అధికారికంగా ప్రవేశిస్తుందని పేర్కొంది

## హైదరాబాద్‌లో నేడు తలపెట్టిన డిసిఎం పవన్ సభకు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరణ

**విజయవాడ, జూన్ 1,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్‌లో ఈనెల 2న ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ జనసేన సాధక్ సమ్మేళనం సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా అనుమతి నిరాకరిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో తెలంగాణ జనసేన నేతలు కోర్టును ఆశ్రయించారు.సభ కాదు సమావేశం: జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుందని అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. హైదరాబాద్‌లో నవ నిర్మాణ సభ పెట్టాలన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయంపై తెలంగాణ రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ అభ్యంతరం తెలిపారు. తొలుత తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ పెట్టుకోవాలని స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడిన పవన్ కల్యాణ్ బీజేపీ అజెండా మోస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే ఎందుకు సభ పెడుతున్నారో చెప్పాలని పొన్నం డిమాండ్ చేశారు.

## నేడు ఎమ్మెల్యేలతో సిఎం చంద్రబాబు కీలక భేటీ

**విజయవాడ,జూన్ 1, ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు కీలక భేటీని మంగళవారం నిర్వహించనున్నారు,.ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎమ్మెల్యేలకు పలు సూచనలు సీఎం చంద్రబాబుచేయనున్నారు.ఓటరు వెరిఫికేషన్ సమయంలో ఎలా వ్యవహరించాలో ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు.

### వారం - వర్జ్యం

02-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
విదియ రా.7.01
మూల రా.10.06
వర్జ్యం : రా.8.18-రా.10.06
దు.ఉ.8.10-ఉ.9.02,2) రా.11.50-రా.12.42
శుభసమయం : ఉ.10.00-10.30
రాహుకాలం – మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** మీరు లాభము వస్తుందని చేపట్టిన వ్యాపారములో నష్టములను చవి చూడవలసి వస్తుంది. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**వృషభం:** మీ వృత్తి యందు చేసిన పొరపాటుకు సంజాయిషీలను చెప్పుకోవలసి రావచ్చును. ఆరోగ్యం విషయం జాగ్రత్త.

**మిథునం:** గోష్ఠులకు, చర్చలకు, పరిష్కారములకు, సంప్రదింపులకు అత్యంత లాభదాయకం. శుభ ఆహ్వానాలు అందుతాయి.

**కర్కాటకం:** గృహావసరములకు, శారీరక సౌఖ్యమునకు కొన్ని విలువైన వస్తువులను ఏర్పరచుకుంటారు. వాహనసౌఖ్యం.

**సింహం:** ఆలోచనలను ప్రక్కనపెట్టి, మీ దైనందిన కార్యక్రమముల మీదనే దృష్టిని సారిస్తారు. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కన్య :** ఆధ్యాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చు చేస్తారు.పుణ్యక్షేత్రాలు సందర్శనం.

**తుల :**నూతన వ్యవహారము లుండగలవు. కొత్త వ్యక్తులను కలుస్తారు. కొత్త ప్రదేశములకు సందర్శిస్తారు.

**వృశ్చికం:** దైవ సంబంధిత విషయములు సంతృప్తికరంగా ఆచరిస్తారు. ఉద్యోగము వంటి ముఖ్యమైన విషయాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాత్మక చర్చలు జరుగుట, సుదీర్ఘమైన లేఖలు వస్తాయి.

**మకరం:** మిమ్ములను వ్యతిరేకించవ - స్త్రీలు ఆకస్మికముగా మీకు అనుకూలముగా మారుట అమిత ఆశ్చర్యము కలిగిస్తుంది.వాహనసౌఖ్యం.

**కుంభం:**కొత్త వ్యాపార, విద్యా సంబంధిత మైన విషయములకు గృహ కార్యక్రమాలు ప్రారంభించుటకు అనుకూలం.

**మీనం :** ప్రజా సంబంధముల వృద్ధిని ఒక ఉద్దేశ్యములో ప్రారంభిస్తే అది వేరొక మలుపు తిరుగుతుంది. వస్త్ర లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంత్రి లోకేష్‌కు గణేష్ ప్రతిమను బహూకరిస్తున్న మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్

## మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. అనంతరం సీఎం ఫడ్నవీస్‌ను మంగళగిరి చేనేత శాలువాతో లోకేశ్ సత్కరించారు. శ్రీవారి ప్రతిమను ఫడ్నవీస్‌కు మంత్రి లోకేశ్ అందజేశారు. సీఎం ఫడ్నవీస్ సైతం గణేశ్ ప్రతిమను లోకేశ్‌కు బహూకరించారు. ఏపీకి పెట్టుబడులు, విద్యాశాఖలో సంస్కరణలపై ఫడ్నవీస్‌కు లోకేశ్ వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ఫడ్నవీస్‌కు లోకేశ్ వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ విధానాలను మంత్రి లోకేశ్ తెలియజేశారు. మహారాష్ట్ర ఐటీ, విద్యా శాఖలో విధానాలను లోకేశ్ ఫడ్నవీస్‌ను అడిగి తెలుసుకున్నారు.

# విశాఖ రైల్వే జోన్ ఆరంభం

>> దాబాద్ రైలు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఈ రైలు సేవలు నేరుగా ఇచ్ఛాపురం నుంచే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని తన ఆకాంక్షను వెల్లడించారు.

**రూ.400 కోట్లతో ప్రధాన కార్యాలయ నిర్మాణం :** విశాఖపట్నంలో 54 ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో సుమారు రూ.400 కోట్ల అంచనా వ్యయంతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు ఇప్పటికే శరవేగంగా ప్రారంభమయ్యాయని కేంద్రమంత్రి సమాచారం అందించారు. ఈ చారిత్రాత్మక పండుగ తరుణంలో తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా శ్రీకాకుళంజిల్లా ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే జోన్‌ను మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇందుకు నిరంతరం సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి జిల్లా ప్రజల తరపున కేంద్ర మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. ఇచ్ఛాపురం సరిహద్దు ప్రాంతమైన ఏ.ఎస్.పేట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద సౌత్ కోస్ట్ రైల్వే జోన్ బోర్డును ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడే మొక్కలు నాటారు. అనంతరం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 22వ వార్డులో లబ్ధిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులతో మంత్రి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బహిరంగ సభలో మాట్లాడి అనంతరం రైలులో ఇచ్ఛాపురం నుంచి పలాస బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లా ఉన్నతాధికారులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## కర్ణాటక నుంచి వైఎస్ షర్మిలకు రాజ్యసభ టిక్కెట్

**విజయవాడ, జూన్ 1, ప్రభాతవార్తప్రతినిధి:** కర్ణాటక నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను నిలిపేందుకు ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు కర్ణాటక పార్టీ వర్గాలకు సమాచారం అందించినట్లు ఏపీ పీసీసీ బాధ్యులు చెబుతున్నారు. కర్ణాటక నూతన సీఎం డీకె శివకుమార్ ప్రమాణ స్వీకారం అనంతరం రాజ్యసభ సభ్యుల అభ్యర్థులను ఏఐసిసి ప్రకటిస్తుందంటున్నారు.

## 'సుప్రీం'కు మరో ఐదుగురు జడ్జిలు

>> ఒక ఆర్డినెన్స్ ద్వారా, భారత ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు మంజూరైన న్యాయమూర్తుల సంఖ్యను 34 నుండి 38కి కేంద్ర ప్రభుత్వం పెంచిన కొద్ది కాలానికే ఈ ఐదుగురు న్యాయమూర్తుల పదోన్నతి లభించింది. ఈ తాజా నియామకాలతో, సుప్రీంకోర్టు ఇప్పుడు 37 మంది న్యాయమూర్తులతో పనిచేస్తోంది. దీంతో ఇంకా ఒకే ఒక్క స్థానం భర్తీ చేయాల్సి ఉంది. నియమితులైన వారిలో, వెంకిట సుబ్రమణి మోహన నేరుగా సుప్రీం కోర్టు బెంచ్‌కు పదోన్నతి పొందిన కొద్దిమంది సీనియర్ న్యాయవాదులలో ఒకరిగా నిలిచారు. నియమితులైన మిగిలిన నలుగురు దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టులలో ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేస్తున్నారు.

## విశాఖలో ఎయిర్‌ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయండి

>> సెంటర్లను ఏర్పాటుచేయాలన్నది మా లక్ష్యం అన్నారు.మల్టీగిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై మేం దృష్టిసారించాం. ఎయిర్ ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్ ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు మావద్ద అందుబాటులో ఉన్నాయి. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ కోసం రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు కూడా సిద్ధమవుతున్నాయి. ఏపీలో ఎయిర్ ట్రంక్ పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు. ఎయిర్‌ట్రంక్‌తో సంబంధాలను పునరుద్ధరణ, భారతదేశంలో తదుపరి దశ విస్తరణ, హైపర్ స్కేల్ మౌలిక సదుపాయాలు, ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా నిలిపే అంశంపై మంత్రి లోకేష్ చర్చించారు. రాబిన్ ఖుదా స్పందిస్తూ ఎయిర్‌ట్రంక్ ఇండియా ప్రణాళికలు, మినా క్లౌడ్ ఇన్‌ఫ్రాను స్వాధీనం చేసుకున్న తర్వాత దాని ఏకీకరణ, భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, విస్తరణ రోడ్‌మ్యాప్, కీలక కస్టమర్ సేవలు, హైపర్‌స్కేలర్ అవసరాలపై చర్చిం చారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# నేటి నుంచి రష్యాలో లోకేష్ పర్యటన

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 2 మంగళవారం నుంచి రష్యాలో పర్యటించనున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ పర్యటన సాగనుంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్ (ఎస్‌పిఐఇఎఫ్) సదస్సులో పాల్గొనాలని మంత్రి లోకేష్‌కు ఆహ్వానం అందింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటి, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్దయెత్తున పెట్టుబడులొస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# మద్యం ముడుపుల కేసు.. సిట్ విచారణకు కెఎన్ఆర్

**విజయవాడ జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం ముడుపుల కేసులో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ పీఏ కేఎన్ఆర్‌ను సిట్ అధికారుల విచారణ చేస్తున్నారు. సిట్ ఆదేశాల మేరకు కేఎన్ఆర్ ఇవాళ విచారణకు హాజరయ్యారు. విజయవాడ సిట్ కార్యాలయంలో కేఎన్ఆర్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవలే 2రోజులపాటు ఆయన్ను ప్రశ్నించిన అధికారులు. బినామీల వివరాలను రాబట్టారు.

వైకాపా అధికారప్రతినిధి శివశంకర్‌రెడ్డిని కేఎన్ఆర్ బినామీగా గుర్తించారు. ప్రస్తుతం కేఎన్ఆర్ ఆస్తులపై వివరాలను రాబడుతున్నట్లు తెలుస్తోంది.

# ఏజ్ చిన్నది.. గేమ్ పెద్దది

* ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ
* ఆరెంజ్ క్యాప్ (హైఎస్ట్ రన్స్)
* సీజన్ సూపర్ స్ట్రైకర్
* సీజన్ అత్యధిక సిక్సర్లు
* ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్
* మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్

ఈ ట్రోఫీలన్నింటి కోసం బీరువా కావాల్సి వస్తుందేమో.. అహ్మదాబాద్ ఫైనల్ వేదికలో వైభవ్ సూర్యవంశీని ఇంటర్వ్యూ చేస్తూ రవిశాస్త్రి చేసిన సరదా వ్యాఖ్య. ఇదే నిజం కూడా. రాజస్థాన్ రాయల్స్ ఫైనల్ ఆడకపోయినా వండర్ కిడ్ క్రేజ్ మాత్రం తగ్గలేదు. అవార్డుల పంట పండింది. ఆర్సీబీ విజేతగా నిలిచిన తర్వాత జరిగిన ప్రైజ్ సెర్మనీలో ఈ కుర్రాడే కేంద్ర బిందువుగా మారాడు. ఈ సీజన్ మొత్తానికి అత్యంత ప్రతిభావంతుడైన ఆటగాడిగా ఎంపికై అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈ ఒక్కటితోనే సరిపెట్టకుండా ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీ, టోర్నీలో అత్యధిక పరుగులు చేసే ప్లేయర్‌కిచ్చే ఆరెంజ్ క్యాప్, సీజన్ సూపర్ స్ట్రయికర్, సీజన్ అత్యధిక సిక్సర్లు,మెస్ట్ వాల్యుబుల్ పేయర్ అవార్డులూ గెలుచుకుని మహా మహా ఆటగాళ్లే నోరేళ్లబెట్టేలా చేశాడు. అంతేకాదు యూనివర్సల్ బాస్‌నే మించిపోయి యూనివర్సల్ బేబీ బాస్‌గా కితాబు అందుకుంటున్నాడు వైభవ్.

(వార్త క్రీడా విభాగం)

ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండు నెలల పాటు క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించింది. ఆర్సీబీ వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకోవడంతో ఐపీఎల్ 2026 సీజన్ ఎంతో ఉత్కంఠభరితంగా ముగిసింది. ఈ సీజన్‌లో సీనియర్ ఆటగాళ్లు తమ అనుభవంతో రాణించినప్పటికీ, కొంతమంది యువ ఆటగాళ్లు మాత్రం అసాధారణ ప్రదర్శనతో లీగ్‌ను శాసించారు. అత్యధిక పరుగుల ఛేజింగ్‌లు, వివాదాలు, రికార్డులతో సాగిన ఈ సీజన్.. భారత క్రికెట్‌కు ఎంతోమంది భవిష్యత్తు స్టార్లను పరిచయం చేసింది. అందులో అగ్రస్థానంలో ఉంటాడు యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ.

ఈ 15 ఏళ్ల క్రికెట్ వండర్ ఆడింది ఐపీఎల్ రెండో సీజన్ అయినా టోర్నీ ఆద్యంతం అందరి చూపు వైభవ్‌పైనే. ఐపీఎల్ 2026 సీజన్‌కు అసలైన బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచాడు. అందరీ అంచనాలను నిలబెడుతూ ఐపీఎల్ సీజన్ ఆద్యంతం అలరించాడు. 237.31 మైండ్ బ్లోయింగ్ స్ట్రైక్ రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. జస్ప్రీత్ బుమ్రా, ప్యాట్ కమిన్స్, భువనేశ్వర్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్, కగిసో రబాడా వంటి ప్రపంచ స్థాయి బౌలర్ల లైన్ అండ్ లెంగ్త్‌ను దెబ్బతీస్తూ పవర్‌ప్లేలో వైభవ్ ఆడిన ఇన్నింగ్స్‌లు ఈ సీజన్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఈ సీజన్‌లో ఏకంగా 776 పరుగులు సాధించాడు. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, మిచెల్ మార్ష్, డేవిడ్ మిల్లర్, జోస్ బట్లర్ లాంటి దిగ్గజ ప్లేయర్లను వెనక్కి వైభవ్ సూర్యవంశీ ఆరంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు.

2025లో ఐపీఎల్ అరంగేట్రంలోనే సంచలన తారగా దూసుకు వచ్చాడు. అండర్-19 ప్రపంచకప్‌లో జోరు చూపిన వైభవ్ అదే మూమెంటమ్‌ను ఈ ఐపీఎల్ సీజన్ తొలిమ్యాచ్ నుంచే కొనసాగించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 35 బంతుల్లోనే సెంచరీతో చెలరేగిన వైభవ్, మరో మూడుసార్లు సెంచరీల ఊపులో కనిపించాడు. ముఖ్యంగా కీలకమ్యాచ్‌ల్లో వైభవ్ బ్యాటింగ్ పీక్‌కు చేరింది. గెలిస్తేనే ప్లే ఆఫ్‌కు చేరే మ్యాచ్‌లో 93రన్స్ సాధించాడు. ఇకనాకౌట్‌లో ఎస్ఆర్‌హెచ్‌పై మరింత విధ్వంసంసృష్టించాడు. 29 బంతుల్లోనే సెంచరీ ఫీట్ కొద్దిలో మిస్సయ్యాడు. ఇక గుజరాత్‌పై 96 రన్స్ సాధించాడు. ఈఐపీఎల్‌లో 327బంతులు మాత్రమే ఎదుర్కొని 776 రన్స్‌తో టాప్‌గా నిలిచాడు.






## నార్వే చెస్‌లో గుకేశ్, దివ్యకు ఓటమి

**ఓస్లో, జూన్ 1:** నార్వే చెస్ టోర్నమెంట్ ఆరో రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు డి. గుకేశ్, దివ్య దేశ్‌ముఖ్ ఓటమిపాలయ్యారు. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్... జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమర్ చేతిలో పరాజయం పొందగా, మహిళల విభాగంలో దివ్య దేశ్‌ముఖ్‌పై ప్రపంచ ఛాంపియన్ జూ వెన్‌జున్ విజయం సాధించింది. ఇక పురుషుల విభాగంలో మాగ్నస్ కార్ల్‌సెన్ ఎట్టకేలకు సంచలన విజయం సాధించాడు. అగ్రస్థానంలో ఉన్న అలీరెజా ఫిరౌజ్జాను ఓడించాడు. కాగా ప్రజ్ఞానందపై వెస్లీ సో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. మహిళల విభాగంలో బిబిసారా ఆర్మాగెడాన్ విజయంతో 9.5 పాయింట్లతో మళ్లీ టాప్‌లో నిలిచింది. దివ్య దేశ్‌ముఖ్ 8.5 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది.

గత మ్యాచ్‌లో నెగ్గి టైటిల్ రేసులో నిలిచిన గుకేశ్‌కు ఆరో రౌండ్‌లో అనూహ్య ఓటమి ఎదురైంది. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్‌ను విన్సెంట్ కీమర్ ఓడించడంతో మూడవ నిర్ణయాత్మక ఫలితం నమోదైంది. కీమర్ ఆట మధ్యలో ఆధిక్యాన్ని కొనసాగించి, తనకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. ప్రపంచ ఛాంపియన్‌పై విలువైన విజయాన్ని నమోదు చేశాడు. ఆరవ రౌండ్ తర్వాత, నార్వే చెస్‌లో వెస్లీ సో ఆధిక్యంలో ఉండగా, అలీరెజా ఫిరౌజ్జా అతనికి సమీపంగా నిలిచాడు. దీంతో మొదటి స్థానం కోసం పోరు హోరాహోరీగా సాగుతోంది.



## జీ నెట్‌వర్క్‌కు ఫిఫా ప్రపంచకప్ ప్రసార హక్కులు

**న్యూఢిల్లీ, జూన్1:** భారత్‌లో ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల ప్రసారాలకు లైన్ క్లియర్ అయింది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిమిస్తున్న ఫిఫా ప్రపంచ కప్ జూన్ 11 నుంచి ఆరంభం కానుంది. ఈ మెగా టోర్నీకి సంబంధించి భారత్‌లో ప్రసార హక్కులను జీ నెట్‌వర్క్ దక్కించుకుది. ఫిఫా ప్రపంచకప్ ఆరంభానికి 10 రోజుల ముందు ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఫిఫా ప్రపంచ కప్ మ్యాచ్‌లతో పాటు 2034 వరకు 38 ఫీఫా టోర్నీలకు సంబంధించిన మ్యాచ్‌లను జీ నెట్‌వర్క్ ప్రసారం చేయనుంది. ఈ విషయాన్ని జీ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారికంగా వెల్లడించింది. 2026 ఫిఫి ప్రపంచకప్‌తో పాటు ఫిఫా మహిళల ప్రపంచకప్ 2027, ఫిఫా ప్రపంచకప్ 2030 సహా మిగతా ఈవెంట్లకు సంబంధించిన మ్యాచ్‌లను భారత్‌లో జీనెట్‌వర్క్ ప్రసారం చేస్తుందని తెలిపింది. 8ఏళ్ల కాలానికి ఒప్పందం విలువ కూడా భారీస్థాయిలోనే ఉండనుంది. దేశంలోని ప్రముఖ క్రీడా ప్రసార సంస్థ జియోస్టార్ ఈ హక్కుల కోసం సుమారు 20 మిలియన్ డాలర్లను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఫీఫా ఈ బిడ్‌ను తిరస్కరించింది. సోనీ సంస్థ కూడా ఈ హక్కుల ప్యాకేజీపై చర్చలు జరిపింది. కానీ చివరికి అది బిడ్ సమర్పించలేదు. భారతీయ బ్రాడ్‌కాస్టర్లు ఈ హక్కులను కొనుగోలు చేయడానికి అంతగా ఆసక్తి చూపకపోవడానికి మ్యాచ్‌ల సమయాలే పెద్ద సమస్యగా మారాయి. మొత్తం 104 మ్యాచ్‌లు జరుగుతుండగా.. అందులో కేవలం 14మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లోపు ప్రారంభమవుతాయి. మిగిలినవన్నీ అర్ధరాత్రి దాటాక లేదా తెల్లవారుజామున ప్రారంభం కానున్నాయి.




## ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్, జోడార్

పారిస్, జూన్ 1: ఫ్రెంచ్ ఓపెన్‌లో రెండో సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్.. వరుసగా ఆరో ఏడాది క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 7-6 (7/3), 6-4, 6-1తో జెస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. మొదటి సెట్‌లో ఇద్దరూ పోటాపోటీగా తలపడ్డా జ్వెరెవ్‌దే పైచేయి అయింది. తరువాతి రెండు సెట్లలో మాత్రం జ్వెరెవ్ దూకుడు ముందు జెస్పర్ నిలవలేకపోయాడు. డిఫెండింగ్ చాంపియన్ అల్కారాజ్(స్పెయిన్) గాయంతో ఈ టోర్నీకి దూరంగా ఉండటం... ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) రెండో రౌండ్‌లో ఓటమి... మాజీ విజేత, సెర్బియా దిగ్గజం నోవాక్ జొకోవిచ్ మూడో రౌండ్‌లో వెనుదిరగడంతో... జ్వెరెవ్ టైటిల్ ఫేవరెట్‌గా అవతరించాడు. జ్వెరెవ్ తన స్థాయికి తగ్గట్టు ఆడితే గాండ్‌స్లామ్ టైటిల్ కల నిజమవుతుంది. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో.. 2024 ఫ్రెంచ్ ఓపెన్‌లో... 2020 యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన జ్వెరెవ్ మూడుసార్లూ ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు.

మరోవైపు స్పెయిన్ రైజింగ్ స్టార్ రాఫెల్ జొడార్ ఆడుతున్న రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనే క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో 19 ఏళ్ల జొడార్ 4-6, 4-6, 6-1, 6-2, 6-2తో పాబ్లో కరెనో బుస్టా (స్పెయిన్)పై గెలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-అలెగ్జాండ్రా పనోవా (రష్యా) ద్వయం 1-6, 3-6తో డెసిరె క్రాసిక్ (అమెరికా)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) చేతిలో ఓడారు.

## యుద్ధభయాలతో నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

**ముంబయి, జూన్ 1:** భారతీయ స్టాక్ మార్కెట్లకు సోమవారం ట్రేడింగ్ భారీ నష్టాలను మిగిల్చింది. ఉదయం పూట అంతర్జాతీయ మార్కెట్ల మద్దతుతో 500 పాయింట్లకుపైగా లాభపడి సరికొత్త రికార్డుల వైపు పయనిస్తుందనుకున్న దలాల్ స్ట్రీట్ మధ్యాహ్నం మూడు గంటల సమయానికి పూర్తిగా తిరోగమించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి ఒక్కసారిగా తీవ్రం కావడంతో మార్కెట్లు తమ లాభాలన్నింటినీ కోల్పోయి భారీ నష్టాలను చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఇ సెన్సెక్స్, ఎన్ఎస్ఇ నిఫ్టీ రెండు సూచీలు కూడా నష్టాల్లోనే స్థిరపడ్డాయి.

ఉదయం 23,700 మార్కును తాకిన నిఫ్టీ ముగింపు సమయానికి 165.15 పాయింట్లు పతనమై 23,400స్థాయికంటే దిగువన ముగిసింది. సెన్సెక్స్ 508.40పాయింట్ల మేర పతనమైంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మార్కెట్ ఇంతలా కుప్పకూలడానికి ప్రధానంగా పశ్చిమాసియా పరిణామాలు కారణమయ్యాయి. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయనుకుంటున్న తరుణంలోనే, ఇరుదేశాలు పరస్పరం దాడులు



చేసుకోవడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఇరాన్ రాడార్, డ్రోన్ కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా దానికి ప్రతిగా కువైట్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు చేసినట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లను భయాందోళనలకు గురిచేశాయి.

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 93 డాలర్ల మార్కును తాకడం ద్రవ్యోల్బణ భయాలను మరింత పెంచింది. దీనికి తోడు గత శుక్రవారం ఏకంగా 21వేల కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించిన విదేశీ పెట్టుబడిదారులు, ఈ రోజు మధ్యాహ్నం తర్వాత కూడా లార్జ్‌క్యాప్ షేర్లలో తమ అమ్మకాలను పెంచేసారు. బిఎస్ఇలో1589షేర్లు పెరిగితే 2761 కంపెనీలు నష్టపోగా 207కంపెనీలు యధాతథంగా కొనసాగాయి. కంపెనీల్లోప్రధానంగా ఐటిసి 2.53శాతం, ఎల్అండ్‌టి 1.61శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.33శాతంనష్టపోయాయి. విదేశీ కరెన్సీ మార్పిడిలో డాలరుతో రూపాయి మారకం విలువలు 94.94 రూపాయలుగా చెలామణి అయింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదు సెటిల్‌మెంట్ ధరలు 0.55శాతం క్షీణించి రూ.1,54,725గా కొనసాగాయి. ఇక కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 2.91 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 94.03 డాలర్లుగా కొనసాగింది. ఆటో మొబైల్ సేల్స్ కూడా ఆ కంపెనీల షేర్లకు మద్దతుగా నిలిచాయి. నిఫ్టీలో ఐటిసూచి 2.66శాతం పెరిగింది. టెక్ మహీంద్ర 3.71, ఇన్ఫోసిస్ 3.67, ఎల్‌టిఐఎం 3.65, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 3.57, కాఫోర్జ్ 2.55శాతం లాభాల్లో ముగిసాయి. ఎన్ఎండిసి కూడా 13.18శాతం షేర్లుపెరిగింది. వొకార్డ్ 5.98, ఇండో కౌంట్ ఇండస్ట్రీస్ 7.26శాతంచొప్పున పెరిగాయి.




## ఏప్రిల్ ఆర్థికలోటు రూ.3.62 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 1:** కేంద్ర ఆర్థికలోటు ఒక్క ఏప్రిల్‌నెలలోనే బడ్జెట్ అంచనాల్లో 21.4శాతానికి చేరింది. కాగ్ నివేదికలప్రకారం ఆర్థికలోటు 3.62 లక్షల కోట్లుగా ఉందని సోమవారం డేటా విడుదల చేసింది. గత ఆర్థికసంవత్సరంలోని గణాంకాలతో పోలిస్తే రెట్టింపుస్థాయికి ఆర్థికలోటు నమోదయింది. అమెరికా ఇరాన్ యుద్ధం సందర్భంగా పెరిగిన వ్యయాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. పశ్చిమాసియా యుద్ధం ముడిచమురుధరలపై తీవ్ర ప్రభావంచూపించింది. చమురుధరలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రభుత్వం కూడా విండ్‌ఫాల్ పన్నులను తగ్గించింది. చమురు కంపెనీలు, ప్రభుత్వం పెరిగిన ధరలను సాధ్యమైనంతగా ప్రజలపై భారం పడకుండా చూసాయి. చివరిరోజుల్లో మాత్రమే పెట్రోడీజిల్, ఎటిఎఫ్, గ్యాస్‌ధరలు పెంచాయి. ఇక రెవెన్యూ లోటు బడ్జెట్ అంచనాలతో పోలిస్తే 30.8శాతంగా ఉంది. అంటే రూ.1.82 లక్షల కోట్లుగా ఉంది. రెవెన్యూ వ్యయంలో జీతాలు, పింఛ్లు, వడ్డీచెల్లింపులు, సబ్సిడీలు వంటివి ఉంటాయి. ఇందుకుభిన్నంగా బడ్జెట్ అంచనాల్లో పొందుపరిచిన విధంగా పన్ను, పన్నేతర రాబడులు, గ్రాంట్లు వంటివి రెవెన్యూ రాబడులుగా ఉంటాయి. ఏప్రిల్‌లో 2.03 లక్షలకోట్లుగా ఉన్నాయి. అంటే బడ్జెట్ అంచనాల్లో 5.7శాతంగా ఉన్నట్లు తేలింది. మొత్తం వ్యయం కూడా బడ్జెట్ అంచనాల్లో 10.8శాతానికి చేరుకుని రూ.5.75 లక్షల కోట్లుగా ఉన్నాయి. ముగిసిన ఆర్థికసంవత్సరంలో ఆర్థికలోటు బడ్జెట్ లక్ష్యాల్లో 97.5శాతానికి చేరింది. కాగ్ లెక్కల ప్రకారంచూస్తే జిడిపిలో ఆర్థిక లోటు 4.4శాతంగా ఉంది. అంటే రూ.15.19 లక్షలకోట్లు, రెవెన్యూ లోటు రూ.18.20 లక్షల కోట్లుగా ఉంది. రెవెన్యూ రాబడులు గత ఏడాది రూ.338.60 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక మొత్తం వ్యయం పరంగాచూస్తే రూ.490.52 లక్షల కోట్లు అని కాగ్ నివేదించింది.

## పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 4.9శాతంగా నమోదు

**ముంబయి, జూన్ 1:** భారత పారిశ్రామిక ఉత్పత్తిసూచీ ఏప్రిల్ నెలకుగాను 4.9శాతంగా నమోదయింది. గత ఏడాది ఇదే కాలానికి గాను 5.7శాతంగా నమోదయిన వృద్ధి ఈసారి వెనుకంజ వేసింది. 2022-23 సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుని సోమవారం ఉత్పత్తిసూచీ వివరాలను ప్రకటించింది. ఉత్పత్తిరంగంలో 6.2శాతంగా ఉంది. ఎన్ఎస్ఒ విడుదలచేసిన గణాంకాలను పరిశీలిస్తే ఐఐపి ఏప్రిల్‌నెలలో 118.9 పాయింట్లుగా ఉంది. గత ఏడాది ఇదే నెలలో 113.1 పాయింట్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. విద్యుత్, గ్యాస్ రంగాల సూచీలు 125.5గా ఉన్నాయి. గత ఏడాది ఇదేనెలలో 119.6 పాయింట్లతో పోలిస్తే పెరిగింది. మంచినీటి సరఫరా, మురుగు నీటిశుద్ధి వ్యవస్థ, నీటిసంరక్షణ సూచీ 137.1 పాయింట్లనుంచి 146.1 పాయింట్లకుపెరిగింది. ఇక మైనింగ్ క్వారీయింగ్‌రంగాల్లో మాత్రం క్షీణించింది. 110.2 పాయింట్లనుంచి 104.6 పాయింట్లకు దిగజారింది. కేంద్ర అర్థగణాంకశాఖ, పథకనిర్వహణ మోస్పీ అంచనాలప్రకారం 23 ఉత్పత్తిరంగ గ్రూపులు సానుకూల వృద్ధిననమోదుచేసాయి. మోటారు వాహనాలు, ట్రైలర్లు, సెమి ట్రైలర్లు, విద్యుత్ సామగ్రి, ఇతర పరికరాలు వృద్ధిలో ఉన్నాయి. ఇక భారీ యంత్రాల తయారీ ఉత్పత్తి 16శాతం, ఇంటర్మీడియేట్ గూడ్స్ ఉత్పత్తి 7.7, మౌలికవనరులు, నిర్మాణరంగ ఉత్పత్తులు 7.1 శాతం, వినియోగరంగ ఉత్పత్తులు 4.3శాతం, నాన్ కన్స్యూమర్ ఉత్పత్తులు 2.8శాతం పెరిగాయి.



## పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర

**న్యూఢిల్లీ, జూన్ 1:** వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ల ధరలను ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పెంచాయి. జూన్1 నుంచి ఈ కొత్తధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ. 42 పెరగడంతో రూ.3,113.50కి చేరింది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడం సామాన్య ప్రజలకు ఊరటనిచ్చింది. ఈధరలపెంపు ఇతర నగరాల్లోనూ వర్తిస్తుంది. కోల్‌కతాలో 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ.53.50 పెరిగి రూ. 3,255కి చేరుకుంది. తాజా పెంపుతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.3294కు చేరింది. ఇక చెన్నైలో రూ.3232, పాట్నాలో 3322గా ఉంది. వీటితో పాటు ఢిల్లీలో 5 కేజీల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ (ఎఫ్టీఎల్) సిలిండర్ ధర కూడా రూ.11 పెరిగి రూ. 821.50కి చేరింది.

## మే నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 1:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. 2026 మే నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నేడు ప్రకటించింది. గత సంవత్సరం ఇదే నెలలో వసూలైన రూ.1.88 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 3.2 శాతం అధికం. రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.67 లక్షల కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 3.3 శాతం ఎక్కువ. ఏప్రిల్‌లో నమోదైన రికార్డు స్థాయి రూ.2.43 లక్షల కోట్ల వసూళ్లతో పోలిస్తే మే నెలలో ఆదాయం తగ్గింది. ప్రతి సంవత్సరం ఆర్థిక సంవత్సరం ముగింపు తర్వాత మే నెలలో వసూళ్లు తగ్గడం సాధారణమేనని అధికారులు చెపుతున్నారు. ఈసారి జీఎస్టీ వసూళ్లలో దిగుమతులు కీలక పాత్ర పోషించాయి.

దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 2.6 శాతం తగ్గి సుమారు రూ.1.34 లక్షల కోట్లుగా నమోదు కాగా, దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు 19.1 శాతం పెరిగి రూ.59,654 కోట్లకు చేరుకోవడం గమనార్హం. మే నెలలో మొత్తం రిఫండ్‌లు 2.6 శాతం పెరిగి రూ.27,281 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో అంటే ఏప్రిల్, మేనెల స్థూల జీఎస్టీ వసూళ్లు 6.2 శాతం వృద్ధితో రూ.4.37 లక్షల కోట్లకు చేరాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.



డిసిపల్లిలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

## డిసిపల్లిలో మంత్రి ఆనం పెన్షన్ల పంపిణి

**మర్రిపాడు (నెల్లూరు), జూన్ 1 ప్రభాతవార్త:** ప్రతి నెల 1వ తేదీ రాష్ట్రంలో పింఛన్ల పండుగగా మారిపోయిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మర్రిపాడు మండలం డిసిపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్ళి మంత్రి ఆనం పంపిణీ చేశారు. పండుగ వాతావరణంలో సాగిన కార్యక్రమంలో మంత్రి స్వయంగా లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి పెన్షన్లు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందనే భరోసా కల్పించేందుకు ప్రతి నెల ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్ళి పెన్షన్లు పంపిణీ విధానంపై లబ్ధిదారులు పూర్తి సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ డి.గంగాధర్, జనరల్ సెక్రటరీ బి.వెంకటనారాయణరెడ్డి, భీమవరం పిఎసిఎస్ అధ్యక్షుడు యర్రమల చిన్నారెడ్డి, డిఆర్‌డిఎ పిడి నాగరాజ కుమారి, ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని, మర్రిపాడు మండల ఐకెపి ఎపిఎం బుజ్జమ్మ, సిసి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



పొగాకు బేళ్ళను పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**మర్రిపాడు (నెల్లూరు), జూన్ 1 ప్రభాతవార్త:** పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ధరల సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందులు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మర్రిపాడు మండలం డిసిపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని స్థానిక రైతుతలో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు.
పొగాకు రైతు లందరూ తమ ఇబ్బందులను మంత్రికి వివరించి గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లా డుతూ పొగాకు రైతుల సమస్యలను ముఖ్య మంత్రి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ వ్రాసినట్లు తెలిపారు. త్వరలో ఢిల్లీలో జరిగే సమావేశాల్లో పాల్గొని రైతుల సమస్యలను నేరుగా కేంద్ర ప్రభుత్వానికి వివరిస్తామన్నారు.
పొగాకు కొనుగోళ్ళలో రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కంపెనీలను కోరుతామన్నారు.
పొగాకు బోర్డు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతుల సమస్యలపై చర్చిస్తామన్నారు.
పొగాకు నిల్వ, మార్కెటింగ్, ధరల స్థిరీకరణ అంశాలపై సమగ్ర నివేదిక రూపొం దించి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. రైతులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం తరపున అన్ని విధాల కృషి చేసి మంచి ధర కల్పించి రైతులు నష్టపోకుండా ఆదుకుంటామని మంత్రి ఆనం రామానారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎఎంసి ఛైర్మెన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, పొగాకు బోర్డు ఎఎస్ ఎం.సునీల్ కుమార్, పొగాకు రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, వేలం కేంద్ర నిర్వహణాధికారి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజధాని అమరావతి కోసం పెదమద్దూరులో 12 మంది రైతుల భూముల అప్పగింత

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు మరోసారి తమ అంకితభావాన్ని చాటారు. పెదమద్దూరు గ్రామానికి చెందిన 12 మంది రైతులు స్వచ్ఛందంగా మొత్తం 11.34 ఎకరాల భూమిని రాజధాని అభివృద్ధి కోసం సోమవారం సీఆర్డీఏ అధికారులకు అప్పగించారు. భూములు సమర్పించిన రైతుల్లో ఈసంపాటి వేణుగోపాలాచార్యులు 4.07 ఎకరాలు, మేకా సుష్మ 1.90 ఎకరాలు, బొంత వీరయ్య 2.05 ఎకరాలు, గుమ్మ మోనిక 0.72 ఎకరాలు, నల్లిబోయిన వీరయ్య 0.50 ఎకరాలు, జాస్తి వెంకటేశ్వరరావు 0.48 ఎకరాలు, వడ్లమూడి వెంకట్రావు 0.34 ఎకరాలు, రాయపూడి శ్రీహరి 0.24 ఎకరాలు, మీసాల జనార్ధన్ 0.24 ఎకరాలు తదితర రైతులు ఉన్నారు. పెదమద్దూరు సీఆర్డీఏ యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రైతులు తమ భూమి సమర్పణకు సంబంధించిన అంగీకార పత్రాలను సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్లు రత్నకుమార్, ఎన్. యేసు రత్నంకు అందజేశారు. అనంతరం అధికారులు భూ సమీకరణ ప్రక్రియలో భాగంగా ఫారం2 పత్రాలను అందజేసి రసీదులను జారీ చేశారు.
ఈ సందర్భంగా రైతు మేకా సుష్మ, వేణుగోపాలచార్యులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, అమరావతి నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉందని, అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా రూపుదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ, భూ సమీకరణలో భాగంగా రైతులకు ఎకరానికి రూ.40 వేల కౌలు జమ అయ్యేలా సీఆర్డీఏ అధికారులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పురపాలక శాఖ మంత్రి నారాయణతో నిరంతరం చర్చలు జరిపి కృషి చేసిన స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములు ఇవ్వటం రాష్ట్రాభివృద్ధిపై వారి నమ్మకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రైతుల సహకారంతో అమరావతి నిర్మాణం మరింత వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్లు రత్నకుమార్, ఎన్.యేసు రత్నం, పెదమద్దూరు గ్రామ టిడిపి అధ్యక్షులు పొదిలె శ్రీనివాసరావు, తాడికొండ మాజీ ఎంపిడిఒ మేకా సుబ్బారావు, ఎన్. సాంబశివరావు, సిఆర్‌డిఎ అధికారులు, సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఇటు సంక్షేమం.. అటు అభివృద్ధి

### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కొడవలూరు (నెల్లూరు), జూన్ 1 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న పైప్‌లైన్ పనులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందన్నారు. మెగా డిఎస్సీని పారదర్శకంగా నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించామని, ప్రస్తుతం వారు ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారని చెప్పారు. డిఎస్సీ నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నాయకులు అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలపార్టీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి, ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, తువ్వర ప్రవీణ్ కుమార్, కరకటి మల్లికార్జున్, మంది రమణారెడ్డి, మయూరి సిద్ధార్థ, బండి కిరణ్‌కుమార్, బాబి యోగానంద రెడ్డి, గరికపాటి రాజేంద్ర, బండి ప్రవీణ్‌కుమార్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సీలో అక్రమాలు.. రద్దు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట వైసిపి ధర్నాలు**

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీలో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా వైసిపి విభజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రకటించిన డిఎస్సీ నిర్వహించకుండా రద్దు చేసి మెగా డిఎస్సీ అంటూ చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయులను మోసగించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన డిఎస్సీలో అన్ని అక్రమాలేనన్నారు. క్రీడా కోటాలో అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని వైసిపి యువజన నాయకులు ఆరోపించారు. ఈ అంశంపై ఆయా జిల్లా కలెక్టరేట్‌లో విజ్ఞాపన పత్రాలు అందజేసారు.

## లింగ నిర్ధారణ పరీక్షల కేసులో మరో ఇద్దరు అరెస్టు




**బంగారుపాళ్యం(చిత్తూరు జిల్లా), జూన్ 1 ప్రభాతవార్త:** లింగ నిర్ధారణ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ముఠాపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారు అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన చిత్తూరు మిట్టూరుకు చెందిన బి.సుధాకర్‌రెడ్డి, కెజి సత్రంకు చెంది నాగరాజులను సోమవారం అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కత్తి నరసింహులు తెలిపారు. ముఠాగా ఏర్పడిన సభ్యులు గుట్టు చప్పుడు కాకుండా రాగిమానుపెంట పంచాయతీ చంద్రశేఖరపురం గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటలో నిర్మాణంలో వున్న నివాస గృహంలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తు పట్టుబడ్డారు. ఈ కేసులో ఇప్పటికే చిత్తూరు నగరానికి చెందిన బి.పద్మావతి, చిత్తూరు ఎస్టేట్‌కు చెందిన జ్యోతి, కెజి సత్రంకు చెందిన ఆటోడ్రైవర్ జ్యోతీష్, బిఎల్ కండ్రిగ గ్రామంకు చెందిన పవన్‌కుమార్‌లను అరెస్టు చేయడం జరిగిందన్నారు. పరారీలో వున్న ప్రధాన నిందితుడు సుధాకర్‌రెడ్డి, నాగరాజులను సోమవారం కాటప్పగారిపల్లి బస్టాప్ వద్ద అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ రెడ్డప్ప ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట దివ్యాంగురాలు ఆత్మహత్యాయత్నం

### - అర్హత ఉన్నప్పటికీ ఎఎన్ఎం ఉద్యోగం ఇవ్వలేదని మనస్తాపం

**చిత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖలో తనకు అర్హత వున్నప్పటికీ ఉద్యోగం ఇవ్వకుండా వైద్యశాఖ అధికారులు వేధిస్తున్నారని మనస్థాపం చెందిన ఓ దివ్యాంగురాలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న సమయంలో కిరోసిన్ క్యాను పట్టుకొని ఓ దివ్యాంగురాలైన మహిళ అక్కడికి వచ్చింది. అలా వచ్చిన మహిళ తన శరీరంపై కిరోసిన్ పోసుకోవడంతో అక్కడే సొమ్మసిల్లి పడిపోయింది. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులను ఆమె నుండి కిరోసిన్ క్యాన్‌ను లాక్కొని ఆమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఆర్ పురం మండలం ఉప్పరపల్లి గ్రామంకు చెందిన మనెమ్మ శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళ. ఈమె ఎస్ఆర్ పురం మండలం ఉప్పరపల్లి గ్రామంకు చెందిన మహేష్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. ఈ క్రమంలో ఆమె వైద్య ఆరోగ్యశాఖలో నాన్ లోకల్ కేటగిరిలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే తనకు రావాల్సిన ఉద్యోగంను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇతరులకు ఇచ్చి తనకు తీరని అన్యాయం చేశారని, తాను ఉద్యోగం కోసం పలుమార్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం చుట్టూ ప్రదిక్షిణలు చేసినా తనను ఎవరు పట్టించుకోవడం లేదని ఆమె వాపోయారు. తనకు ఉద్యోగానికి అన్ని అర్హతలు వున్నప్పటికీ వైద్య శాఖ అధికారులు ఇవ్వకపోవడంతో మనస్థాపం చెంది తాను ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డానని ఇకనైనా వైద్యశాఖ అధికారులకు తనకు న్యాయం చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.




## జెఇఇ అడ్వాన్స్డ్ 2026 ఫలితాలలో ఆలిండియా 100లోపు 9 ర్యాంకులతో భాష్యం

## జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరి ర్యాంకులతో అగ్రస్థానంలో భాష్యం

**గుంటూరు, జూన్ 1 ప్రభాతవార్త:** జెఇఇ అడ్వాన్స్డ్ 2026 ఫలితాలలో భాష్యం ఐఐటి జెఇఇ అకాడమీ విద్యార్థులు ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. సోమవారం విడుదలైన ఫలితాలలో భాష్యం ఐఐటి జెఇఇ అకాడమీ విద్యార్థి వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఓపెన్ కేటగిరిలో అలిండియా 34వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారన్నారు. ప్రవీణ్ కుమార్ రెడ్డి 6వ తరగతి నుండి భాష్యం ఐఐటి ఫౌండేషన్ తో ఈ ఘన విజయాన్ని కైవసం చేసుకున్నట్లు రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా వివిధ కేటగిరిలలో జె. చాము వర్షిత్ ఆలిండియా 3వ ర్యాంకు, సిహెచ్. సాహిల్ ఆలిండియా 6వ ర్యాంకు, డి.పవన్ ఆలిండియా 16వ ర్యాంకు, కె.రామకృష్ణారెడ్డి ఆలిండియా 23వ ర్యాంకు, వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆలిండియా 34వ ర్యాంకు, హఫీజ్ నూర్ బాషా ఆలిండియా 42వ ర్యాంకు, వై.ప్రవచన ఆలిండియా 54వ ర్యాంకు, ఆర్.బాలానాయక్ ఆలిండియా 76వ ర్యాంకు, సిహెచ్.వెంకట నాగపవన్ ఆలిండియా 82వ ర్యాంకు వంటి 100లోపు 9 ఆలిండియా ర్యాంకులు, 200లోపు 21 ర్యాంకులు, 500లోపు 53 ర్యాంకులు, 1000లోపు 93 ర్యాంకులు, 2000లోపు 126 ర్యాంకులు మరియు 5000లోపు 235 ఆలిండియా ర్యాంకులు సాధించడంతో పాటు ఐఐటి సెలెక్షన్స్‌లో ఆలిండియా అల్ టైం ది బెస్ట్‌గా నిలిచిందన్నారు. అన్ని పోటీ పరీక్షా ఫలితాలలో ఆల్ రౌండర్స్ గా నిలుస్తున్న భాష్యం ఐఐటి అకాడమీ విద్యార్థులను చూస్తే గర్వంగా ఉందని, ఈ అద్భుత ఫలితాలకు పక్కా ప్రణాళికతో కూడిన మా భాష్యం ఐఐటి ఫౌండేషన్ కరిక్యులమే ముఖ్య కారణమన్నారు. ఇటీవల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ జెఇఇ మెయిన్‌లో ఓపెన్ కేటగిరిలో 100 పర్సంటైల్‌తో పాటు ఆలిండియా 11వ ర్యాంకు సాధించిన టి.దుర్గా సుప్రభాత్‌కు రూ.10 లక్షల చొప్పున ఉన్నత చదువు నిమిత్తం నగదు ప్రోత్సాహక చెక్కును అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులను ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, భాష్యం ఐఐటి ప్రోగ్రామర్ ఆనందకుమార్‌లు అభినందించారు.

## ఇఎపిసెట్ ఫలితాలు వాయిదా

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కల్పించే ఏపీ ఈఏపీసెట్ ఫలితాలపై కీలక ప్రకటన వెలువడింది. జూన్ మూడో వారంలో ఫలితాలు వెల్లడించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటికే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ ఫలితాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో రిజల్ట్స్ వాయిదా పడటంతో మరికొంత కాలం ఎదురుచూడక తప్పేలా లేదు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ 2026 ఫలితాలు జూన్ 1న విడుదల చేస్తామని గతంలో ప్రకటించారు. కానీ తాజా సమాచారం ప్రకారం జూన్ మూడో వారంలో ఈ ఫలితాలు వెలువడనున్నాయి. ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ. ఆంధ్రప్రదేశ్ ప్రవేశ పరీక్షల నిబంధనల ప్రకారం, ఈఏపీసెట్ ర్యాంకును కేటాయించేటప్పుడు కేవలం ప్రవేశ పరీక్ష మార్కులను మాత్రమే కాకుండా, ఇంటర్మీడియట్‌లో వచ్చిన మార్కులకు 25 శాతం వెయిటేజీ కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్, సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. వీటి ఫలితాలు రాకుండా ఈఏపీసెట్ ర్యాంకులు ప్రకటిస్తే.. ఇంప్రూవ్‌మెంట్ రాసే లక్షలాది మంది విద్యార్థులకు ఈ ర్యాంకుల కేటాయింపులో అన్యాయం జరుగుతుందని భావించిన అధికారులు ఫలితాల విడుదలను వాయిదా వేశారు. ఒకవేళ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 1న ఫలితాలు ప్రకటిస్తే, ఇంప్రూవ్‌మెంట్, సప్లిమెంటరీ ఫలితాల తర్వాత మార్కులు పెరిగితే ప్రస్తుతం విద్యార్థులకు కేటాయించిన ర్యాంకుల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటాయి. ఇదే జరిగితే కౌన్సెలింగ్ ప్రక్రియలో తీవ్ర గందరగోళం తలెత్తుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఉన్నత విద్యామండలి అధికారులు.. విద్యార్థులలో ఎవరికీ అన్యాయం జరగకుండా, సమానంగా, పారదర్శకంగా అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈఏపీసెట్ ఫలితాల విడుదలను వాయిదా వేశారు. ప్రభుత్వం ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాకే ఈఏపీసెట్ ర్యాంకులను వెల్లడించాలని నిర్ణయించింది.

## జెఇఇ అడ్వాన్స్‌డ్- 2026లో డాక్టర్ కెకెఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి ఆలిండియా 9వ ర్యాంకు

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త:** ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్- 2026లో డాక్టర్ కెకెఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి ఆలిండియా 9వ ర్యాంకు సాధించాడు. సోమవారం విడుదలైన జెఇఇ అడ్వాన్స్‌డ్- 2026 పోటీ పరీక్ష ఫలితాలలో డాక్టర్ కెకెఆర్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యార్థులు వివిధ కేటగిరీలలో మొదటి 100లోపు 16 ర్యాంకులు సాధించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో పసల మోహిత్ 26వ ర్యాంకు, బిజ్జం వెంకట చంద్రశేఖర్ రెడ్డి 38వ ర్యాంకు, చిన్న పవన్ తేజ 56వ ర్యాంకులతో పాటు 9, 22, 22, 24, 26, 31, 35, 38, 46, 49, 55, 56, 74, 79, 80, 80 సాధించారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది.




## జెఇఇ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాల్లో ఆలిండియా టాప్ 20లో 6 ర్యాంక్‌లతో నారాయణ డామినేషన్!

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త:** సోమవారం ప్రకటించిన జెఇఇ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలలో నారాయణ విద్యార్థులు టాప్ ర్యాంకులతో మరోసారి సత్తాచాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో కుచి సందీప్ 5 వ ర్యాంక్, మను పరమేశ్వరన్ 13 వ ర్యాంకు, ప్రిన్స్ చౌదరి 14 వ ర్యాంక్, వెల్దుర్తి హర్షిత్ 15 వ ర్యాంక్, తనయ్ అగర్వాల్ 16 వ ర్యాంకు, అనీష్ ముప్పాల 20వ ర్యాంక్‌తో టాప్ 20 ర్యాంకుల్లో 6 ర్యాంకులు నారాయణ కైవశం చేసుకుంది. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 22, 23, 24, 27, 35, 39, 41, 44, 51, 54, 57, 58, 60, 61, 63, 71, 72, 75, 78, 79, 80, 83, 84, 89, 98, 99, 100 100 5 35, 500 5 133 ర్యాంకులు, 1000 లోపు 217 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి.సింధూర నారాయణ, పి. శరణి నారాయణ తెలిపారు. అలాగే ఆలిండియా అన్ని కేటగిరీల్లో ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 2, 4, 5, 6, 6, 7, 9 వంటి 10లోపు 16 ర్యాంకులు, 50లోపు 69 ర్యాంకులు, 100లోపు 147, 500లోపు 540, 100లోపు 894 ర్యాంకులను కైవసం చేసుకుని ఐఐటి ఆశయాలను సాకారం చేయటంలో వేరెవ్వరూ నారాయణకు సాటిలేరని, సాటిరారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 190000 మందికి పైగా విద్యార్థులు పోటీపడిన ఈ పరీక్షా ఫలితాలలో అత్యధిక సంఖ్యలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సింధూర నారాయణ మాట్లాడుతూ ఈ అద్భుతమైన విజయానికి కుచి సందీప్ నాయకత్వం వహించాడని పేర్కొన్నారు. కుచి సందీప్ ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా 5వ ర్యాంక్ సాధించాడని తెలిపారు. హైదరాబాద్‌కి చెందిన సందీప్, నారాయణ స్కూల్స్‌లో 10వ తరగతి, నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివినట్లు చెప్పారు. అతను ఒలింపియాడ్ స్వర్ణ పతక విజేత కూడా. అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్ 2025లో స్వర్ణ పతకం గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచాడు. ఇప్పుడు ఉజ్బెకిస్తాన్‌లో జరగనున్న అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్ 2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి మరోసారి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.
నారాయణలో అనితర సాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్‌లు, మైక్రోషెడ్యూల్, బెస్ట్ స్టడీమెటీరియల్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్, టాప్ ఫ్యాకల్టీతోనే ఇంతటి ఘనవిజయానికి కారణాలని తెలిపారు.
8వ తరగతి నుండే జేఈఈకి అవసరమైన శిక్షణ అందించటం తోపాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా మన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల్లో ఎలాంటి క్లిష్టమైన ప్రశ్నలు వచ్చిన తక్కువ సమయంలో సరైన సమాధానం గుర్తించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నా మన్నారు.
డైరెక్టర్ శరణి నారాయణ మాట్లాడుతూ ఎన్‌లెర్న్ యాప్ ద్వారా ఛాప్టర్ వైజ్ ప్రాక్టీస్ టెస్టులు, ఆన్‌లైన్ మాక్ టెస్టులు నిర్వహించటం వల్లనే నారాయణ విద్యార్థులు ఇంతటి ప్రతిభాపాటవాలను ప్రదర్శించగలిగారని తెలిపారు. ఈ విధానాల వల్లే తెలుగు రాష్ట్రాల నుండి అత్యధిక విద్యార్థులు, జాతీయస్థాయిలో నారాయణ నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఐఐటిల్లోకి ప్రవేశిస్తున్నట్లు పేర్కొన్నారు. టాప్ ర్యాంకులు సాధించిన వారికి అత్యధిక సంఖ్యలో నారాయణ స్కూల్స్ చదివిన విద్యార్థులే ఉన్నారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలిపారు.




## జెఇఇ అడ్వాన్స్‌డ్ 2026లో తిరుగులేని శక్తిగా శ్రీచైతన్య

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026 పరీక్షలో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తమ అపూర్వ ప్రతిభను చాటుకున్నాయి. సోమవారం విడుదలైన జెఇఇ అడ్వాన్స్‌డ్- 2026 ఫలితాల్లో సౌతిండియా నెం.1 శ్రీచైతన్యయే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 4వ ర్యాంక్ మోహిత్ ఎస్ఎస్, తెలంగాణ బెస్ట్ ర్యాంక్ శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థిదే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 9వ ర్యాంక్ ఎం నాగ సహర్ష, ఆంధ్రప్రదేశ్ బెస్ట్ ర్యాంక్ శ్రీచైతన్య విద్యార్థిదే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10వ ర్యాంక్ దర్శ్ సిక్కాతోపాటు టాప్10లోపు 3 ర్యాంకులు. టాప్100లోపు 4, 9, 10, 17. 21, 26, 28, 30, 31, 36, 37, 38, 40, 41, 44, 45, 52, 56, 59, 62, 64, 66, 67, 72, 73, 74, , 79, 81, 87, 91, 92, 93, 95, 98, 99 ర్యాంకులతో టాప్ 100లో 35కు పైగా ర్యాంకులు, అలాగే టాప్ 1000లో 196కు పైగా ర్యాంకులు సాధించి తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించారు. ఇదే విజయ పరంపరను కొనసాగిస్తూ, జెఇఇ మెయిన్ 2026లో కూడా శ్రీచైతన్య విద్యార్థులు 300/300 పరిపూర్ణ మార్కులతో రెండు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులను సాధించారు. అదేవిధంగా టాప్ 100లో 27 ర్యాంకులు, టాప్ 1000లో 166 ర్యాంకులు సాధించి అసాధారణ ప్రతిభను కనబరిచారు. ఈ అద్భుత విజయాల సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకాడెమిక్ డైరెక్టర్ సిఇఒ సుష్మ బొప్పన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పరిపాలనా సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "శ్రీచైతన్యలో అమలు చేస్తున్న వినూత్నమైన పరిశోధనాధారిత శాస్త్రీయ విద్యా కార్యక్రమాలు, అత్యున్నత స్థాయి అకాడెమిక్ ప్రణాళికలు, విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం, పరిపాలనా బృందం సమిష్టి కృషి ఫలితంగానే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయి.
జెఇఇ మెయిన్, జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వరుసగా సాధిస్తున్న ఈ అసాధారణ ఫలితాలు మా విద్యా విధానాల ప్రభావాన్ని, నాణ్యతను, నిరంతర శ్రేష్ఠత సాధనను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఐఐటీ మద్రాస్ జోన్‌లో టాప్ 500 లోపు 50 పైగా ర్యాంకులు శ్రీ చైతన్యనే కైవశం చేసుకుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారతదేశంలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల రంగంలో శ్రీచైతన్య మరోసారి తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అత్యుత్తమ ఫలితాలతో విజయపథంలో ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు.




## జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రెసోనెన్స్ విజయ కేతనం

## వందలాది మంది విద్యార్థులకు ఐఐటీ సీట్లు

**హైదరాబాద్, జూన్ 1 ప్రభాతవార్త:** జెఇఇ అడ్వాన్స్‌డ్- 2026 ఫలితాలలో రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు విజయ కేతనం ఎగురవేశాయి. ఓపెన్, ఇతర కేటగిరీలలో పదిహేడు మంది విద్యార్థులు వెయ్యి లోపు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. రెసోనెన్స్ వివిధ క్యాంపస్‌ల నుంచి 185 మందికి పైగా విద్యార్థులు దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలలో ప్రవేశాలు పొందనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెసోనెన్స్ విద్యా సంస్థల డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థుల ప్రదర్శన అద్భుతమన్నారు. ఇది వారి కష్టాన్ని, సబ్జెక్టుపై ఉన్న స్పష్టతను, రాణించాలన్న పట్టుదలను ప్రతిబింబిస్తుందన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఫ్యాకల్టీ, అకడమిక్ బృందాలు విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, ప్రాక్టీస్, ప్రేరణను అందించాయన్నారు. భవిష్యత్తు ఐఐటియన్లను తీర్చిదిద్దేలా ప్రయాణాన్ని కొనసాగించడానికి ఈ ఫలితాలు మాకు మరింత స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో మరొక విజయవంతమైన సంవత్సరంతో, ఐఐటీ జెఇఇ కోచింగ్‌లో అగ్రగామి సంస్థలలో ఒకటిగా తన ఖ్యాతిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఓపెన్ కేటగిరీ, వెయ్యి లోపు టాప్ ర్యాంకర్లు అభినవ్ చిట్టూరి 11వ ర్యాంకు, గంటా ప్రజ్ఞేష్ 94వ ర్యాంకు, సపవత్ పావన సమీక్ష 105వ ర్యాంకు, శెట్టిపల్లి అన్వితరెడ్డి 190వ ర్యాంకు, చీర మనస్విని 273వ ర్యాంకు, బదావత్ అక్షి త్ 315వ ర్యాంకు, బోర్నెల్ హర్షిత్ కుమార్ 397వ ర్యాంకు, బునేటి ఆదిత్యరెడ్డి 435వ ర్యాంకు, పవార్ కరణ్ పాండు 602వ ర్యాంకు, ఆదిత్య కృష్ణ వర్రే 790వ ర్యాంకు, మంద సాత్విక్ 803వ ర్యాంకు, తిష్య ఈశ్వర్ కొంకటి 804వ ర్యాంకు, సమృద్ధ్ భట్టాచార్య 889వ ర్యాంకు, రేవంత్ వంగాల 956వ ర్యాంకు, ప్రేమ్ కుమార్ కే 959వ ర్యాంకు, బోద ప్రీతం 960వ ర్యాంకు, సాకేత్ రెడ్డి

# దక్షిణ కొరియా ఫంక్షనల్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ పెట్టుబడులు

● ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో సంస్థ ప్రతినిధుల సమావేశం



**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై ప్రముఖ దక్షిణ కొరియా ఫంక్షనల్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ ప్రతినిధులతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశమై చర్చలు జరిపారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కల్పన, ఫుట్‌వేర్, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తుల తయారీ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఫంక్షనల్ ఫుట్‌వేర్ బ్రాండ్ షూఆల్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేయగా, పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని మంత్రివర్యులు హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాల పెరుగుదలకు, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయని పేర్కొన్నారు.

## ఇకనైనా రెచ్చగొట్టే కుట్రలను వైసిపి వీడాలి: మంత్రి అనగాని

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇకనైనా కుల, మత, విధ్వంసాలు, రెచ్చగొట్టే కుట్రలను వైసిపి వీడాలని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ విగ్రహాన్ని వైసిపి వాళ్లే ధ్వంసం చేసి తెదేపాపై నెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు వైకాపా కుట్రలు చేస్తోందన్నారు. దుష్ప్రచారాలు చేయడమే వైసిపి నాయకలు పనిగా పెట్టుకున్నారు. వైసిపి నాయుకుడు జంబులయ్యానే విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తేలింది. ఈ కుట్రలో టీడీపీను ఇరికించేందుకు వైసిపి ప్రయత్నం చేసింది. విగ్రహ ధ్వంసం కుట్ర బహిర్గతం కాగానే దృష్టి మళ్లించడానికి డీఎస్సీపై పడ్డారు. యువత బాగుండకూడదనే కుట్రతో డీఎస్సీపై గొడ్డలి పార్టీ అసత్య ప్రచారం చేస్తోందిన అవినీతి బయట పడే కొద్దీ గొడ్డలి పార్టీ అధినేతలో ఆక్రోశం పెరుగుతోంది. ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసిన మీ అవినీతికి శిక్షలు తప్పవు. పీఏలు, పీఏల బినామీలు బాగోతమంతా బయటపెట్టి తీరుతాం అని మంత్రి అన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజాభాగస్వామ్యముండాలి

● యునిడో ఎస్ఐఎపి ముగింపు సదస్సులో వక్తలు ● పట్టణాభివృద్ధి నిపుణులు, మున్సిపల్ కమీషనర్లు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరు

**విజయవాడ (కార్పొరేషన్), జూన్ 1 ప్రభాతవార్త:** విజయవాడ నగరపాలక సంస్థ సహకారంతో ఐక్య రాజ్య సమితి పారిశ్రామికాభివృద్ధి సంస్థ, గ్లోబల్ ఎన్విరాన్‌మెంట ఫెసిలిటీ, కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్‌ల సంయుక్త అధ్వర్యంలో నిర్వహిస్తున్న సెస్టనబుల్ సిటీస్ ఇంటగ్రేటెడ్ అప్రోచ్ పైలెట్ ముగింపు సదస్సు సోమవారం విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో ఘనంగా ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విధాన రూపకర్తలు, పట్టణాభివృద్ధి నిపుణులు, సాంకేతిక నిపుణులు, నగర పాలక సంస్థ ప్రతినిధులు సహా 120 మందికి పైగా రెండు రోజుల సదస్సులో పాల్గొనా న్నరు. పట్టణ సుస్థిరత, వాతావరణ చర్యల పురోగతితో అనే అంశంపై జరుగుతున్న ఈ సరస్సును గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సురభి మాలిక్ ప్రారంభించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కె.మయూర్ అశోక్, పురపాలక శాఖ కమీషనర్, డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమా ర్(వర్చువల్‌గా), ఎన్ఐయూఏ డైరెక్టర్ డాక్టర్ డెబోలినా కుండు, ఎన్ఐయూఏ రిసోర్స్ అండ్ వేస్ట్ విభాగాధిపతి పరమితా దత్తా డే, ఐసీఎల్ఈఐ సౌత్ ఏషియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇమాని కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యునిడో సబ్ రీజినల్ ఆఫీసర్ డైరెక్టర్ క్రిస్టియానో పసిని, యునిడో ప్రధాన కార్యాలయం వియన్నాకు చెందిన రికార్డో సావిగ్లియానో, జీఈఎఫ్ సెక్రటేరియట్ సస్టైనబుల్ సిటీస్ ప్రోగ్రాం లీడ్ అలోక్ బర్నివాల్ వీడియో సందేశాల ద్వారా సుస్థిర పట్టణాభివృద్ధికి సమిష్టి కృషి అవసరాన్ని



వివరించారు. అనంతరం యునిడో సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ నంద్‌పాల్‌సింగ్, నేషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ దీపికా లేలే స్కాప్ ప్రాజెక్ట్ ప్రయాణం, సాధించిన విజయాలు, పట్టణ వాతావరణ చర్యలలో అందించిన సేవలపై సమగ్ర ప్రెజెంటేషన్ అందించారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమీషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర మాట్లాడుతూ పట్టణాల సుస్థిర అభివృద్ధి కోసం స్థానిక సంస్థలు వినూత్న కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సు తొలిరోజున వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డీకార్బనైజింగ్ సిటీస్' అంశంపై నిర్వహించిన ప్యానెల్ చర్చలో నిపుణులు, పట్టణ ఘన వ్యర్థాల నిర్వహణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, తక్కువ కార్బన్ ఆధారిత అభివృద్ధి విధానాలపై విస్తృతంగా చర్చించారు. పట్టణ సుస్థిరతకు సంబంధించిన పలు కీలక అంశాలపై మరిన్ని శాంసేతిక సమావేశాలు, చర్చలు కొనసాగాయి. ఈ సదస్సు ద్వారా దేశవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల మధ్య ఉత్తమ పద్ధతుల మార్పిడి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, వాతావరణ మార్పులకు అనుగుణమైన చర్యల అమలు మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు.

## పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించేందుకు చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పదే పదే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అధికంగా పెంచి ప్రజలపై గుదిబండ వేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా విమర్శించారు. ధరలను తగ్గించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడొక ప్రకటన విడుదల చేశారు.

గత 15 రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలను నాలుగుసార్లుగా రూ.8లు పెంచి, ప్రజల నడ్డి విరిచింది. విపరీతంగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలతో రవాణా ఖర్చులు, నిత్యవసర వస్తువుల ధరలతో సహా పలు వస్తువుల ధరలు పెరిగి జనజీవనం అస్తవ్యస్తమవుతుంది. డీజిల్ ధరలు పెరిగాయనే కారణంగా ఎపిలో ఆర్‌టిసి బస్సు చార్జీలను పెంచేందుకు ఉద్యుక్తమవుతోందన్నారు.

## స్వచ్ఛ ఇంధన పురోగతిలో ఎపి కీలక పాత్ర

**ట్రాన్స్‌కో జెఎండి డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ర**

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో స్వచ్ఛ ఇంధన రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్ర తెలిపారు. 2025 ఐఏఎస్ బ్యాచ్ అండర్ ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవరం విద్యుత్ సౌధలో రాష్ట్ర ఇంధన రంగంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌చంద్ర మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పారిశ్రామిక వృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, విపత్తు నిర్వహణ సామర్థ్యాల బలోపేతానికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అత్యంత కీలకమని వివరించారు. విద్యుత్ అనేది కేవలం ఒక మౌలిక సదుపాయ సేవ మాత్రమే కాకుండా, సమగ్ర అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ రంగ ప్రాజెక్టుల అమలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పారిశ్రామిక పెట్టుబడులకు సహకారం, ప్రభుత్వ సంక్షేమ పతకాల అమలు, విపత్తుల సమయంలో సమన్వయం వంటి అంశాల్లో జిల్లా పరిపాలన కీలక బాధ్యతలు నిర్వహిస్తోందని తెలిపారు. విద్యుత్ రంగంపై విస్తృత దృక్పథాన్ని వివరిస్తూ 532 గిగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంలో భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి దేశంగా ఎదిగిందని చెప్పారు. అలాగే, వాతావరణ మార్పుల నివారణ లక్ష్యాలకు అనుగుణంగా 50 శాతానికి పైగా నాన్‌ఫాసిల్ ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యాన్ని దేశం ఇప్పటికే సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ డిమాండ్ వేగంగా పెరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 780000 మిలియన్ యూనిట్లుగా చేరుకునే అవకాశముందని అంచనాలు సూచిస్తున్నాయని వెల్లడించారు. ఏపీ జెన్కో ట్రాన్స్కో డిస్కాంట్లు లు ఎన్ఇడిసిఏపి సంస్థలు కలిసి దాదాపు 214000 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 2.03 కోట్లకు పైగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందిస్తున్నాయని తెలిపారు.

## చెస్ టోర్నీ ఆరంభం



**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌ను విట్ క్యాంపస్‌లో డిజిపి హరీష్‌కుమార్ గుప్తా.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విట్, ఎపి చెస్ అసోసియేష్ సంయుక్తంగా టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అమరావతి దేశ విదేశాల చెస్ మేధావుల కలయికకు వేదికగా నిలుస్తోందన్నారు. ఇది కేవలం క్రీడా పోటీ కాదు.. క్రమశిక్షణ, మేధస్సు, ప్రతిభకు వేదుక అన్నారు. చెస్ భారతదేశంలో పుట్టి ప్రపంచాన్ని చుట్టివచ్చి మళ్లీ అమరావతిలో అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందుతోందన్నారు. స్వర్ణాంధ్ర2047,' వికసిత్ భారత్ లక్ష్యాలకు చెస్ ప్రతీకగా నిలుస్తోంది. అమరావతిలో తొలి ఫిడే (నీదిని) చెస్ ఈవెంట్ నిర్వహణ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న భారతదేశానికి నిదర్శనం అన్నారు. ఈ టోర్నమెంట్‌లో భవిష్యత్ గ్రాండ్‌మాస్టర్లు, ప్రపంచ ఛాంపియన్లు కనిపిస్తున్నారని డిజిపి వ్యాఖ్యనించారు. ఆంధ్రప్రదేశ్‌లో చెస్‌కు అనుకూలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మించి భవిష్యత్ ఛాంపియన్లకు కేంద్రంగా తీర్చిదిద్దాలి అన్నారు. అమరావతి కేవలం పరిపాలనా రాజధాని కాదు.. భవిష్యత్తు జ్ఞాననగరం రానున్న సంవత్సరాల్లో అమరావతి ప్రపంచ స్థాయి నాలెడ్జ్ సిటీగా రూపుదిద్దుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌ను బ్రాండ్‌గా తీర్చిదిద్దినట్లే.. అమరావతిని క్వాంటమ్ వ్యాల్యీగా అభివృద్ధి చేస్తున్నారు.

## అంతరాష్ట్ర దొంగల అరెస్టు

● రూ.80 లక్షల విలువ గల చోరీ సొత్తు స్వాధీనం



**శ్రీకాకుళం, జూన్ 1 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాల కేసులను కాశీబుగ్గ పోలీసులు సమర్థవంతంగా ఛేదించి ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లా, ఇంగ్లీష్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన గోయస్పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మీజాన్ (36) మహమ్మద్ హసన్ (26)లు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి 12 తులాల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి ఆభరణాలు, రూ.1,09,350 నగదు, సుమారు రూ.1 లక్ష విలువైన మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం చోరీ సొత్తు విలువ సుమారు రూ.80 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసుల ఛేదనలో కాశీబుగ్గ పోలీస్ సిబ్బంది అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేయడంలో విశేష ప్రతిభ కనబరిచారు. కేసును చేధించి నిందితులను అరెస్ట్ చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.

## డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి



**తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలను ఖండిస్తూ, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలనిడిమాండ్ చేస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్ వంశీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించారు. వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి సూచనలతో, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్ రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. డిఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. యువతకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు దినేష్ రాయల్, సత్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



● ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్

**తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 57 వినతులు అందాయి. ఈ కార్యక్రమం ద్వారా పలువురు విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ఎస్పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్‌డి) కె.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళికుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం.ఉమాపతి, కె.సంపత్‌కుమార్, సిహెచ్ రామచంద్రరావు, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు సురేంద్ర రావు, చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, లత, పిఆర్ఓ తోట మధుసూదన పాల్గొన్నారు.



## సిఎం చంద్రబాబుకు మరింత శక్తినివ్వమని వేడుకున్నా: స్పీకర్

**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని కొనియాడారు. ఇందుకు మరింతగా సిఎంకు శక్తిని ప్రసాదించాలని శ్రీవారిని వేడుకున్నానన్నారు. తిరుమలలో సోమవారం ఆయన రాష్ట్ర రాజకీయాలు, తన భవిష్యత్తు కార్యాచరణపై అయ్యన్నపాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన వయస్సు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తన కుటుంబ సభ్యులకు కూడా రాజకీయంగా, పార్టీలో సేవ చేసే అవకాశం కల్పించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజాసేవలో తన కుటుంబం కూడా భాగస్వామ్యం కావాలని అయ్యన్న పాత్రుడు ఆకాంక్షి ంచారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. పెళ్లి రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నానని చెప్పారు. స్వామివారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కుటుంబంతో కలిసి తిరుమలకు వచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలను

## పరశురామేశ్వరుని సేవలో స్పీకర్

**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 1 ప్రభాతవార్త:** ఏర్పేడు మండలం గుడిమల్లంలోని ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు సోమవారం కుటుంబసభ్యులతో పూజలకు వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరి నాయుడు స్వాగతం చెప్పారు. ఆలయంలోని స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఓ మునిశేఖర్ చైర్మెన్ గిరినాయుడులు ఆలయ చరిత్రను తెలిపే ప్రత్యేక పుస్తకాన్ని అందించారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు చింతకాయల విజయ్‌కుమార్ ఉన్నారు. కమిటి సభ్యులు పల్లం రాజకుమార్ నాయుడు, వేదపండితులు వంశీకృష్ణ శర్మ తదితరులు ఉన్నారు.

## గరుడునిపై కల్యాణ వెంకన్న అభయం

**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిజిల్లా నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి గరుడవాహన సేవ అత్యంతవేడుకగా జరిగింది. కైంకర్యాలు ముగించుకున్న స్వామివారు తనకెంతో ఇష్టమైన గరుడునిపై కొలువుదీరి ఆలయ మాఢవీధుల్లో విహరించారు. శోభాయమానంగా విశేషాభరణాలంకృతుడైన కల్యాణ వెంకన్న కలియుగంలో భక్తుల పాపాలను తొలగించేందుకు వస్తున్నానని తెలియజేశారు. 108 దివ్యదేశాలలో గరుడవాహన సేవకు ఎంతో విశిష్టత ఉంది. కాగా ఉదయం స్వామి మోహినీ అలంకారంలో పల్లకిపై దివ్యంగా విహరించి భక్తులకు కనువిందు చేశారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని పులకించిపోయారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## తిరుపతి- రక్సౌల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



**తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి- రక్సౌల్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్‌లో తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్యే శ్రీనివాసులు ప్రారంభించారు. రైల్వేస్టేషన్ డైరెక్టర్ మోహన్ కృష్ణ పాల్గొన్నారు. గతంలో ప్రత్యేక రైలుగా నడిచిన ఈ సేవను ఇప్పుడు శాశ్వత ఎక్స్‌ప్రెస్ రైలుగా ప్రవేశపెట్టారు. తిరుపతి నుంచి రేణిగుంట, కడప, గుంతకల్, సికింద్రాబాద్, బిలాస్‌పూర్, రాంచీ మార్గాల మీదుగా సుమారు 2,795 కిలోమీటర్లు, 59 గంటలు ప్రయాణించి రక్సౌల్ చేరుకుంటుంది.

ఈ సందర్భంగా డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఇన్‌చార్జ్ స్టేషన్ డైరెక్టర్ మోహన కృష్ణ మాట్లాడుతూ ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల నుండి తిరుపతికి వచ్చే యాత్రికులకు ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, గతంలో నడిచిన ప్రత్యేక రైలుతో పోలిస్తే రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలులో టికెట్ చార్జీలు తక్కువగా ఉండటంతో ప్రయాణికులకు ఆర్థికంగా కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ మండల వాణిజ్య అధికారి, స్టేషన్ డైరెక్టర్ మోహనకృష్ణ, ఏఎస్‌సి రాజగోపాల్ రెడ్డి, స్టేషన్ మేనేజర్ చిన్న రెడ్డప్ప, కమర్షియల్ విభాగం సిసిఐ శ్రీకాంత్, తిరుపతి స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



**టిటిడి ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.11 లక్షలు విరాళం**

**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లలో దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. దుబాయ్‌కు చెందిన మనోజ్, నేహా దాతలు టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు సోమవారం రూ.11 లక్షలు విరాళంగా అందించారు. దాతలు హైదరాబాద్‌లో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును కలసి విరాళం డిడిని అందజేశారు.



### తిరుమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వేళ్ళే మొదటిఘాట్‌లో సోమవారం ఆర్టీసి బస్సును వ్యాన్ ఢీ కొంది. ఘాట్‌లో వాహనాలు ఒకటి వెనుక ఒకటి రావడంతో జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోయినా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 12వ మలుపు వద్ద ఆర్టీసి బస్సును యాత్రికుల వాహనం ఢీకొంది. పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది చేరుకుని వాహనాలను పక్కకు తీయడంతో ట్రాఫిక్ సమస్య తొలగించారు. వాహనాలు రాకపోకలు సాగించాయి.

### తిరుమలలో జోరువాన...

**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం, సాయంత్రం తిరుమలలో వర్షం కురిసింది. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమవారం ఉదయం నుండి వాతావరణంలో మార్పుతో మధ్యాహ్నం చల్లటిగాలులు వీచి జోరువాన కురవడంతో భక్తులూ ఆనంద పరవశులయ్యారు. సాయంత్రం మొదలైన వాన రాత్రి కూడా చిరుజల్లులు పడుతూనే ఉంది. కురిసిన వరదనీటికి ఆలయం పరిసరాలు, ఘాట్‌రోడ్లు జలమయంగా మారాయి. ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు వానలో తడుస్తూనే గదులకు చేరుకోవాల్సి వచ్చింది. చిన్నపిల్లలు, వృద్ధులు గదుల నుండి బయటకు రావాలంటే ఇబ్బందులు పడ్డారు.

### కార్వేటినగరం వేణుగోపాలస్వామి 6 నుండి వార్షిక బ్రహ్మోత్సవాలు



**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 6 నుండి 14 వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాల గోడపత్రికలు, బుక్‌లెట్‌ను సోమవారం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర టిటిడి పరిపాలనా భవనంలో ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు ముందుగా నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, జూన్ 5న అంకురార్పణం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. జూన్ 6న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. జూన్ 9న సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం, జూన్ 10న గరుడసేవ, జూన్ 13న వైభవంగా రథోత్సవం నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి అన్ని విభాగాల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు ఇఒ రవిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.114 కోట్లు

● 25.45లక్షల మంది భక్తులకు దర్శనం ● మేలో రికార్డు స్థాయిలో గణాంకాలు



**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** అసలే వేసవి సెలవులు, ఆపై కొనసాగుతున్న విపరీత భక్తుల రద్దీతో అటు శ్రీవారి దర్శనం ఇటు కానుకల ద్వారా హుండీ ఆదాయం కూడా గణనీయంగా నమోదైంది. గడచిన మే నెలలో 25.45లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.114 కోట్లు చేకూరింది. మే నెలలోనూ హుండీ ఆదాయం వందకోట్ల రూపాయలు పైగానే రికార్డు చేకూరింది.

మే నెలలో విద్యా సంస్థలకు వేసవి సెలవులు కావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. 24న 98,058 మంది భక్తులు దర్శనం చేసుకోగా 23న 97,561 మంది, 30న 92,010 మంది భక్తులు, మే 2న 91,005 మంది, 12న 91,020 మంది, 31న 90,826 మంది భక్తులకు మహాలఘులో ఏడుకొండల స్వామి దర్శనం చేయించారు. మే 16న 90,011 మంది, 26న 89,403 మంది, 25న 89,399 మంది, 22న 87,689 మంది, 20న 86,315 మంది, మే 3న 83,091 మంది భక్తులు ఇలా సరాసరి రోజువారీగా 80వేల మంది వరకు భక్తులకు ప్రశాంతంగా శ్రీవారి దర్శనం కల్పించారు. 16లక్షల మంది పైగా తలనీలాలు సమర్పించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మే నెలలో శ్రీవారి దర్శనాలు, హుండీ ఆదాయం, తలనీలాల సమర్పణలో కొత్త రికార్డులు నమోదైనట్లు టిటిడి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా టిటిడి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా సర్వదర్శనం భక్తులు వేచి ఉండే కంపార్ట్‌మెంట్లలో నిరంతరాయంగా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలు అందించి వారికి ఇబ్బంది కలగకుండా చూసింది. స్వామి వారిపై తమకున్న భక్తిని భక్తులు కానుకల రూపంలో చెల్లించుకున్నారు. మే నెలలో శ్రీవారి హుండీ ద్వారా రికార్డు స్థాయిలో రూ.114 కోట్ల ఆదాయం లభించింది. నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా భక్తులు పెద్దఎత్తున సమర్పించారు. మే నెలలో వరుసగా 2వ తేదీ రూ.5.06 కోట్లు, 27న రూ.4.99 కోట్లు, 25న రూ.4.92 కోట్లు, 18న రూ.4.41 కోట్లు, మే 21న రూ.4.35 కోట్లు, 22న రూ.4.29 కోట్లు హుండీ కానుకలు లభించాయి. 26న రూ.4.14 కోట్లు, 24న రూ.4.09 కోట్లు, 31న 3.99 కోట్లు, 8న రూ.3.90 కోట్లు, 17న రూ.3.54 కోట్లు ఇలా వరుసగా 3.50కోట్ల రూపాయలుపైగానే హుండీకి కానుకలు రూపంలో రావడం విశేషం. రానున్న జూన్ నెలలోనూ ఇదే రీతిలో ఆదాయం రావచ్చని టిటిడి వర్గాల అంచనా.

## ఘంటసాలకు పుష్పాంజలి

**తిరుపతి, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వివి మహల్ రోడ్‌లోని ఘంటసాల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఘంటసాల అభిమాని వెంకట్రావుని ఘనంగా సత్కరించారు. తన గానామృతంతో తెలుగు ప్రజలను ఉర్రూతలూగించిన ఘంటసాలను స్మరించుకోవడం ప్రతి తెలుగువారి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, చిత్రపు హనుమంతరావు, ఘంటసాల అభిమానులు కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, పోలే జనార్ధన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, టీచర్ తిరుమలయ్య, గోవిందు, పురోహితుడు సురేష్ స్వామి, తులసిరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 22న గోవిందరాజస్వామి ఆలయంలో పుష్పయాగం

**తిరుమల, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ సోమవారం పుష్పయాగ మహోత్సవం వేడుకగా జరగ నుంది. ఇందుకు 21వ తేదీ ఆదివారం రాత్రి అంకురార్పణ చేస్తారు. 22వ తేదీ పుష్పయాగం సందర్భంగా గోవిందరాజస్వామి ఆలయంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుండి సాయంత్రం 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో గోవిందరాజస్వామి భక్తులకు దర్శనమిస్తారు.